

ప్రజలే ప్రభువులు

# జనబలం

జూలై 2023 | లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక | రూ.10/-


## పెరుగుతున్న జీవనశైలి వ్యాధుల ప్రమాదం..
## బలమైన ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థే ఔషధం




## ఓటరు జాబితా అవకతవకలపై 'ఓట్ ఇండియా - సేవ్ డెమొక్రసీ'










# సమగ్ర విధానం కొరవడటం వల్లే భారత్‌లో ఆరోగ్య సంక్షోభం




ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల మన దేశంలో కోట్లాది మంది ప్రజలకు ఆరోగ్య సంరక్షణ కరువవుతోందని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ ఆవేదన వ్యక్తం చేశారు. తక్కువ ఖర్చుతో అందరికీ ఆరోగ్యం అందించే అవకాశం ఉన్నా సరైన విధానం లేకపోవటం వల్ల నినాదంగానే మిగిలిపోయిందన్నారు. బడ్జెట్ కేటాయింపులు తగినంత లేకపోవటం, ఆ వ్యయం కూడా సరైన దిశలో లేకపోవటం వల్ల ఆరోగ్య రంగంలో సంక్షోభం నెలకొందన్నారు. వయసు, లింగ భేదం లేకుండా జీవనశైలి వ్యాధులు దేశానికి ప్రమాదకరంగా తయారవుతున్నాయన్నారు. ఉత్పాదక శక్తిని దెబ్బతీసే ఈ సమస్యను ఎదుర్కోవటానికి సమగ్ర ఆరోగ్య విధానం అవసరమన్నారు. ఇన్‌స్టిట్యూట్ ఫర్ డయాబెటిక్ ఎండొక్రైనాలజీ అండ్ అడిపోసిటీ (ఐడిఇఎ) హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయ సదస్సులో జేపీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సరైన విధానం లేకుండా వైద్యంలో ప్రభుత్వాలు భారీగా ఖర్చు చేసినంత మాత్రాన ప్రజలకు ఆరోగ్యం అందదని, అమెరికాయే ఇందుకు ఉదాహరణన్నారు. భారత్ ప్రాథమిక ఆరోగ్యానికి, ఔట్ పేషెంట్ సేవలకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఆస్పత్రి చికిత్సను మొదటి ప్రాధాన్యాంశంగా తీసుకోకూడదన్నారు. వైద్యానికయ్యే ఖర్చు ప్రజలకు భారం కాకుండా చేయటం వల్ల మన దేశంలో పేదరికాన్ని తొలగించగలమన్నారు. భారత ప్రభుత్వం జీడీపీలో 9-10% ఆరోగ్య రంగానికి కేటాయించనక్కర్లేదని, ఇప్పుడు చేస్తున్న ఖర్చు కంటే కేవలం 1% అదనంగా ఖర్చు చేస్తే చాలన్నారు. దేశంలో ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లను, వివిధ దేశాల ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థ నమూనాలను అధ్యయనం చేసి భారతదేశ పరిస్థితులకు అనుగుణంగా వాటిని అన్వయించాల్సిన ఆవశ్యకతను జేపీ వివరించారు. విదేశాల్లో ఆధునిక వైద్య పద్ధతుల్ని అభ్యసించి భారత్‌లో తక్కువ ధరలో నాణ్యమైన వైద్యం అందిస్తున్న డాక్టర్లను అభినందించారు. ఆరోగ్య రంగంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ప్రోత్సహించాల్సిన అవసరముందన్నారు. డాక్టర్లు కేవలం వైద్యానికి పరిమితం కాకుండా, ప్రజలందరికీ ఆరోగ్యం అందించే లక్ష్యసాధన కోసం కృషి చేయాలన్నారు, దేశంలో సరైన ఆరోగ్య విధానాన్ని అమలు చేస్తే భారీ స్థాయిలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. వైద్య, ఔషధ రంగాల్లో భారత్‌కున్న బలాల్ని సద్వినియోగం చేసుకుంటూ తక్కువ ఖర్చుతో మంచి ఆరోగ్య వ్యవస్థను నిర్మించవచ్చన్నారు. ఇటువంటి సదస్సులు ఎక్కువ జరిగితే లక్ష్యాల్ని వేగంగా సాధించవచ్చన్నారు. ఐడియా క్లినిక్‌ల డయాబెటిస్ కేర్ ఎట్ హెూమ్‌ను ప్రొఫెసర్ డాక్టర్ రాకేష్ సహాయ, డాక్టర్ శ్యామ్ కలవలపల్లి తదితరులతో కలిసి జేపీ ప్రారంభించారు.

ప్రజలే ప్రభువులు

# జనబలం


లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక

సంపుటి 25 సంచిక 7

జూలై 2023

సంపాదకవర్గం

బండారు రామ్మోహనరావు

శిరమని నరేష్

వర్కింగ్ ఎడిటర్

దూసనపూడి సోమసుందర్


## జనబలం చందా రుసుము వివరాలు

| | |
|---|---|
| సంవత్సర చందా | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | రూ. 1200.00 |

*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*

### చందాదారులకు విజ్ఞప్తి

చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను.

## కార్టూన్ కార్నర్




చెయ్యి అవసరం లేదు.. మీ అలవాట్లు, లైఫ్‌స్టైల్ చెప్పండి చాలు!!


కార్యాలయ చిరునామా : H.NO. 6-3-678, B-106 , పాషా కోర్టు, 71 , సోమాజీగూడ, త్రిభువన్‌దాస్ జ్యూయలరీ వెనుక, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288, 040-23419949

Email: accountsdept@loksatta.org

సంపాదకీయం

# ఏకాభిప్రాయ సాధన ద్వారానే ఉమ్మడి పౌరస్మృతి!

ఉమ్మడి పౌరస్మృతి బిల్లు దిశగా కసరత్తు మొదలయ్యింది. ఉమ్మడి పౌరస్మృతి సంబంధిత భాగస్వామ్య పక్షాల, ప్రజల సలహాలు, సూచనలు కోరుతూ లా కమిషన్ జూన్ 14వ తేదీన నోటిఫికేషన్ ఇచ్చింది. రెండు వారాల్లోనే తమకు ఇరవై లక్షల స్పందనలు అందాయని లా కమిషన్ చైర్మన్ జస్టిస్ రితురాజ్ అవస్థి తెలిపారు. జూన్ 27వ తేదీన ప్రధానమంత్రి నరేంద్రమోదీ భోపాల్‌లో తమ పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేస్తామని ఉద్ఘాటించారు. దేశంలో ప్రజలందరికీ ఒకే పౌరస్మృతి ఉండాలని, ఒక తరగతి ప్రజలకు ఒక స్మృతి, మరో తరగతి ప్రజలకు మరో స్మృతి అమలులో ఉండటం కుదరదని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. 'బుజ్జగింపు' తమ విధానం కాదని ఆయన వ్యాఖ్యానించారు.

దేశంలో ఉమ్మడి పౌరస్మృతి అమలులోకి తెస్తామని భారతీయ జనతాపార్టీ తన ఎన్నికల ప్రణాళికల్లో తొలినుండీ చెబుతూనే వచ్చింది. గత సంవత్సరం జరిగిన ఉత్తరాఖండ్ శాసనసభ ఎన్నికల్లో, ఇటీవల జరిగిన హిమాచల్‌ప్రదేశ్, కర్ణాటక శాసనసభల ఎన్నికల్లో కూడా తాము అధికారంలోకి వస్తే ఉమ్మడి పౌరస్మృతిని అమలులోకి తెస్తామని ప్రకటించింది. ఉత్తరాఖండ్ ఎన్నికల్లో తిరిగి అధికారం చేపట్టిన బీజేపీ ప్రభుత్వం జస్టిస్ రంజనా ప్రకాశ్ దేశాయ్ అధ్యక్షతన ఐదుగురు సభ్యులుగల కమిటీని ఏర్పాటు చేసింది. ఆ కమిటీ తయారు చేసిన ముసాయిదా బిల్లు విషయమై ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్‌ధామి, కమిటీ అధ్యక్షులు రంజనా ప్రకాశ్ దేశాయ్ ఇటీవల హోమ్‌మంత్రి అమిత్‌షాతో భేటీ అయ్యారు. ఆ బిల్లు ఇంతవరకూ బైటికి రాలేదు.

రానున్న వర్షాకాల సమావేశాల్లో గానీ, శీతాకాల సమావేశాల్లో గాని ఉమ్మడి పౌరస్మృతి బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టేందుకు కేంద్రప్రభుత్వం ఏర్పాట్లను చేస్తోంది. ఉమ్మడి పౌరస్మృతిపై సలహాలు, సూచనలు, అభిప్రాయాలు కోరిన విధానం సవ్యంగా లేదన్న విమర్శ సర్వత్రా వినవచ్చింది. ప్రభుత్వం ఒక బిల్లు ముసాయిదాను లేదా తన ప్రతిపాదనలను ముందుగా విడుదల చేసి దానిపై అభిప్రాయాలు కోరి ఉండాల్సిందన్న న్యాయనిపుణుల అభిప్రాయం సమంజసంగానే ఉంది.

2024 ఎన్నికలు, రాష్ట్రాల శాసన సభ ఎన్నికలలో చర్చను భావోద్వేగ అంశాలపైకి మళ్లించడానికి, ప్రధానమంత్రి ఉమ్మడి పౌరస్మృతి అంశాన్ని ఒక పథకం ప్రకారం ముందుకు తెచ్చారనే రాజకీయ విమర్శ కూడా కొట్టిపారేయాల్సింది కాదు. ఉమ్మడి పౌరస్మృతి అవసరాన్ని రాజ్యాంగ రూపకర్తలు గుర్తించారు. రాజ్యాంగ పరిషత్తులో దానిపై చర్చ జరిగింది. దేశ విభజన నేపథ్యంలో నాడు చెలరేగిన అల్లకల్లోల పరిస్థితులు, తీవ్ర ఘర్షణలు, మారణకాండను దృష్టిలో ఉంచుకుని నాటి పాలకులు పౌరస్మృతులకు సంబంధించిన వివాదాలను తాత్కాలికంగా పక్కన పెట్టారు. ఉమ్మడి పౌరస్మృతిని రాజ్యాంగ ఆదేశిక సూత్రాలలో భాగంగా చేర్చారు. రాజ్యాంగం పౌరులకు ప్రసాదించిన ప్రాథమిక హక్కులలో మత స్వేచ్ఛను చేర్చారు. మత విశ్వాసాలను కలిగి ఉండటం, మత వ్యవహారాలను నిర్వహించుకోవడం, మతాన్ని, విశ్వాసాలను ప్రచారం చేసుకోవడం వంటి స్వేచ్ఛలను రాజ్యాంగం పౌరులకు ఇచ్చింది. నేరాలకు సంబంధించిన స్మృతి పౌరులందరికీ సమానంగా వర్తించేటట్లు రూపొందిన రాజ్యాంగంలో పౌరస్మృతి విషయానికి వచ్చే సరికి వివిధ మతాల వ్యక్తిగత చట్టాలకు, ఆచార, వ్యవహారాలకు చోటు కల్పించింది. రాజ్యాంగం ప్రకారమే గోవా రాష్ట్రంలో ప్రత్యేక పౌరస్మృతి అమల్లోకి వచ్చింది. రాజ్యాంగబద్ధంగానే నాగాలాండ్ వంటి ఈశాన్య రాష్ట్రాలలో తెగల ఆచార, వ్యవహారాలకు చట్టబద్ధత లభించింది. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, తరగతుల ప్రజలకు తమతమ మతపరమైన సంప్రదాయాలను, ఆచారాలను పాటించడానికి అవకాశం ఉండటంతో 'పౌరస్మృతి' అమలులో అనేక వ్యత్యాసాలు ఏర్పడ్డాయి. ఒకే దేశం, ఒకే చట్టం నినాదం గొప్ప ఆదర్శమనే విషయంలో ఎవరికీ అభ్యంతరం ఉండాల్సిన పనిలేదు. ఉమ్మడి పౌరస్మృతి మనం సాధించాల్సిన రాజ్యాంగ లక్ష్యం అనే విషయంలో కూడా భిన్నాభిప్రాయం ఏమీ లేదు. ఉమ్మడి పౌరస్మృతి అమలు కోసం బీజేపీ తొలినుండీ డిమాండ్ చేస్తున్న విషయం కూడా అందరికీ తెలిసినదే!

అయితే అందుకు అవసరమైన సామరస్య పూర్వకమైన ఏకాభిప్రాయ సాధనకోసం బీజేపీ చేస్తున్న ప్రయత్నాలు ఏమీ లేవనేది ప్రధాన అవరోధంగా ఉంది. ఉమ్మడి పౌరస్మృతి కోసం తన అభిప్రాయం చెప్పకుండా నేరుగా ప్రజాభిప్రాయం కోరడంలో ఎలాంటి ఔచిత్యమూ లేదు. భిన్నమతాలు, ఆచార వ్యవహారాలు, కులకట్టుబాట్లు, ఆదివాసీ తెగల ఆదిమ సంప్రదాయాలూ బలంగా ఉన్న భారతీయ సమాజంలో సున్నిత అంశాలను నచ్చచెప్పే ధోరణిలో పరిష్కరించాలి. ప్రధానమంత్రి, హోమ్‌మంత్రి చేసే ప్రసంగాలు రాజకీయ ధోరణిలో, భావోద్వేగాలను ఉద్దీపన చేసేవిగా కొనసాగుతున్నాయి. 'మా ప్రభుత్వం బుజ్జగింపు విధానాలు అనుసరించదు' అంటూ ప్రధానమంత్రి చేసిన వ్యాఖ్య ఉమ్మడి పౌరస్మృతిపై జరిగే బహిరంగ చర్చను ప్రతికూలంగా ప్రభావితం చేసింది. ఇరవై కోట్లకు పైగా జనాభా ఉన్న మైనారిటీ మతస్తులను ఒప్పించాలనే ధోరణి కంటే వారి మనోభావాలను ఖాతరు చేయని ఒంటెత్తు వైఖరికే పాలకపక్ష నేతలు ప్రాధాన్యం ఇస్తున్నారు.

వైవిధ్యమూ, బహుళత్వమూ, భిన్నత్వమూ జీవ లక్షణంగా ఉన్న భారతీయ సమాజంలో కోట్లాదిమంది వ్యక్తిగత జీవితాలను ప్రభావితం చేసే ఉమ్మడి పౌరస్మృతి అంశంపై మరింత విస్తృతమైన సంప్రదింపులకు, చర్చలకు ఆస్కారం ఇవ్వాలి. సున్నితమైన అంశాలలో విద్వేషానికీ, భావోద్వేగాలకు తావు లేకుండా చర్చ జరిగే వాతావరణం కల్పించాలి. లా కమిషన్ ఇప్పటికే ప్రజాభిప్రాయాన్ని స్వీకరించే ప్రక్రియ ప్రారంభించింది కాబట్టి, వచ్చిన సూచనలను క్రోడీకరించి ఒక ప్రతిపాదనను తయారు చేసి దేశం ముందుంచాలి. దానిపై లోతయిన చర్చ జరిపి, ఏకాభిప్రాయ సాధన ద్వారా బిల్లును రూపొందించాలి. జాతీయ సమైక్యతకు, సామరస్యానికి హాని జరగని రీతిలో ఉమ్మడి పౌరస్మృతి అమలులోకి తీసుకురావాలి.

డి. సోమ సుందర్




# ఓటరు జాబితా అవకతవకలపై ప్రతి ఇంటికీ వెళ్లి నిగ్గుతేలుస్తాం,

## 'ఓట్ ఇండియా.. సేవ్ డెమోక్రసీ' ప్రత్యేక డ్రైవ్

ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితాలో అవకతవకలపై 'ఓట్ ఇండియా.. సేవ్ డెమోక్రసీ' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా. జయప్రకాష్ నారాయణ్ ప్రకటించారు. ఈ కార్యక్రమం ద్వారా కొన్ని పోలింగ్ బూత్‌లు, నియోజకవర్గాలలో ఇంటింటికీ వెళ్లి సర్వే ద్వారా ఓటర్ల వివరాలను పరిశీలించి వాస్తవాల్ని నిగ్గు తేలుస్తామన్నారు. ఓటు సద్వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంచుతామన్నారు. రాష్ట్రంలో ఒక్కో ఇంటి చిరునామాతో 500 చొప్పున ఓట్లు ఉండటం, కొందరు అర్హుల పేర్లు ఓటరు జాబితాలో లేకపోవటం ఉదంతాలు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. విజయనగరం జిల్లా కేంద్రంలో లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, జిల్లా అధ్యక్షుడు ఆకుల దామోదరరావుతో కలిసి మీడియాతో జేపీ మాట్లాడారు.

'దేశంలో ఒకప్పుడు ఓటర్ల జాబితా తప్పులతడకగా ఉండేది. ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా పోరాటంతో చాలావరకు మెరుగుపడింది. తెలుగునాట మొదలుపెట్టి ఢిల్లీ, మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటకల్లోనూ ఇందుకోసం కార్యక్రమాలు నిర్వహించాం' అని జేపీ తెలిపారు. వచ్చే ఎన్నికల్లో లోక్‌సత్తా పార్టీ పోటీ చేయదని వెల్లడించారు. 'ప్రస్తుతం కోట్లు వెచ్చిస్తేగానీ ఎన్నికల్లో పోటీ చేయలేం. సంపన్న దేశమైన బ్రిటన్‌లో 2019లో జరిగిన ఎన్నికల్లో అయిన మొత్తం ఖర్చు.. తెలంగాణలో ఒక ఉప ఎన్నిక ఖర్చుతో సమానంగా ఉంది. దీన్నిబట్టే దేశ రాజకీయాలను అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుత రాజకీయాలు అధికారం, డబ్బు కోసమే సాగుతున్నాయి. ప్రభుత్వాల్లో ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు తప్ప ఎవరూ స్వతంత్రంగా వ్యవహరించే పరిస్థితి లేదు. భావితరాల భవిష్యత్తు గురించి ఆలోచించటం లేదు. ఇలాగైతే ప్రజాస్వామ్యం ఎక్కువ కాలం నిలబడదు' అన్నారు.

**ఎన్నికల వ్యవస్థను మార్చాలి**

రాజకీయ పార్టీలన్నీ కలిసి ఎన్నికల వ్యవస్థను మార్చకపోతే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవని జేపీ హెచ్చరించారు. 'రాజకీయాన్ని టీ 20 మ్యాచ్‌లా మార్చేశారు. ప్రజలూ క్రీడల్లాగే భావిస్తున్నారు. ఏపీలో మీడియా, ప్రజానీకం చంద్రబాబు నాయుడు, జగన్ భవిష్యత్తు గురించే ఆలోచిస్తున్నారు. వారు కోట్ల రూపాయలకు అధిపతులు. వారికేం కాదు. నష్టపోయేది ప్రజలే' అన్నారు.

**ఆర్థిక వ్యవస్థ విస్తరణ ప్రధాన లక్ష్యం కావాలి**

'ఆర్థికాభివృద్ధి, పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, నైపుణ్యాల పెంపు, ఉపాధి కల్పన లేకుండా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టినంత మాత్రాన అభివృద్ధి జరగదు. ఆర్థిక వ్యవస్థను అందరికీ విస్తరించాలి. గ్రామాల్లో యువత వలస పోకుండా స్థానికంగా ఉపాధి కల్పించాలి. పట్టణీకరణపై దృష్టి సారించాలి. పేదల సంక్షేమానికి ఎన్టీఆర్, వైఎస్సార్‌లు పాటుపడ్డారు. ఎన్టీఆర్ రూ.2 లకే కిలో బియ్యం వంటి సంక్షేమ పథకాలతో పాటు తెలుగుగంగ, వంశధార ఫేజ్-2, పారిశ్రామికీకరణ, విదేశీ పెట్టుబడుల ఆకర్షణ వంటి అభివృద్ధికి దోహదం చేసే పనులూ చేశారు. తాత్కాలిక పథకాలు, అభివృద్ధి మధ్య సమతూకం పాటించారు. నేటి పాలకులు ప్రజలను అమాయకులు చేసి తాయిలాలిచ్చి ఓట్లు వేయించుకుంటున్నారని జేపీ విమర్శించారు.

# ఎన్నికల ప్రక్రియలో తాత్కాలిక ఉద్యోగులు సరి కాదు

ఎన్నికల ప్రక్రియలో ప్రభుత్వం తాత్కాలికంగా నియమించిన వలంటీర్లు తదితరులను కాకుండా, శాశ్వత ప్రాతిపదికన పనిచేసే ప్రభుత్వోద్యోగులను వినియోగించాలని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. తాత్కాలికంగా నియమించినవారిని వినియోగిస్తే వారు ప్రజాసేవకులుగా కాకుండా.. పార్టీ అనుయాయులుగా వ్యవహరించే అవకాశం ఉందన్నారు. మంచి చేసినా.. చెడు చేసినట్లే ఉంటుంది అన్నారు. ఓటర్ల అవగాహన కార్యక్రమం కోసం విజయనగరం వచ్చిన జేపీ 'ఈటీవీ-ఈనాడు'తో మాట్లాడారు.

**పార్టీలు, పౌర సమాజం ముందుకు రావాలి**

ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే చేస్తే ఓట్ల విషయం నిగ్గు తేలుతుంది. పౌరులు మౌనంగా కూర్చోకూడదు. జాబితాలో పేరు లేకపోతే సెక్షన్-6 పేరుతో దరఖాస్తు చేసుకోవాలి. పార్టీలు ప్రలోభాలకు గురిచేస్తున్నా.. వారిలో తమకు నచ్చినవారికే ఓటు వేస్తున్నారు. ఓటరు ప్రక్రియను కాపాడేందుకు అన్ని పార్టీలు, పౌర సమాజ సంస్థలు ముందుకు రావాలి.

**న్యాయం జరగకుంటే పోరాడదాం..**

ఎన్నికలు జరిగేది, ఓటర్ల జాబితా తయారుచేసేది జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోనే. యంత్రాంగం ప్రభుత్వం పట్ల ఎంత పక్షపాతంగా ఉన్నా ఎన్నికల ప్రక్రియ మాత్రం పద్ధతిగా నిర్వహిస్తుంది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇంకా పొరపాట్లు ఉంటే రాష్ట్ర స్థాయిలో ముఖ్య ఎన్నికల అధికారికి, అక్కడా న్యాయం జరగకపోతే జాతీయస్థాయిలో రాతపూర్వకంగా తెలియచేద్దాం.

**ప్రత్యేక బృందం ఏర్పాటు**

ఇప్పటివరకూ జరిగిన ఎన్నికల్లో ఎన్నికల సంఘం, అధికార యంత్రాంగం నిష్పక్షపాతంగా, సమర్థంగా పనిచేస్తున్నాయి. ఎక్కడైనా స్థానికంగా పొరపాట్లు జరిగితే అప్రమత్తమై సాక్ష్యాలను వీడియోలు తీసి అధికారులకు పంపాలి. న్యాయం జరగకపోతే.. రాష్ట్ర స్థాయిలో నిపుణులు, మాజీ అధికారులు, పౌర సమాజంలో నిజాయతీ గలవారిని బృందాలుగా ఏర్పాటు చేయటానికి మేం సిద్ధంగా ఉన్నాం. ఎన్నికల్లో అంతా అక్రమం కాదు. కచ్చితంగా ఓట్లు కొంటున్నారు కానీ, బూత్‌లో అది ఉండదు. ఇది వ్యవస్థీకృతమైన సమస్య. ఓటర్ల జాబితాలో ఎవరైనా అక్రమాలకు పాల్పడినట్లు ఆధారాలుంటే కఠిన శిక్షలు వేయాలి. అప్పుడే మిగిలినవారు జాగ్రత్తగా పనిచేస్తారు.



**65 శాతం మంది ఓటేస్తున్నారు**

ఎన్నికల సంఘం ప్రచారంతో గతం కంటే ఓటింగ్ శాతం పెరిగింది. ప్రస్తుతం 65% మంది ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు. ఓటేయకపోతే నాయకులు పట్టించుకోరన్న భయంతో పేదలు ఓటేస్తున్నారు. డబ్బులు, తాయిలాలు అందవేమో అన్న భయంతో మరికొందరు వేస్తున్నారు. అన్ని దేశాల్లో చదువుకున్నవారు ఎక్కువ ఓటేస్తుండగా, మన దేశంలో దానికి విరుద్ధం.

**శాశ్వత ఉద్యోగులనే ఎన్నికల ప్రక్రియలో వినియమించాలి**

ఒక ప్రభుత్వం తాత్కాలికంగా నియమించినవారిని ఎన్నికల ప్రక్రియలో వినియోగిస్తే పక్షపాతాలకు దారితీస్తుంది. వారు పార్టీ కార్యకర్తల్లాగే పనిచేస్తారు తప్ప, ప్రభుత్వ యంత్రాంగంలా చేయరు. ఇది ప్రభుత్వానికి, ఉద్యోగులకు మంచిది కాదు. శాశ్వత ఉద్యోగులనే ఎన్నికల ప్రక్రియలో ఉపయోగించుకోవాలి.

# తుమ్మితే ఊడిపోయే ముక్కు - సామాన్యుడి ఓటు హక్కు


-పి.వి గోపాలకృష్ణ

ప్రజాస్వామ్య దేశం అంటే దేశప్రజలు ఎన్నుకున్న ప్రతినిధుల ఏలుబడి ఉన్న దేశం. మన దేశం ప్రజాస్వామ్య దేశమే. దానిక్కారణం మన ఏలికలని ఓటు హక్కు ఉన్న వయోజనులందరం ఎన్నుకుంటున్నాం కదా. అని అనుకుంటున్నాం. కదా. వయోజనులందరికీ మన రాజ్యాంగం ఓటు హక్కు ఇచ్చింది. అంటే వయోజనులందరూ అంటే పద్దెనిమిదేళ్ళు నిండిన ప్రతి ఒక్కరు ఓటు వేస్తున్నారు. కదా. నిజంగా వేస్తున్నారా? అంటే, ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేనాటికి ఓటర్ల జాబితాలో పేర్లు నమోదై ఉన్న వయోజనులు అందరూ ఓటు వేస్తున్నారు. కదా.

మరి పేరులేని వయోజనుల పరిస్థితి? రాజ్యాంగం ఇచ్చిన వారి ఓటు హక్కు?

**ఓటర్‌దే బాధ్యత**

ఓటరు జాబితాలో తమ పేరు నమోదై ఉన్నదీ లేనిదీ చూసుకోవలసిన బాధ్యత ఓటరుదే. గత ఎన్నికలలో ఓటు వేసాను కదా నా ఓటు అదే పోలింగ్ బూత్‌లో జాబితాలో అలాగే భద్రంగా ఉంటుంది అనుకుంటూ కూర్చుంటే రాబోయే ఎన్నికల రోజు జాబితాలో పేరులేకపోవడం వలన ఓటు వెయ్యలేని పరిస్థితి ఎదురైతే దానికి మరెవ్వరూ బాధ్యులు కారు, మీరే బాధ్యులు అంటోంది ఎలక్షన్ కమిషన్.


ఈనాడు
epaper.eenadu.net

ఓటరు జాబితాలో దొంగలు పడ్డారు!

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగానే అనుమానం ఉన్న వాటిని తొలగించినట్లు తెలిసింది. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో నగరపాలక సంస్థలోని మొత్తం 21 డివిజన్లు ఉన్నాయి. 2019 ఎన్నికల్లో ఇక్కడ వైకాపా అభ్యర్థి మల్లాది విష్ణు కేవలం 25 ఓట్లతో తెదేపా అభ్యర్థి బొండా ఉమాపై గెలిచారు. దీంతో ఇప్పుడు ఓటర్ల జాబితాను కావల్సినట్లు మారుస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. నియోజకవర్గంలోని 18, 21, 35, 152, 193 నంబరు పోలింగ్ బూత్‌ల పరిధిలో తనిఖీ చేయగా పలు ఓట్లు గల్లంతైనట్లు తెలిసింది. బూత్ నంబరు 193లో 364 ఓట్లలో చాలా ఓట్లు గల్లంతయ్యాయి. ఓటరు కార్డులున్నా జాబితాలో పేర్లు కనిపించడం లేదు.

**ఏం జరుగుతుందో?**

జనవరిలో విడుదల చేసిన ఓటర్ల జాబితాలో డోర్ నంబరు లేకుండానే వందలాది ఓట్లు కనిపిస్తున్నాయి. నియోజకవర్గంలోని పలు పోలింగ్ బూత్‌ల్లో ఇదే కథ.

- 24వ డివిజన్‌లోని 152వ నంబరు బూత్‌లో డోర్ నంబరు అనే చోట 'కడియాల వారి వీధి' అని ఉంది. దీనిలో ఏకంగా 506 ఓట్లున్నాయి.
- 23వ డివిజన్‌లో 193వ నంబరు బూత్‌లో డోర్ నంబరు లేకుండానే 364 ఓట్లు కనిపిస్తున్నాయి.
- 58వ డివిజన్ 35వ నంబరు బూత్‌లో 501 ఓట్లు, 59వ డివిజన్ 18వ బూత్‌లో 125 ఓట్లు, 21వ బూత్‌లో 223 ఓట్లు

డోరు నంబరు లేకుండానే ఓటర్ల జాబితా. ఇలా 364 ఓట్లు ఉన్నాయి

ఒకే డోరు నంబరుతో ఓట్ల జాబితా. ఇలా 240 ఓట్లు ఉన్నాయి

**వాణిజ్య ప్రాంతాల్లో అపరిచితుల పేర్లతో ఓట్లు**

ఎక్కువగా వాణిజ్య ప్రాంతాల్లోనే ఇలా అపరిచితుల పేర్లతో జాబితా తయారైంది. 193వ నంబరు బూత్ అంతా గవర్నర్‌పేట, సూర్యారావుపేటల్లోఉంది. ఇదంతా వ్యాపార కేంద్రం. ప్రైవేటు ఆసుపత్రులు, దుకాణాలు, మాల్స్ ఉన్నాయి. నివాస ప్రాంతాలు అక్కడక్కడ మాత్రమే ఉన్నాయి. దీన్ని ఆసరాగా చేసుకుని డోర్ నంబరు లేకుండానే దొంగ ఓట్లను చేర్చి ఉండవచ్చని అనుమానిస్తున్నారు.

**ఒకే డోర్ నంబరు.. వందలాది ఓట్లు**

30వ డివిజన్ పరిధిలో డోర్ నంబరు మిత గృహాలకు ఒకే డోర్ నంబరు ఎలా ఇచ్చారంటే నగరపాలక సంస్థ అధికారులు సమాధానం చెప్పలేకపోతున్నారు. సాధారణంగా పక్కన ఉంటే బై నంబరుతో ఇస్తారు. 236 బూత్‌లో డోర్ నంబరు 30-9-1లో 137 ఓట్లు, 120వ బూత్‌లో డోర్ నంబరు 21-10/2-287లో 176 ఓట్లు, 39వ బూత్‌లో 43-106/1-58 నంబరులో 379 ఓట్లు ఉన్నాయి. బహుళ అంతస్తుల్లో 50 ఫ్లాట్లు ఉన్నా.. మూడేసి చొప్పున 150కి మించి ఉండవు. కానీ అపార్టుమెంట్ల పేరుతో ఒకే డోరు నంబరు వేసి వందలాది ఓట్లు చేర్పించారు. ఇదే విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళితే అవి అపార్టుమెంట్లు కావచ్చని చెబుతున్నారు. అయినా ఓటేసేటప్పుడు గుర్తింపు కార్డు తప్పనిసరి

"It is the responsibility of the citizens to check their names in the list at least once in a year. If they find their names deleted the missing voters and also the new voters can enroll themselves either through BLOs or online," - Mr. Rajat Kumar, CEO, Telangana, New Indian Express, 13th December 2018.

మన ఇంట్లో మన వెండి, బంగారం, టీవి, బండి ఇవన్నీ మన కళ్ళెదురుగా జాగ్రత్తగా ఉన్నాయా లేవా అని రోజూ చూసుకుంటున్నట్టు విలువైన మన కళ్ళెదురుగా లేని ఎక్కడో ఎలక్షన్ కమిషన్ రికార్డులలో ఉన్న మన ఓటు కూడా భద్రంగా ఉందా లేదా అని చూసుకుంటూ ఉండాలి అని ఎలక్షన్ కమిషన్ చెబుతోంది.

ఓటర్ పేర్ల నమోదు ఒక నిరంతర ప్రక్రియ అంటుంది ఎలక్షన్ కమిషన్. అంటే ఓటర్ నిరంతరం తన ఓటు భద్రంగా ఉందా లేదా అని చూసుకునే ప్రక్రియ అని అర్థం కాబోలు.

ఎలక్షన్ కమిషన్ బాధ్యత ఏమిటి?

మరి ఎలక్షన్ కమిషన్ చేసే పని ఏమిటి? అసలు గత ఎలక్షన్‌లో ఓ పోలింగ్ బూత్‌లో ఓటు వేసిన తరవాత మళ్ళీ ఎలక్షన్ నాటికి నాకు తెలియకుండా నాకు నోటీస్ లేకుండా ఆ

పోలింగ్ బూత్ ఓటర్ల జాబితా నుంచి నా ఓటు ఎలా మాయమైపోతుంది?

సామాన్యుడి ఓటు తుమ్మితే ఊడిపోయే ముక్కులా తయారయింది. సామాన్యుడు అంటే ఎవరు? సామాన్యుడు అంటే ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలలో ఏ ప్రమేయం లేనివాడు, అధికారగణం నిర్ణయాలన్నీ భరించవలసినవాడు. రోడ్డుమీది ఆటోరిక్షా కార్మికుడో, లారీ డ్రైవరో, ఇంట్లో పనిమనిషో, వీళ్ళు మాత్రమే కాదు. ఈ విషయంలో, అకారణంగా జాబితానుంచి పేర్లు తొలగించడం అన్న విషయంలో, ఎలక్షన్ కమిషన్ సమానత్వాన్ని చూపెడుతూ, అందరిని సమదృష్టితో చూస్తుంది. సెలబ్రిటీ, అనామకుడు అన్న తారతమ్యాలు లేవు ఎలక్షన్ కమిషన్‌కి. ఏమాటకామాట, ఈ విషయంలో జాతి కుల మత భాషా భేదాలకతీతంగా సమానత్వాన్ని సాధించిన ఘనత శ్రీ ఎలక్షన్ కమిషన్‌ది. ఎలక్షన్ క్రతువులో బలిపశువులుకాడానికి సామాన్యులు, అసామాన్యులు, ప్రముఖులు అన్న భేదం లేదని రుజువు చేసింది.

రెండు తెలుగు రాష్ట్రాలలోనూ రాబోతున్నది ఎన్నికల కాలం. దానికి సమాయత్తమవుతోంది యంత్రాంగం. ఇళ్ళవారీగా జాబితాల సవరణ, కొత్త ఓటర్ల నమోదు, ఇల్లు మారినవారి, చనిపోయినవారి పేర్లు తొలగింపు ఇవన్నీ జూన్ 23 లోగా పూర్తి చేయాలని దీూలాని ఆదేశించింది. కానీ ఇంతలోనే బకాయిలు ఇస్తేనే సర్వేకు హాజరవుతామని, ఇంటి నెంబర్ల ఆధారంగా చిరునామా గుర్తించలేకపోతున్నామని ఎశీశేష్ట్ర శ్రీవజవశ్రీ శీటటఅఎవతీం వాపోయేవారని, సర్వే ఆపేయాలని ఎన్నికల సంఘం ప్రాథమికంగా నిర్ణయించినట్లు జీహెచ్ఎంసి అధికారులు తెలిపారని మరో వార్త వచ్చింది. ఎలక్షన్ కమిషన్ వారు జారీ చేసిన Manual of Electoral Rolls, October 2016, ప్రకారం దీూా లకి ఇచ్చే భత్యం సంవత్సరానికి ఆరు వేల రూపాయలు. అదనంగా అధమం మరో వెయ్యి రూపాయలు (సంవత్సరానికే) ఇంటింటి సర్వే నిమిత్తం.

క్షేత్రస్థాయిలో ఇంటింటికి తిరిగి ఓటర్‌ల పేర్లు నమోదు, తనిఖీ ప్రక్రియలకు, ఎన్నికల నిర్వహణకు ఎలక్షన్ కమిషన్‌కి శాశ్వత సిబ్బంది ఉండదు. ఎన్నికల కమిషన్‌లో ఒక్క చీఫ్ ఎలక్టొరల్ ఆఫీసర్ తప్ప ఎన్నికల పనికోసం పూర్తి సమయాన్ని కేటాయించే శాశ్వత సిబ్బంది ఉండదు. ఎన్నికల సమయంలో మాత్రమే అవసరమయ్యే విషయం కనుక శాశ్వత సిబ్బంది నియామకం అనవసరం, నిర్వహణ ఖర్చు దృష్ట్యా. అందువల్ల ఆపధర్మంగా ఇతర రాష్ట్ర ప్రభుత్వ శాఖల సిబ్బంది ఆయా సందర్భాలలో ఎలక్షన్ కమిషన్ అధీనంలో పని చేయవలసి ఉంటుంది. వారికిచ్చే శిక్షణ, వారి నైపుణ్యం, అనుభవం, ప్రాథమిక జ్ఞానం, వీటిని బట్టి పేర్ల నమోదు, తనిఖీ ప్రక్రియలలో దొర్లే తప్పులు అందరికీ అనుభవమే. ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలోను ఓటర్ల జాబితా తయారీ, సవరణ, విశ్వసనీయతకి బాధ్యతవహించడానికి తాత్కాలిక ప్రాతిపదిక మీద పనిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ సిబ్బంది బూత్ లెవెల్ ఆఫీసర్‌గా నియమించబడుతున్నారు. ఈ పద్ధతి 2006 నుంచి అమలులో ఉంది.

**ఫిజికల్‌గా కాదు రాజకీయంగా బతికే ఉన్నామా?**

ఫిజికల్‌గా బతుకుతున్నామా, చచ్చామా అని తెలుసుకోడానికి డాక్టర్ దగ్గరకెళ్ళక్కర్లేదు కానీ పొలిటికల్‌గా ఉన్నామా, పోయేమా తెలుసుకోవాలంటే మాత్రం శ్రీ ఎలక్షన్ కమిషన్ వారు జారీ చేసిన వార్షిక జాబితాల్లో వెతుక్కోవలసిందే. ఒకసారి ఒక పేరు ఓటర్ జాబితాలోకి ఎక్కిన తర్వాత అది ఎలా, ఎందుకు కనిపించకుండా పోతుంది అన్న ప్రశ్నకి సరైన సమాధానం ఇంతవరకు ఎలక్షన్ కమిషన్ ఇవ్వలేదు. ఏళ్ళ తరబడి ఒక్కచోటే ఉంటున్నవాళ్ళు, ఆ ముందు ఎలక్షన్‌లో కూడా ఓటు చెయ్యగలిగిన వాళ్ళ పేరు ఉన్నట్టుండి ఎందుకు మాయమైపోతుంది.

మా పేర్లు కనబడలేదు మొర్రో అంటూంటే ఉన్నపేరు ఊడినవాళ్ళు, కొత్తవాళ్ళూ కూడా బూత్ లెవెల్ ఆఫీసర్ ద్వారానో ఆన్‌లైన్‌లోనో మళ్ళీ రిజిస్టర్ చేసుకోండి అన్నదే జవాబు. ఈ ప్రక్రియ మొత్తం మీద ఒక ఓటర్‌కి నిరంతరంగా ఉండే బూత్, ఆ బూత్‌కి సంబంధించిన ఆఫీసర్ ఎవరని తెలుసుకొనే అవకాశం ఉందా. ఎంతమందికి ఆన్‌లైన్‌లో తెలుసుకునే జ్ఞానం, అవకాశం ఉన్నాయి? బూత్ లెవెల్‌లో ఒక ఆఫీసు ఉంటుందా అక్కడా ఒక ఆఫీసరుంటాడా?

**BLO అనగా ఎవరు?**

బూత్ లెవెల్ ఆఫీసర్లుగా 13 కేటగిరిలలోని పాక్షిక/పూర్తిస్థాయి ప్రభుత్వ సిబ్బందినుంచి నియమిస్తారు. వారిలో టీచర్లు, కాంట్రాక్ట్ టీచర్లు, అంగన్‌వాడీ పనివారు, ఎలక్ట్రిసిటీ బిల్ రీడర్లు, కార్పొరేషన్ టాక్స్ కలెక్టర్లు, పోస్ట్‌మెన్, నర్సులు, మిడ్‌వైఫ్స్, హెల్త్‌వర్కర్లు, మిడ్ డే మీల్ వర్కర్లు, యూడీసీలు, ఎల్డీసీలు, ఇత్యాదులుంటారు. వీరి చదువు, జ్ఞానం, అనుభవం, నిబద్ధత మీద ఓటర్ జాబితాల తయారీ, సవరణలుంటాయి. ఆన్‌లైన్ దరఖాస్తులైనా చివరికి వీరు చేసే తనిఖీ మీద ఆధారపడి ఉంటుంది. వీరికి ప్రత్యేకంగా బూత్‌లెవెల్ ఆఫీసంటూ ఎక్కడా ఉండదు. గతంలో ఓటు వేసిన పోలింగ్ బూతే బూత్ లెవల్ ఆఫీస్. ముసాయిదా జాబితాలు తయారయ్యాయి వెళ్ళిచూసుకోమని ఎలక్షన్ కమిషన్ వారు ఆదేశిస్తే మనం అక్కడికే వెళ్ళాలి. ఈ దీూలు నిర్ణీత సమయానికి అక్కడ ఉంటే మన అదృష్టం.

**ముసాయిదా జాబితా - నా అనుభవం**

ఎలక్షన్ కమిషన్‌కి కూడా వీరి పనితనం మీద విశ్వాసం అంతంత మాత్రమే. అంచేతనే జాబితాలో పేరు ఉండేలా చూసుకునే బాధ్యత ఓటరు మీదే పెట్టేసింది. 13 డిసెంబర్ 2022 న విడుదల చేసిన ముసాయిదా జాబితాలో దీూా దగ్గరున్నదాంట్లో మా ఇంట్లో నాలుగు ఓట్లలో రెండు గల్లంతయ్యాయి. అంటే యాభై శాతం ఓట్లు పోయాయి. అంతకు మునుపు పోలింగ్ కేంద్రాలు మారిపోయాయి. ముగ్గురి

ఈనాడు
epaper.eenadu.net

# ఓటర్ల జాబితాలో కొన్ని తప్పులు జరిగాయి..

- నిజమైన ఓటర్లనూ కొన్ని చోట్ల తీసేశారు
- అయితే అవి పెద్ద సంఖ్యలో లేవు
- ఒకే ఇంటి నంబర్‌పై 500 పైగా ఓట్లున్నవి ఆరుచోట్ల మాత్రమే
- ముసాయిదా ఓటర్ల జాబితా నాటికి ఈ తప్పులు లేకుండా చూస్తాం
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్‌కుమార్ మీనా స్పష్టీకరణ
- మరోసారి తప్పిదాలు జరిగితే ఉద్యోగులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరిక



విలేకరులతో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్‌కుమార్ మీనా

జనవరి 5న తుది ఓటర్ల జాబితా

Date : 20/06/2023 EditionName : ANDHRA PRADESH PageNo :

పేరుందో లేదో చూసుకోవలసిన బాధ్యత ఓటరుదేనంటోంది ఎలక్షన్ కమిషన్. జాబితా తయారీలో తాముచేసే తప్పులవల్ల ఎలక్షన్ రోజు పేరు కనబడకపోతే బాధ్యత ఓటర్‌దే. ముందస్తుగా జాబితాలో పేరు తనిఖీ చేసుకోవలసిన బాధ్యత ఓటర్‌దే అనడం ఓటర్ మీదకి నెపం నెట్టడమే. ముందుగా తనిఖీ చేసుకున్నప్పుడున్న పేర్లు కూడా చివరి నిముషంలో కనబడలేదని కూడా కొందరి ఫిర్యాదు. తమ తప్పులేదని ఎలక్షన్ కమిషన్ ఆ బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నం చెయ్యకుండా, మీ ఓటు మా బాధ్యత అనగలిగే పరిస్థితి

ఓట్లు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పోలింగ్‌బూత్‌లోకెళ్ళి పడ్డాయి. ఒక ఓటు పాత పోలింగ్ బూత్‌లోనే ఉండిపోయింది. చూసుకోకపోతే పాత పోలింగ్‌బూత్ దగ్గర్లో ఉన్న ఎన్ని బూత్‌లలో వెతికితే మాత్రం ఏం ప్రయోజనం. ఎలక్షన్ రోజునాటికి వాటిని మళ్ళీ పునరుద్ధరించుకోవలసిన ఆగత్యం ఎవరిదీ? BLOదో, ఎలక్షన్ కమిషన్‌దో అయితే కాదు కదా. ఆన్‌లైన్‌లోనో లేదా ఫిజికల్‌గానో మళ్ళీ Form 6 నింపి కొత్త ఓటర్‌గా మళ్ళీ నమోదు చేసుకోవాలంటే అన్నదే జవాబు. ఎలక్షన్ కమిషన్‌కి అంతకు మించి బాధ్యత లేదు. యంత్రాంగం చేసే తప్పులు కూడా ఓటరే సరిదిద్దుకోవాలి. ఆన్‌లైన్ అయినా ఫిజికల్‌గానైనా ఎలా చెయ్యాలో ఎక్కడ చెయ్యాలో నాకు తెలుసు. చేసుకుంటాను. దానికి పట్టే సమయం, వీలుచేసుకుని. లేకపోతే, పోలింగ్ రోజు ఓటరు ఐడి ఉంది, అదే అడ్రస్‌లో సంవత్సరాలుగా ఉంటున్నాను, గత ఎలక్షన్‌లో ఈ పోలింగ్ బూత్‌లోనే ఓటు వేసాను అంటూ అయినవాడికి, కానివాడికి చెప్పుకుంటూ అఘోరించాలి. పత్రికలవాళ్ళు అలా అఘోరిస్తూంటే ఆనందంగా ఫోటోలు తీసుకుని పోతారు.

## Justice must not only be done, but also be seen to be done

న్యాయం చేయడమే కాదు న్యాయం చేసినట్టు కనబడాలన్న పరమధర్మం మీద కోర్టులు పనిచేస్తాయి. అదేవిధంగా సక్రమమైన ఎన్నికలు సక్రమ పద్ధతిలో నిర్వహించడమే కాదు, సక్రమంగా నిర్వహించారన్నది కనిపించేలా నిర్వహించి ఎలక్షన్ కమిషన్ తన ప్రజాస్వామ్య పరిరక్షణ గురుతర బాధ్యతను సక్రమంగా నిర్వర్తించాలి.

**సామాన్యుడి ఓటు ఎలక్షన్ కమిషన్ బాధ్యత కాదా?**

ప్రతి సంవత్సరం లేదా జాబితాలు సవరించినప్పుడల్లా తన ఎందువల్ల లేదు?

## No voter to be left behind

ఓటు హక్కున్న ప్రతి ఓటర్ పేరు జాబితాలో ఉండేలా చెయ్యడం, ఆ ఓటర్ ప్రతి ఎన్నికలోను తన ఓటుహక్కును వినియోగించుకోగలిగినప్పుడే ఎలక్షన్ కమిషన్ తన బాధ్యత సక్రమంగా నిర్వర్తించిందని భావించాలి. అప్పుడే "No voter to be left behind" అన్న తనకు తాను విధించుకున్న ధర్మసూత్రానికి అనుగుణంగా ఎలక్షన్ కమిషన్ నడుచుకున్నట్టు అర్థం. లేకపోతే ఆ నీతివాక్యాలు, ధర్మపన్నాలు కాయితాలకే పరిమితం. చెప్పడానికే నీతులు అన్న చందంగా ఎలక్షన్ కమిషనే ప్రవర్తిస్తే ఇంక ప్రజాస్వామ్యం ఏమిటి, పరిరక్షణ ఏమిటి? మట్టిగడ్డ.

**ఒక్క ఓటర్ ఓటు వెయ్యలేకపోయినా, టెండర్ ఓటు వేసినా బాధ్యత ఎలక్షన్ కమిషన్‌దే**

తప్పులు లేని నిర్దుష్టంగా తయారుచేసిన ఓటర్ల జాబితాతో ఎలక్షన్లు నిర్వహించడం ఎలక్షన్ కమిషన్ ప్రాథమిక బాధ్యత. ఒక ఎలక్షన్ నుంచి మరు ఎలక్షన్ వరకు జాబితాలో చెయ్యవలసిన కొన్ని రకాల మార్పులు సహజంగా ఉంటాయి. ఎలక్షన్ నాటికి 18 ఏళ్ళు నిండిన ప్రతి ఓటర్ పేరు జాబితాలోకి రావాలి. గడచిన ఎలక్షన్ నుంచి రాబోయే ఎలక్షన్ లోపు చనిపోయినవారి పేర్లు తీసేయాలి. చిరునామాలో మార్పులు, దానివల్ల కొంతమంది నియోజకవర్గాల మార్పులు. ఒకే ఇంట్లో ఉన్నవారందరి ఓట్లు ఒకే పోలింగ్ బూత్‌లో ఉండేలా ఏర్పాటు. ఈ సవరణలన్నిటినీ సక్రమంగా నిర్వర్తించి ఎన్నికలకి సిద్ధం కావల్సిన ప్రాథమిక బాధ్యత ఎలక్షన్ కమిషన్‌దే. ఈ మార్పులు కాక మరేవిధంగానైనా గత ఎన్నికల సందర్భంగా జాబితాలో ఉన్న పేరు మరు ఎలక్షన్ నాటికి ఆ ఓటర్ ప్రమేయం లేకుండా,

ఆ ఓటర్‌కి నోటీస్ లేకుండా జాబితాలో కనబడకుండా పోయిందంటే, అటువంటి లోపభూయిష్టమైన జాబితాతో ఎలక్షన్ కమిషన్ ఎన్నికలని నిర్వహించిందంటే "No voter to be left behind" అన్న తన ధర్మసూత్రాన్ని ఎలక్షన్ కమిషన్ అతిక్రమించినట్టు అర్థం. ఆ విధంగా ఒక్క పేరు జాబితా నుంచి తీసివేయబడినట్టు ఎలక్షన్ కమిషన్ దృష్టికి వచ్చినా ఎలక్షన్ నోటిఫికేషన్ షెడ్యూల్‌ను తిరగరాయగలిగే అధికారాలను ఎలక్షన్ కమిషన్ వినియోగించుకుంటే ఏ కోర్టు కూడా ఆపలేవు. కానీ ఆ అధికారాలను సద్వినియోగం చేసుకునే శేషన్లే కరువయ్యారు మనకి ఈ రాజ్యాంగ వ్యవస్థలో. విశాఖ తూర్పు నియోజకవర్గంలోని నలభై వేల మంది పేర్లు జాబితా నుంచి తొలగించినట్టు జూన్ 11, 2023 న ఒక వార్తను, విజయవాడ సెంట్రల్‌లో డోర్ నెంబర్‌లు లేకుండా దొంగ ఓట్ల చేర్పు గురించి జూన్ 19, 2023న మరొక వార్తను Etv ఆంధ్రప్రదేశ్ ప్రసారం చేసింది.

ఓటర్ల జాబితాలో కొన్ని తప్పులు జరిగాయని, అయితే తొలగించిన అర్హుల ఓట్ల సంఖ్య తక్కువేనని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి మీడియా సమావేశంలో సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. మరోసారి తప్పిదాలు జరిగితే ఈఆర్వోలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముసాయిదా ఓటర్ల జాబితా నాటికి తప్పుల్ని సరిచేస్తామన్నారు. అయితే పలుచోట్ల ఆరోపణలు కొనసాగుతున్నాయి. అర్హులను నిర్జించి, దొంగ ఓట్లను తీసేయకుండా రాబోయే ఎలక్షన్లను నిర్వహించబూనితే ఈ వ్యవస్థ ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ సూత్రాలని పరిరక్షించే విధానాన్ని ప్రశ్నించక తప్పదు.

**జాబితాల నిర్వహణ - జాబితాలకి ప్రత్యామ్నాయం**

ఈమధ్య హైదరాబాద్‌లో 150 వార్డు ఆఫీసులను జిహెచ్ఎంసి తెరిచింది. నిరంతర ప్రక్రియగా ఓటర్ జాబితాలను తయారుచేయడానికి, నిర్వహించడానికి ఈ వార్డ్ ఆఫీసులనే ఉపయోగిస్తే అవి ఓటర్‌కి అందుబాటులో ఉంటాయి. నిరంతరం ఓటు భద్రంగా ఉందా లేదా అని ఓ కన్ను దానిమీద వేసి ఉంచే వీలూ కలుగుతుంది. ఆన్‌లైన్‌లో రోజువారీగా ఈ డేటాను ఎలక్షన్ కమిషన్‌కి అనుసంధానం చేయాలి. టెక్నాలజీ ఉంది.

ఓటర్ల పేరు నమోదు నిరంతర ప్రక్రియ కనుక, జుఎవీ యంత్రాలే ప్రజాభిప్రాయ సూచికలు కనుక వాటి పరిరక్షణ ద్వారానే మనది ప్రజాస్వామ్య దేశంగా నిరూపితం కావలసి ఉంది కనుక, ఎలక్షన్ కమిషన్ కనుసన్నలలో వాటిని నిర్వహించడానిక్కావలసిన యంత్రాంగం, యంత్రాలను పరిరక్షించడానికి కావలసిన సురక్షిత గదులు ఎలక్షన్ కమిషన్ అధీనంలోనే ఉండే ఏర్పాట్లు ఇకనైనా తప్పనిసరవాలి. గత ఏప్రిల్‌లో హైకోర్టులో ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ఎలక్షన్ పిటిషన్ విషయంలో జుఎవీ లు భద్రపరచిన స్ట్రాంగ్ రూం తాళాలు కనిపించకుండా పోయాయి. వాటిని గురించి విచారించడానికి ఢిల్లీ నుండి అప్పటి ప్రిన్సిపల్ సెక్రటరీ రవికిరణ్ రావలసి వచ్చింది. వారు ప్రస్తుత కలెక్టర్ యస్మిన్ బాషా, పూర్వ కలెక్టర్లు ఎ.శరత్, ఎ.రవి, పూర్వ అడిషనల్ కలెక్టర్లు అరుణశ్రీ, రాజేశం, రిటర్నింగ్ ఆఫీసర్ భిక్షపతి గార్లతో closed door రహస్య మంతనాలు, సంప్రదింపులు జరిపారని వార్త వచ్చింది. కలెక్టర్ల అధీనంలో ఉండవలసిన జుఎవీ లు గతంలో మరెక్కడెక్కడో దర్శనం ఇచ్చిన సంఘటనలూ చూసాం. అందువల్ల జుఎవీల పరిరక్షణ, ఓటర్ జాబితా నిర్వహణ ఇకపై ఎలక్షన్ కమిషనే తన స్వాధీనంలోనే ఉంచుకోవలసిన, నిర్వహించవలసిన ఆగత్యం ఉంది. దానికి తగిన ఏర్పాట్లు చేసినప్పుడే సక్రమంగా ఎన్నికలు నిర్వహించడమే కాక, సక్రమంగా ఎన్నికలు నిర్వహించినట్టూ కనబడుతుంది.

**అవినీతి రాజకీయాలని నిలువరించడం అసాధ్యమా?**

ఇప్పుడు ఇవి నెహ్రూ కాలంనాటి రాజకీయాలు కావు. నీతి, నిజాయతి చేతకానితనంగా భావిస్తూ, రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులు ఉండరని నిర్లజ్జగా, అంటే, సిగ్గులేకుండా ప్రకటిస్తూ, మాకే సిద్ధాంతాలతోనూ పనిలేదనుకునేవాళ్ళని, ఆటగాళ్ళు మారకుండా, తమకి కావలసినవాళ్ళే ఆటగాళ్ళుగా, రాజకీయ వారసులుగా, ఆటనియమాలన్నింటినీ తమకు కావలసిన విధంగా మార్చేసేవాళ్ళని మన ప్రతినిధులుగా ఎన్నుకుంటున్నాం.

ప్రతి ఎలక్షన్‌కి ప్రత్యేకంగా జాబితాలు తయారుచెయ్యవలసిన అవసరం లేకుండా వయోజనులందరూ 18 ఏళ్ళ నుంచి 80 ఏళ్ళు దాటినవాళ్ళందరూ ఇంటి నుంచే, ఆ మాటకొస్తే ప్రపంచంలో ఎక్కడినుంచైనా ఓటు వేసే విధంగా ఎన్నికలు నిర్వహించడానికి కావలసిన అన్ని రకాల సాంకేతిక పరిజ్ఞానమూ అందుబాటులో ఉంది. ఎలక్షన్ కమిషన్ ప్రతిపాదించిన the National Electoral Rolls Purification and Authentication Programme (NERPAP)కి ప్రస్తుతం ప్రతిబంధకంగా ఉన్నది ఆగస్టు 11, 2015 నాటి W.P (Civil)No.494 of 2012, Justice K.S. Puttaswamy (Retd.)vz Union of India కేసులోని సుప్రీంకోర్ట్ తీర్పు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలెన్నింటినో నిరాటంకంగా నిర్వహించడానికి దోహదపడుతున్న ఆధార్ ఎలక్షన్ల నిర్వహణకి కూడా తోడ్పడే విధంగా సుప్రీంకోర్ట్‌ని కూడా ఒప్పించి తగిన రాజకీయ నిర్ణయం తీసుకోగలగాలి.

........

**సెప్టెంబర్ 19, 2020న ఈనాడు ఇంటర్వ్యూలో తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథిగారు ఆశించిన విధంగా Facial recognition, Aadhar, EPIC సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ భవిష్యత్తులో ఓటర్ల జాబితాల అవసరం లేకుండానే ఇంటి వద్ద నుంచే లేదా ప్రపంచంలో ఎక్కడనుంచైనా ఓటు వేసే ప్రక్రియతో ఎన్నికలు నిర్వహించగలిగే బలమైన వ్యవస్థగా ఎన్నికల కమిషన్ రూపాంతరం చెందాలని కోరుకుందాం.**

.............

# తెలంగాణ ఎన్నికల్లో డబ్బు, మద్యం పతాకస్థాయికి

తెలంగాణలో ఎన్నికల్లో డబ్బు, మద్యం ప్రభావం పతాకస్థాయికి చేరుకుంది. అధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటిస్తున్నా విచ్చలవిడిగా పంపిణీ జరుగుతోంది. ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినా విచారణ చేపట్టటం లేదు' అని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ కార్యదర్శి పద్మనాభరెడ్డి కేంద్ర ఎన్నికల సంఘానికి (సీఈసీ) లేఖ రాశారు. ఓటు వేసేందుకు ప్రజలు బాహాటంగా డబ్బులు అడిగే పరిస్థితి వచ్చింది. ఇటీవల జరిగిన మునుగోడు ఉప ఎన్నిక సందర్భంగా డబ్బులు ఇవ్వలేదని ఓటర్లు ధర్నాలు చేయటం పరిస్థితి తీవ్రతను చెబుతోంది. క్షేత్రస్థాయిలోని పోలీసులు స్థానిక ఎమ్మెల్యే, మంత్రుల ప్రాపకం కోసమే పనిచేస్తున్నారు. ఉన్నతాధికారులు మంచి పోస్టింగుల కోసం రాజకీయ నాయకులనే ఆశ్రయిస్తున్నారు. మునుగోడు ఉప ఎన్నిక సందర్భంగా ఓటర్లకు మద్యం తాగిస్తూ ఓ మంత్రి కెమెరాలో చిక్కారు. ఈ ఉప ఎన్నిక నోటిఫికేషన్‌కు మూడ్రోజుల ముందు రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున సంక్షేమ పథకాలు ప్రకటించింది. అభ్యర్థులు ఓటర్ల ఖాతాల్లోకి నేరుగా నగదు బదిలీ చేశారు. ఇన్ని ఉల్లంఘనలు జరుగుతున్నా రాష్ట్ర ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారు" అని లేఖలో పేర్కొన్నారు. వచ్చే ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

# కాగ్ నివేదికపై కళ్లు తెరవండి

ప్రపంచంలో అతి పెద్ద రైల్వే వ్యవస్థల్లో ఒకటైన భారతీయ రైల్వేలో తరచూ ప్రమాదాలు చోటుచేసుకోవటంపై వివరాలతో 'కాగ్' విడుదల చేసిన నివేదికను యూనియన్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో అర్థం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. జామి మండల కేంద్రంలో మీడియాతో మాట్లాడుతూ, కాగ్ నివేదిక ప్రకారం 2017 నుంచి 2021 వరకు 1129 రైల్వే ప్రమాదాలు దేశంలో చోటుచేసుకున్నాయని, ఇన్ని జరుగుతున్నా రైల్వే అధికారులు విచారణ చేపట్టి తీసుకున్న చర్యల్ని పారదర్శకంగా బయటపెట్టలేదన్నారు. ఒడిశా రైలు దుర్ఘటన తర్వాత భారతీయ రైలు భద్రతపై ఆందోళనలు పెరిగాయని, రైల్వే ప్రయాణం సురక్షితమని భరోసా ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో లోక్‌సత్తా నాయకుడు భీంపల్లి భాస్కర్ పాల్గొన్నారు.

# సోలిపేట మృతి పట్ల లోక్‌సత్తా ప్రగాఢ సంతాపం

స్థానిక ప్రభుత్వాల సాధికారత కోసం లోక్‌సత్తా చేసిన ఉద్యమంలో క్రియాశీల పాత్ర పోషించటంతోపాటు పలు కార్యక్రమాల్లో పార్టీలకతీతంగా పాల్గొన్న సోలిపేట రామచంద్రారెడ్డి మృతి ప్రజాజీవితంలో పెద్ద వెలితి అని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ నివాళులర్పించారు. సర్పంచ్ నుంచి పార్లమెంటు సభ్యుని స్థాయి వరకూ ఆయన రాజకీయ, సామాజిక జీవితం యువతకు స్ఫూర్తిదాయకమన్నారు.

# ప్రజాప్రతినిధుల కన్నా వలంటీర్లు ముఖ్యమయ్యారు

ముఖ్యమంత్రి వైఎస జగన్మోహన్ రెడ్డి పాలనలో ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యేల కంటే సచివాలయ వలంటీర్లు, గృహసారథులకే ఎక్కువ విలువ ఉందని భీశెట్టిబాబ్జీ విశాఖపట్నంలో మీడియాతో మాట్లాడుతూ అన్నారు. వైకాపా ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి నిర్వహించిన సమావేశాలను చూస్తుంటే ఆ 151 మంది పరిస్థితిపై జాలి కలుగుతోందన్నారు. అసెంబ్లీలో, పార్టీ సమావేశాల్లో సీనియర్ ఎమ్మెల్యేలు కూడా ప్రజాసమస్యలపై నోరు విప్పే పరిస్థితి లేదన్నారు. ప్రజాధనంతో వలంటీర్లకు జీతాలిస్తున్న ముఖ్యమంత్రి వైకాపా అమలు చేస్తున్న పథకాలు ప్రచారం చేయండంటున్నారు తప్ప అవి ప్రభుత్వ పథకాలని చెప్పటం లేదన్నారు. ఇదేసమయంలో స్థానిక ప్రభుత్వాలను నిర్వీర్యం చేయటం, ఎమ్మెల్యేల తాకిడి వల్ల ఇప్పటికే రాష్ట్రంలో సర్పంచ్‌లకు ఎటువంటి విలువ లేకుండా పోయిందన్నారు. ఇంత అధికార కేంద్రీకరణ చివరికి తన పార్టీకి కూడా నష్టదాయకమని ముఖ్యమంత్రి గ్రహించాలని, వికేంద్రీకరణకు వ్యవస్థీకృత ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో లోక్‌సత్తా నాయకులు రామకృష్ణ, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# గురజాడ ఇంటిని సందర్శించిన జేపీ

భారతదేశం గర్వించదగ్గ రచయిత గురజాడ అప్పారావు ఇంటిని విజయనగరం పర్యటన సందర్భంగా జేపీ సందర్శించారు. ఆయన వాడిన వస్తువులు, రచించిన గ్రంథాల ప్రతులనూ పరిశీలించారు. గురజాడ విశేషాల్ని పరిరక్షించుకోవాల్సిన అవసరముందన్నారు. ఆయన కుటుంబ సభ్యులతో కొద్దిసేపు మాట్లాడారు. అదే రోజు యూనియన్ మాజీ మంత్రి అశోక్ గజపతిరాజును జేపీ మర్యాదాపూర్వకంగా కలిశారు. దేశ, రాష్ట్ర రాజకీయాల్లో ప్రస్తుత పరిణామాలు, తీసుకురావాల్సిన మార్పులపై చర్చించారు. భీశెట్టి బాబ్జీ, పలువురు నేతలు పాల్గొన్నారు.

# దామాషా ఎన్నికల పద్ధతి కోసం
# పార్టీలు ఏకమవ్వాలి

ఎన్నికల్లో రాజకీయ పార్టీల హామీలకు, ప్రజల ఆకాంక్షలకు మధ్య అంతరం పెరుగుతోందన్న సంకేతాలు ఇటీవల మరింత స్పష్టంగా కనిపిస్తున్నాయి. కులం, మతం కంటే తమ ఆదాయాలు పెరగాలని, తమ పిల్లలకు మంచి భవిష్యత్తు కోసం నాణ్యమైన చదువు, ఆరోగ్యం, ఉపాధి అవకాశాలు అందాలని ప్రజలు కోరుకుంటున్నట్లు కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కూడా కొన్ని అధ్యయనాలు పేర్కొన్నాయి. అయితే ఓటు వేసే దాకా ఆ ఆకాంక్షల్ని ప్రజలు పరిరక్షించుకోలేకపోతున్నారు. పోలింగ్ రోజు వచ్చేసరికి యథావిధిగా ఉచితాలు, డబ్బు, ఇతర ప్రలోభాలు, కులమత ఆవేశకావేషాలకు లొంగి ఓట్లు వేస్తున్నారు. తాము వేసే ఓటుకు, తమ జీవితానికి మధ్య సంబంధం లేదని కొంత అర్థమవుతున్నా, ఇంకేమీ చేయలేమన్నట్లు ఓటు ద్వారా తాత్కాలిక లబ్ధి పొందేందుకు ఆరాటపడుతున్నారు. ఎన్నికల సమయంలోనే రాజకీయ పార్టీలు, అభ్యర్థుల నుంచి వీలైనంత ఎక్కువ ప్రయోజనం పొందాలని ప్రయత్నిస్తున్నారు.

ప్రజలు తమ వాస్తవ ఆకాంక్షలకు భిన్నంగా ముక్కు మూసుకుని ఓట్లు వేయటానికి కారణం ఏమిటి?

ఇదేసమయంలో పార్టీలు కూడా ప్రజల్ని ఆకట్టుకోవటానికి ప్రతి ఎన్నికకూ ఎంతో కష్టపడుతున్నాయి. మన దేశ రాజకీయంలో విపరీతమైన పోటీ ఉంది. ఎన్నికల్లో గెలవాలని రాజకీయ పార్టీలు హొరాహొరీగా తలపడుతుంటాయి. రకరకాలుగా డబ్బు పోగేసుకుంటూ, ప్రచారానికి, ఓట్ల కొనుగోలుకి భారీగా వెచ్చిస్తున్నాయి. నాయకులు, పార్టీల అభ్యర్థులు రేయింబవళ్లూ ఇదే పని మీద ఉంటారు. వారి కష్టం అలాఇలా ఉండదు. నిరంతరం ప్రజల్లోనే ఉంటుంటారు. స్థానికంగా మందబలం, డబ్బు బలం ఉన్న సామంతరాజుల్లాంటి నాయకులను ఎన్నికల్లో తమ పార్టీ తరపున పోటీకి ఒప్పించటానికి పార్టీలు నానాతంటాలు పడుతుంటాయి. తప్పని తెలిసినా నేర రాజకీయ నాయకులకు టికెట్లు ఇచ్చి ఆరోపణలను భరిస్తుంటాయి. ఇటీవల బ్రిజ్ భూషణ్ ఉదంతం చూశాం.

ఇంత కష్టపడి ప్రజలను ప్రలోభపెడుతూ, వారిలో కులం, మతం వంటివి రెచ్చగొడుతూ, నేర రాజకీయ నేతలకు టికెట్లిస్తూ ఓట్లు నొల్లుకోవాల్సిన అవసరం పార్టీలకు ఏమొచ్చింది? ప్రజల్లో కులం, మతం వంటి ధోరణులు తగ్గుతున్నా, తమ జీవితాల్ని బాగుచేసే ఎజెండా కావాలన్న ఆకాంక్ష ఉన్నా వాటిని ఉపయోగించుకోకుండా పనిగట్టుకుని ప్రజల ఆలోచనాధోరణిని పార్టీలు ఎందుకు దిగజారుస్తున్నాయి?




**మొదట పార్టీల కోణం నుంచి చూద్దాం.**

1947 నుంచి మన దేశంలో మూడు దశల రాజకీయాలను గమనించవచ్చు. మొదటిదశ (1947–67)లో జాతి నిర్మాణం. రెండవ దశ కాంగ్రెస్ ఆధిపత్యానికి సవాళ్లు, ప్రత్యామ్నాయాలు. మూడవదశ (1989–2000)లో అన్ని రాష్ట్రాలలో, కేంద్రంలోనూ అధికారం కోసం తీవ్రమైన పోటీ. ఇప్పుడు మనం నాలుగవ దశలోకి ప్రవేశించాం. ఆగ్రహం, నిరుత్సాహం, రాజకీయాలంటే ఈసడింపు, నిర్వేదం, వ్యవస్థీకృతమైన రాజకీయ పార్టీలను నిరాకరించటం, విచ్చలవిడి అవినీతి, సవాళ్లను ఎదుర్కోవటంలో అంతకంతకు పెరిగిపోతున్న అసమర్థత, పార్టీలు ప్రజలతో నిజాయతీగా సంప్రదించలేకపోవటం, బహిరంగ చర్చ ప్రమాణాలు లోపించటం, సృజనాత్మక శక్తి కొరవడి ప్రచార ఆర్భాటాన్ని నమ్ముకోవటం, అడ్డూఆపూలేని ప్రలోభాలు, జనాకర్షక తాత్కాలిక పథకాలు ఈ నాలుగవ దశ ప్రధాన లక్షణాలు.

ఈ నాలుగవ దశలో ఎన్నికల్లో డబ్బు ప్రభావం విపరీత స్థాయికి చేరుకుంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో పార్టీలు ఎన్నికల్లో పోటీ చేసి గెలవాలంటే ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో కోట్ల రూపాయల్ని అక్రమంగా ఖర్చు చేయకతప్పదు. 1990ల ద్వితీయార్థంలో తెలుగునాట మొదలైన డబ్బు ఎన్నికలు ఇప్పుడు ఈశాన్యం వరకు దేశంలోని చాలా రాష్ట్రాలకు పాకాయి. ఈ డబ్బులో అత్యధికం అక్రమంగా సంపాదించినది. పదవుల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారాన్ని దుర్వినియోగం చేసి అక్రమంగా సంపాదించినది. ఇందులో అత్యధికం ఓట్ల కొనుగోలుకే వెచ్చిస్తారు. డబ్బు పంచితే గెలుస్తారని గ్యారంటీ లేదు గానీ, పంచకపోతే ఓటమి

దాదాపు ఖాయం. మంచి ఎజెండా కోసం నిలబడి అటువంటి పార్టీకి ఓటు వేయాలని తొలుత అనుకున్నా.. చివరికి వచ్చేసరికి ఈ ప్రలోభాలను తట్టుకుని నిలబడేవారి సంఖ్య ప్రజానీకంలో తక్కువ. తాము డబ్బు పంచకుండా మంచి ఎజెండానే మేనిఫెస్టో కింద ప్రకటించి, ప్రజల మద్దతు పొందుదామని ఏదైనా పార్టీ అనుకున్నా.. అవతలిపార్టీ వారు ప్రజల్ని ప్రలోభపెట్టే అవకాశాలు ఎక్కువ. మనం అనుసరిస్తున్న ఫస్ట్-పాస్ట్-ది-పోస్ట్ (ఎఫ్.పి.టి.పి) ఎన్నికల విధానంలో అభ్యర్థికి వచ్చిన మొత్తం ఓట్లకుగానీ, పార్టీకి వచ్చిన మొత్తం ఓట్లకు గానీ ఎలాంటి ప్రాధాన్యం లేదు. కావాల్సిందల్లా, ప్రత్యర్థికన్నా కనీసం ఒక్క ఓటైనా అధికంగా సంపాదించటం. ఒక్క ఓటు ఎక్కువ అంటే విజయమే. ఒక్క ఓటు తక్కువ అంటే అపజయమే. ఈ విధానంలో రెండో బహుమతి లేదు. అందువల్ల అభ్యర్థి విజయం సాధించాలంటే ఎక్కడ కాసిని ఓట్లున్నా ఏదోకరకంగా రాబట్టుకోవాలని చూస్తుంటారు. మన దేశం ఉన్న పరిస్థితుల్లో దీని వల్లే సుడిగుండంలో కూరుకుపోతున్నాం. ఇది అవినీతిని, పేదరికాన్ని శాశ్వతంగా కొనసాగించే రాజకీయాన్ని ప్రోత్సహిస్తోంది. డబ్బు, కులం, స్థానిక హవా వంటివి గెలుపుకి కీలకం కావటంతో పార్టీలు అభ్యర్థుల ఎంపికలో నిస్సహాయంగా మారాయి. పార్టీల్లో అంతర్గత ప్రజాస్వామ్యం నశించి, అగ్రనాయకత్వంలో, పలు నియోజకవర్గాలలో కొన్ని కుటుంబాల ఆధిపత్యం ఏర్పడింది. కేంద్రీకృత రాజకీయం బలపడింది. స్వేచ్ఛగా ఓటు వేయటం, అధికారం శాంతియుతంగా మారటం మినహా దేశంలో ఎటువంటి ప్రజాస్వామిక ప్రగతి లేదు, ఓటు సమాజహితానికి చోదకశక్తిగా మారలేదు.




ప్రలోభాలను తట్టుకుని సరైన ఎజెండా కోసం ఓటు వేయాలనుకున్నవారు ఉన్నా, అలాంటి ఎజెండాను ప్రతిపాదిస్తున్న మంచి పార్టీ ఎన్నికల్లో గెలిచే అవకాశం లేదు గదా అనే మీమాంస వారికి ఎదురవుతుంది. తన ఓటు వేస్టవుతుందని, తనలాంటివాళ్లు గెలిచే అవకాశమున్న పార్టీకి ఓటు వేయకపోవటం వల్ల తాను ఏమాత్రం ఇష్టపడని మరో ప్రధాన పార్టీ గెలిచే అవకాశం ఉంటుంది కాబట్టి తక్కువ విలన్‌గా భావించే పార్టీకే ఓట్లు వేయటం ఆనవాయితీగా మారింది. ఒక్క ఓటు ఎక్కువ సాధించినవారే విజేత అనే విధానంలో ఓటర్లు అరుదుగానే ఉత్తమ అభ్యర్థిని ఎన్నుకుంటారు. మెరుగైన అభ్యర్థులు, పార్టీలు అందుబాటులో ఉన్నప్పటికీ ఓటర్లు తమ ఓటు వృథా కాకూడదనుకుంటారు. ఎవరు ఎక్కువ ఓట్లు సాధిస్తే వారే విజేత అనే విధానంలో ఇద్దరు ప్రధానమైన అభ్యర్థులకు, రెండు ప్రధాన పార్టీలకు మాత్రమే ప్రాధాన్యం ఉంటుంది. అందువల్ల ఇంతకు ముందే చెప్పుకున్నట్లు, అందరూ కొద్దిసంఖ్యలో ఉన్న ఓట్లను కూడా రాబట్టటానికి రకరకాలుగా ప్రయత్నం చేస్తారు. సాంప్రదాయ పార్టీల్లో ఎవరు గెలిచినా అదే పద్ధతి. అందుకే ఎన్నికల తర్వాత మౌలికమైన మార్పు ఏమీ ఉండదు. ఏదైనా ప్రత్యామ్నాయ భావజాల పార్టీ విశ్వసనీయతతో వచ్చినా కొత్తలో ఆదర్శభావంతో 10 శాతం దాకా ఓట్లు వేసినా, వాళ్లు ఇప్పటికిప్పుడు గెలవరు అనుకున్నాక క్రమంగా ఎక్కువమంది ఇతర పార్టీలకు మళ్లుతుంటారు. ప్రలోభాలు, పార్టీల గెలుపోటములతో సంబంధం లేకుండా తమకు నచ్చిన, తాము మంచి రాజకీయం అనుకున్న పార్టీకి ఓటు వేసే వాళ్లు 2 శాతం లోపే ఉంటారు. కొన్ని సర్వేలు చెబుతున్నట్లు ఇటీవలికాలంలో ఈ సంఖ్య కొంత పెరిగినట్లు స్పష్టంగా కనిపిస్తోంది గానీ, ఇంకా సాంప్రదాయ పార్టీల మెడలు వంచే స్థాయికి చేరలేదు. ప్రత్యామ్నాయ పార్టీలు ఆ కొద్ది శాతం ఓట్లు స్థిరంగా తెచ్చుకుంటూ సాంప్రదాయ పార్టీలతో పోటీపడాలన్నా పార్టీ నిర్వహణకి, ప్రచారానికి గణనీయ స్థాయిలో నిధులు ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. డబ్బు, ఇతర ప్రలోభాలకి లొంగని ఓటర్లలో కొందరు ఎన్నికలకు దూరంగా కూడా ఉంటుంటారు. ఈ నేపథ్యంలో ప్రజల వాస్తవ ఆకాంక్షలు, వారి ఎదిగే అవకాశాలు ఎన్నికల

హోరులో కొట్టుకుపోతున్నాయి. ప్రధాన పార్టీలకు, నాయకత్వానికి అపారమైన రాజకీయ సంకల్పం ఉంటే ప్రజల ఎజెండా చుట్టూ ఎన్నికల్ని తిప్పటం సాధ్యమవుతుంది గానీ, అంత స్థాయి నాయకత్వం ప్రస్తుత పరిస్థితుల్లో మనకు కనిపించటం లేదు. విషవలయంలో కూరుకుపోయి రాజకీయ పార్టీలు పిరికితనంతో డబ్బు, ప్రలోభాలు, తాత్కాలిక పథకాలు అనే పసలేని ఫార్ములానే అనుసరిస్తూ ఎన్నికల్లో పోటీపడుతున్నాయి. తెలంగాణలో జరిగిన హుజూరాబాద్, మునుగోడు వంటి ఉప ఎన్నికల నుంచి ఇటీవల కర్ణాటక ఎన్నికల వరకూ ఇదే పరిస్థితి.

**ప్రజల కోణం నుంచి**

ఇక ప్రజల కోణం నుంచి చూస్తే, మన ఎన్నికల సంక్షోభానికి మూలం స్వతంత్రం వచ్చినప్పుడు వ్యవస్థల నిర్మాణంలో ఉంది. ప్రజల సాధికారతకు మన రాజ్యాంగంలో ఉదాత్తమైన ఏర్పాటు ఉందిగానీ, అమలుకు కావలసిన పటిష్ఠ ఏర్పాట్లలో మన రాజకీయం విఫలమైంది. చట్టబద్ధపాలన కాగితాల మీద తప్ప ఆచరణలో లేదు. అలాగే ప్రభుత్వోద్యోగుల వ్యవస్థ ప్రజలకు నాణ్యమైన సేవలను అందించేందుకు తగిన నిర్మాణం లేదు. పౌరసత్వ భావనను పెంపొందించేందుకు తగిన వ్యవస్థీకృత ప్రయత్నం లేదు. దీనికితోడు విపరీత కేంద్రీకృత వ్యవస్థ. ఇక మరో తప్పిదం ఆర్థిక రంగంలో జరిగింది. పోటీ ఉండే స్వేచ్ఛా ఆర్థిక వ్యవస్థను ఏర్పాటు చేయకుండా ప్రభుత్వ గుత్తాధిపత్యాన్ని పెంచేలా లైసెన్స్-పర్మిట్ రాజ్‌ను ఏర్పాటు చేశారు. దీంతోపాటు సోషలిజానికి తప్పుడు నిర్వచనమిచ్చి, ప్రజలకు నాణ్యమైన విద్య, ఆరోగ్యం అందించలేదు. ప్రజల ఆదాయాల్ని, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసి వారిని నిరంతరం చేయిజాచి అర్థించేవారుగా తయారుచేశారు. పర్యవసానంగా, ప్రభుత్వ కార్యాలయాల్లో పని కోసం వెళ్లాలంటేనే ప్రజలు ఆత్మన్యూనతకు గురవటం, ఎవరోకరి సిఫార్సు, లంచాలు సాధారణమయ్యాయి. ప్రజలకు తాము సేవకులమన్న భావంతో వ్యవహరించకుండా ప్రభుత్వోద్యోగుల్లో పలువురు బ్రిటిష్ కాలంలోలా ప్రజల్ని పీడించటం, ప్రజల మీద జులుం చెలాయించటం చేస్తున్నారు.

తాము కట్టే పన్నులకు-తమ జీవితాలకు, తమ ఓటుకు-తమ జీవితంలో మార్పుకి సంబంధం ఏమిటో ప్రజలకు అర్థంకాని పరిస్థితి ఏర్పడిన ఈ నేపథ్యంలో మనం ఎంచుకున్న ఎన్నికల వ్యవస్థ ప్రతిదానికీ ప్రజలు ఎన్నికైన ప్రజాప్రతినిధుల మీద మితిమీరి ఆధారపడటానికి దారితీసింది. చిన్న పని జరగాలన్నా ఓటును అడ్డం పెట్టుకుని ప్రజాప్రతినిధుల్ని సతాయించటం ఆనవాయితీ అయింది. పార్టీ కార్యకర్తలు స్థానికంగా అత్యధిక సమయం ప్రజలకు పనులు చేసిపెట్టటం కోసం వెచ్చించసాగారు. ఈ నేపథ్యంలో చట్టసభ సభ్యులు, రాజకీయ కార్యకర్తలు వ్యక్తిగత జీవితాన్ని త్యాగం చేసి తమ కోసం పనిచేయాలని ప్రజలు ఆశించటం మొదలైంది. క్రమంగా ఈ పరిస్థితి అక్రమ సంపాదనకు దారితీసింది. ఎన్నికల మధ్యకాలంలో పెద్దసంఖ్యలో పార్టీ కార్యకర్తల్ని పోషించటం, ఎన్నికల్లో ఓట్ల కొనుగోలు, నియోజకవర్గాలను కొందరు నాయకులు సామంతరాజ్యాలుగా మార్చుకోవటం, ఓటుకి-ఉమ్మడి అవసరాలకు మధ్య సంబంధం తెగిపోవటం, పన్నులు-పౌర సేవలకు మధ్య సంబంధం కొరవడటం, రాజకీయ మనుగడ-నిజాయతీకి పొసగకపోవటం, సామాజిక విభజనలు పెరగటం, నిబద్ధత, పోటీతత్వానికి విలువ లేకపోవటం వంటి దుష్పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈవేళ దేశం ఉన్న పరిస్థితులలో, ఎవరు ఎక్కువ ఓట్లు సాధిస్తే వారే విజేత అనే విధానంలో రాజకీయపార్టీలు అత్యంత ఉత్తమ అభ్యర్థులను పోటీచేయించరు. ఏదోరకంగా ఓట్లను రాబట్టగలిగే అభ్యర్థులను మాత్రమే పోటీచేయిస్తారు. ఓట్లు కొనడం కోసం అపారంగా డబ్బు ఖర్చు పెట్టగలిగేవారు (పలు రాష్ట్రాలలో ఒక్కో ఎమ్మెల్యే అభ్యర్థి రూ.30 నుంచి 50కోట్లు దాకా ఖర్చుపెడుతున్నారు) లేదా ఆ నియోజకవర్గంలో ఆధిపత్యంలో ఉన్న కులానికి నాయకుడిగా ఎదిగినవారు, లేదా కండబలం చూపించగలిగిన నేరస్థులు, డబ్బు, కులబలం చూపించగలిగినవారు అధికారం కోసం పోటీపడే పార్టీలకు మెరుగైన అవకాశాలున్న అభ్యర్థులుగా కనిపిస్తున్నారు. పరిస్థితులను చక్కదిద్దాలన్న తీవ్రమైన సంకల్పం ఉన్న నాయకులు కూడా అధికారం, పలుకుబడి సంపాదించటం కోసం అలాంటి అభ్యర్థులనే ఎంపిక చేస్తున్నారు. ప్రజలకు, పార్టీలకు మధ్య అగాధం పెరిగి, ఓటరు తాత్కాలిక ధోరణుల్ని, పార్టీలు ఎలాగైనా అధికారం లక్ష్యాలుగా వ్యవహరిస్తున్నారు. ఈ పరిస్థితి వల్ల భారత్ అభివృద్ధి చెందుతున్న దేశంగానే కొనసాగుతూ పన్నుల శాతం పెరగటం లేదు. మన దేశంలో పన్నులు జీడీపీ నిష్పత్తి 18 శాతం దాకా ఉంటే, అభివృద్ధి చెందిన దేశాల్లో 30 శాతం దాకా ఉంది.

**ప్రజల నుంచే మార్పు రావాలనటం పలాయనవాదం**

ప్రజాస్వామ్యంలో ప్రజాభిప్రాయమే అంతిమం కాబట్టి మార్పు ప్రజల నుంచి రావాలని చెప్పటం తేలిక. కానీ ఒక పేద దేశంలో, అక్షరజ్ఞానం ఇంకా సరిగా అందని దేశంలో, ఎన్నో వైవిధ్యాలున్న దేశంలో ప్రజల నుంచే అంతా జరగాలని అనటం పలాయనవాదం అవుతుంది. ఎన్నికలను వరుసగా చూస్తుంటే, ఓటర్లు ఏదోకస్థాయిలో పరిణతిని చూపుతున్నారని అర్థమవుతుంది. తప్పుచేసినవారికి బుద్ధిచెప్పేలా తీర్పుల్ని ఇస్తున్నారుగానీ, ఆ సాంప్రదాయపార్టీలన్నీ ఒకేతానులో గుడ్డలని, అందులోని నాయకులంతా ఒక ఊబిలో కూరుకుపోయివున్నారని, వాటిలో ఏపార్టీకి ఓటువేసినా పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టేనని, మురిగిపోయినట్టేనని గుర్తించి ప్రత్యామ్నాయం దిశగా ప్రజలు బలంగా కదలటంలా. అందుకే ఇటీవల కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో, అంతకుముందు కొన్ని ఎన్నికల్లో కుల, మతాలకు అతీతంగా

తమ జీవితాల్లో నిర్మాణాత్మక మార్పు రావాలని కోరుకుంటున్న ఓటర్ల సంఖ్య పెరిగినా, సాంప్రదాయ రాజకీయ కుళ్లును కదిలించటానికి ఆ బలం సరిపోవటం లేదు. మన దేశంలోని ప్రధాన రాజకీయ పార్టీల మధ్య పేర్లు తప్ప ఏం పెద్ద తేడా ఉంటోంది! చాలా సందర్భాలలో నేతలు కూడా ఒకటే. అటు నుంచి ఇటు మారుతూంటారు. అర్థాంతర ఎన్నికలు, ఉపఎన్నికలు, ఫిరాయింపులు జరుగుతున్నా ఓటరు ఏం చేయలేని పరిస్థితి. పెద్ద రాక్షసుడికి బదులు చిన్న రాక్షసుడు అనే సూత్రంతో గతిలేక ముక్కుమూసుకుని తప్పులకు పాల్పడ్డవారికే తిరిగి ఓటు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో.. అధికారాన్ని పూజించే సంస్కృతి నుంచి బైటపడటానికి, అవగాహనతో ఓటు వేయటానికి ప్రజల్లో ప్రజాస్వామిక చైతన్యం పెంచుతూనే, వాళ్లు ఓటు విలువ గుర్తించి వినియోగించుకునేలా తగిన వ్యవస్థీకృత సంస్కరణల్ని తీసుకురావాలి. ఇందుకు ప్రధానంగా పార్టీలు, రాజకీయ నాయకత్వం, పౌర సమాజం చొరవ చూపాలి.

**రాజకీయ పార్టీలది కీలక పాత్ర**

రాజకీయ పార్టీలది ఇందులో కీలక పాత్ర. నిజానికి ప్రపంచంలో ఏ ప్రజాస్వామ్య దేశంలో రాజకీయం తీరు మారాలన్నా రాజకీయ పార్టీలు మారటం కీలకం. మన దేశంలో పార్టీలు భారీ మెజారిటీతో అధికారంలోకి వస్తున్నాయి. అలాగే ప్రజల్ని దోచుకుందామని కాకుండా ఎంతోకొంత మంచి చేద్దామని, పేరు ప్రతిష్ఠలు సంపాదించుకోవాలనుకుని వచ్చినవారు మన రాజకీయ పార్టీల్లో అనేకమంది ఉన్నారు. విషవలయం నుంచి బయటపడటం తమ మనుగడకు, భవిష్యత్తుకు ఎంత ముఖ్యమో పార్టీలు, నేతలు అర్థం చేసుకోవాలి.

పార్టీల మధ్య రాజకీయ పోటీ తప్పు లేదు, అవసరం కూడా. కానీ పోటీ కాస్తా గాడి తప్పి ఎన్నికల లక్ష్యాల్నే దెబ్బతీస్తుండటం ప్రమాదకరం. ఈ ప్రమాదం పెరుగుతోంది కాబట్టే గత పాతిక ముప్ఫై ఏళ్లలో రాజకీయం ఇంకా కుళ్లిపోయింది. రాజకీయం ప్రమేయం పెద్దగా అవసరం లేని పలు రంగాలు సాంకేతికత, పౌరుల చొరవతో బాగుపడుతున్నాయి. అయితే అన్ని రంగాలకూ మూలంలాంటి రాజకీయ రంగం బాగుపడకుండా, విధిలేని పరిస్థితుల్లో పాలకులు ప్రవేశపెట్టే అరకొర సంస్కరణలతో మనం జనం జీవితాల్లో మార్పును వేగవంతం చేయలేం. అవకాశాలు, సాంకేతికత, యువ జనాభా ముందుకు లాగుతుంటే రాజకీయం మాత్రం భారతదేశాన్ని వెనక్కి గుంజుతోంది. అందుకే ప్రజలు తమ జీవితాల పట్ల ఆశావాదంతో ఎన్నికల ప్రక్రియను ఒక అవకాశంగా చూస్తున్నా, ప్రతి ఎన్నికలో వారు ఓడిపోతున్నారు. ప్రతి ఎన్నికలో ఆశావాదంతో, నిర్మాణాత్మకంగా మొదలయ్యే ప్రజల సంఖ్య పెరుగుతోందిగానీ, పోలింగ్ రోజు వచ్చేసరికి ప్రలోభాలు, ఉద్రేకాలకు లోనై అసలు సమస్యల్ని, వాటికి నిజమైన పరిష్కారాల్ని విస్మరించి ఉన్న పరిధిలో తమకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేస్తున్నారు.

ఈ విషవలయం నుంచి బయటపడేందుకు తీసుకురావాల్సిన సంస్కరణలపై ఏకాభిప్రాయ సాధన ముఖ్యం. ఇందుకోసం పార్టీలు పౌర సమాజ సహకారం తీసుకోవటం మెరుగైన ఫలితాలనిస్తుంది. అవినీతి, నల్లడబ్బు, దుష్పరిపాలనకు కారణమవుతున్న ప్రస్తుత ఎన్నికల వ్యవస్థను మార్చటం పార్టీలకతీతంగా మనముందున్న తక్షణావసరం.

ఎలాంటి ఎన్నికల వ్యవస్థ తీసుకురావాలి అన్న ఆలోచన చేయటానికి ఇప్పుడున్న ఫస్ట్-పాస్ట్-ది-పోస్ట్ (ఎఫ్.పి.టి.పి) పద్ధతి మనకు ఎందుకు పనికిరావటం లేదో గుర్తించాలి.

ఒక్క ఓటు ఎక్కువ వస్తే గెలుపు, తక్కువ వచ్చిన వారు ఎన్ని ఓట్లు వచ్చినా ఓడిపోయినట్లే అనే ఎఫ్.పి.టి.పి వ్యవస్థ ఏర్పాటును రాజ్యాంగమేమీ చెప్పలేదు. మనం బ్రిటిష్ వారిని అనుకరిస్తూ యథాలాపంగా ఏర్పాటు చేసుకున్నాం. బ్రిటన్ వాళ్లు ఆ పద్ధతిని మార్చుకున్నా, మనం సంక్షోభంలో కూరుకుపోతున్నా పాత పద్ధతిలోనే సాగుతున్నాం. దేశానికి స్వతంత్రం వచ్చినప్పటి నుంచి వ్యవస్థల నిర్మాణంలో లోపం వల్ల కొనసాగుతున్న కేంద్రీకృత పాలన, అధ్వాన్న పౌర సేవలు, చట్టబద్ధపాలన అమలుకాకపోవటం వంటి వాటి మధ్య ఎఫ్.పి.టి.పి ఎన్నికల వ్యవస్థ రాజకీయాన్ని ఉన్నకొద్దీ విషవలయంలోకి నెట్టింది.

ప్రస్తుత ఎన్నికల వ్యవస్థ వల్ల ఒకే చోట జనాభా పరంగా బలం లేకుండా చెల్లాచెదురుగా ఉన్న మైనారిటీలకు ప్రాతినిధ్యం లభించటం లేదు. బహిరంగ చర్చ దిగజారి హేతుబద్ధత, తర్కం, వివిధ వర్గాల ప్రజల మధ్య సమన్వయం స్థానంలో అరుపులు, సంకుచిత వాదాలు పెచ్చరిల్లుతున్నాయి. ఛాందసవాదులకు లభించే గుర్తింపు ప్రగతిశీల భావాలకు లభించటం లేదు. ఒక వర్గంలో ఆవేశాన్ని రెచ్చగొట్టి వారిని సమీకరించేందుకు మరో వర్గంపై విద్వేషాన్ని వెదజల్లటం, వారిని దూరం పెట్టటం వంటి ధోరణులు ప్రబలాయి. సంక్షోభం ఉన్నకొద్దీ పెరుగుతోంది.

**దామాషా పద్ధతికి రాజ్యాంగంలో ఏర్పాటు ఉన్నా మనం పట్టించుకోవటం లేదు**

ఈ వైకల్యాలను సరిచేసి న్యాయంగా, అత్యధికులకు ఆమోదయోగ్యంగా ఉండేలా, తేలిగ్గా అమలు చేయగలిగేలా, తక్కువ ప్రతికూలతలు ఉండేలా ప్రత్యామ్నాయ ఎన్నికల విధానాన్ని తీసుకురావటం అవసరం. గెలిచే పార్టీకి వేస్తేనే నా ఓటుకు విలువ అని ఓటరు అనుకోవటం, కొన్ని ఓట్లు తక్కువ వచ్చినా ఓడిపోతామేమో అని భయపడి పార్టీలు ఎన్నికల్ని డబ్బు, ప్రలోభాలమయం చేయాల్సిన అవసరం లేకుండా ప్రతి ఓటుకూ విలువ ఉండేలా దామాషా ఎన్నికల పద్ధతిని తీసుకురావటం మన దేశం ఉన్న పరిస్థితుల్లో సరైనది. మనలాంటి అక్షర జ్ఞానం లేని, పేద దేశంలో, ప్రజాస్వామ్య అనుభవంలేని దేశంలో ఈ వ్యవస్థ పనికొచ్చేది కాదు. అందుకే

బాబాసాహెబ్ అంబేద్కర్ ముందుచూపుతో రాజ్యాంగంలోని 80 (2) (బి) అధికరణంలో లోక్‌సభకి, 170వ అధికరణం ద్వారా అసెంబ్లీకి దామాషా ఎన్నికలకు అవకాశం ఏర్పాటు చేశారు. అందుకు తగినట్లు ఆ పదాల్ని ఎంతో జాగ్రత్తగా వాడారు. కానీ మనం పట్టించుకోవటం లేదు.

**మన దేశ పరిస్థితులకనుగుణంగా దామాషా పద్ధతిలో కొన్ని మార్పులు**



దామాషా పద్ధతిలో కులం, తెగ వంటి విభజనలు వ్యవస్థని చీలికలు పీలికలు చేయకుండా ఒక రాష్ట్రంలో కనీసం 10% ఓట్లు వంటి ఏర్పాట్లని భారతీయ పరిస్థితులకనుగుణంగా చేయవచ్చు. అలాగే రాజకీయ పార్టీల్లో కూడా అంతర్గత ప్రజాస్వామ్యానికి, అభ్యర్థుల ఎంపిక సభ్యుల నిర్ణయానుసారం తప్ప పార్టీ కేంద్ర నాయకత్వం పైనుంచి రుద్దకుండా ఏర్పాట్లు చేయాలి. రాజకీయ అస్థిరత్వానికి ఆస్కారం లేకుండా, తక్కువ ఓట్లతో ఎక్కువ సీట్లు పొందుతున్న పార్టీల ఆమోదాన్ని కూడా పొందేలా, 10% దాకా బోనస్ సీట్లను అతి పెద్ద పార్టీకి కేటాయించవచ్చు.

దామాషా ఎన్నికల విధానం వల్ల సామర్థ్యం, నిజాయతీ గల నాయకులు సామాన్య, మధ్యతరగతి నుంచి కూడా చట్టసభలకు ఎన్నికవగలుగుతారు. కొన్ని ఓట్ల కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. డబ్బు, కులం వంటివి ఉపయోగించినా ఫలితం ఉండదు. పార్టీ విధానాలు, అభ్యర్థి సమర్థత, గత చరిత్ర వంటివి ప్రాధాన్యత సంతరించుకుంటాయి. ఎన్నికల్లో గెలవటానికి నాణ్యమైన నాయకత్వం, ప్రజలకు సక్రమంగా సేవలందించటం ప్రాధాన్యం సంతరించుకుంటాయి. మంచి రాజకీయానికి ప్రోత్సాహం లభిస్తుంది. ఓటరుకి ఓటు గతిలేక దండుకునే సాధనంగా కాకుండా.. పాలనను మెరుగుపరిచే, తన జీవితాన్ని మెరుగుపరిచే విలువైన అవకాశమవుతుంది. ఓటు వృథా అవుతుందని మనకు నచ్చకపోయినా రెండు ప్రధాన పార్టీల మధ్య ఓటు వేయాల్సిన అవసరం లేకుండా.. నచ్చిన పార్టీ ఏ స్థానంలో ఉన్నా ఓటు వేయవచ్చు. నేర చరితుల్ని, నియోజకవర్గ సామంతరాజుల్ని పోటీ చెయ్యండని బతిమిలాడాల్సిన అవసరం లేదు. ఫిరాయింపుల్ని కూడా నియంత్రించవచ్చు. చిన్న పార్టీలు, చెల్లాచెదురుగా ఉన్న మైనారిటీలు, సంస్కరణ బృందాలకు ప్రాతినిధ్యం లభించి మార్పు అవకాశాలు పెరుగుతాయి. విస్తృత వర్గాలకు గొంతు, ప్రాతినిధ్యం లభిస్తుంది. రాజకీయ బృందాలు, ఆలోచనల మధ్య నిజమైన పోటీ ఏర్పడుతుంది. బాధ్యతారహితంగా అప్పు చేసి ఉచితాలు, పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) వంటి వాటి జోలికిపోకుండా అభివృద్ధి, ఉచితాల మధ్య సమతూకం సాధించవచ్చు.

దామాషా ఎన్నికల పద్ధతిలో ప్రతిపక్షాలకు మరింత గొంతు లభిస్తుంది. ఉప ప్రాంతీయ, ఏదోక కులానికి ప్రాతినిధ్యం వహించే పార్టీల ప్రాధాన్యతను తగ్గించవచ్చు. జాతీయ రాజకీయ పార్టీలు నామమాత్రం కాకుండా నిలువరించవచ్చు.

పెద్ద జాతీయ పార్టీలు, ప్రాంతీయ పార్టీల మధ్య విస్తృత స్థాయి ఉమ్మడి జాతీయ ఎజెండా సాధ్యమవుతుంది.

ఎవరు ఎక్కువ ఓట్లు సాధిస్తే వారే విజేత అన్న విధానంలో సాధారణంగా ఓటింగ్ శాతం దామాషా పద్ధతికన్నా 10–15శాతం తక్కువగా ఉంటుంది. ప్రస్తుత ఎఫ్.పి.టి.పి విధానంలో అభ్యర్థులు ఓట్లు కొనటం గనక మానేస్తే చాలా నియోజకవర్గాలలో ఓట్ల శాతం 60కాకుండా 40శాతానికి పడిపోతుంది.

**సుదీర్ఘకాలంగా ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా కృషి**

ఈ నేపథ్యంలోనే ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఎప్పటి నుంచో దామాషా ఎన్నికల పద్ధతి కోసం కృషి చేస్తున్నారు. 2004లో సరైన సమయం రావటంతో, జాతీయ స్థాయి పార్టీల మధ్య ఏకాభిప్రాయ సాధనకు విశ్వప్రయత్నం చేశారు.

2004లో సోనియాగాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ చాలా తక్కువ శాతం ఓట్లతో.. సుమారు 26శాతం ఓట్లతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. వామపక్షాలు, ఇతర పార్టీల మద్దతుతోనే మనుగడ సాగిస్తోంది. అటువంటి పరిస్థితుల్లో సోనియా కూడా జేపీ ప్రతిపాదించిన దామాషా ఎన్నికల పద్ధతి వైపు మొగ్గుచూపారు. తనకు అభ్యంతరం లేదని, పార్టీ సీనియర్లతో మాట్లాడి చెబుతానన్నారు. ఆమె సలహా అడిగిన కాంగ్రెస్ సీనియర్లు ప్రజల మధ్య చిచ్చుపెట్టి రాహుల్‌గాంధీని ప్రధానిని చేసే వ్యూహంలో ఉన్నారు తప్ప, దూరదృష్టితో ఆలోచించలేదు. దాంతో ఆమె ఆ అంశాన్ని పక్కనపెట్టారు.

ఇదేసమయంలో జేపీ వామపక్ష పార్టీల నేతలను అభ్యర్థించారు. 'మీ పార్టీల మద్దతు మీద ఆధారపడి యూపీయే ప్రభుత్వం నడుస్తోంది కాబట్టి, మీరు గట్టిగా పట్టుబడితే దామాషా ఎన్నికల పద్ధతికి ఇది మంచి తరుణం' అని చెప్పినా అప్పటి సీపీఎం ప్రధాన కార్యదర్శి ససేమిరా అన్నారు. 'మేమూ దామాషా ఎన్నికల పద్ధతినే కోరుతున్నాం. కానీ వ్యూహాత్మకంగా అది ప్రస్తుతం మా ప్రధాన ఎజెండా కాదు. మీరు ప్రయత్నిస్తుండండి. కాంగ్రెస్ వాళ్లు అడిగితే మేమూ మద్దతిస్తున్నామని చెబుతాం' అని చెప్పుకొచ్చారు. ఈ సంస్కరణను వదిలేసి పౌర అణుఒప్పందాన్ని సాకుగా చూపి తమకు బద్ధశత్రువు అని ప్రచారం చేసుకునే బీజేపీతో కలిసి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చే ప్రయత్నాల్లో మునిగిపోయారు. దామాషా ఎన్నికల దిశగా ఓ గొప్ప అవకాశాన్ని అలా ఆనాడు భారత్ కోల్పోయింది.

ఎన్నికల సంస్కరణల విషయంలో తాము చూపిన అలసత్వం చివరకు తమ పార్టీ అస్తిత్వాన్నే సవాలు చేసే పరిస్థితిని కల్పిస్తుందని ఊహించలేదని కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు 2014 తర్వాత వాపోయారు. మూడు దశాబ్దాల చరిత్రను తిరగరాస్తూ 2014 ఎన్నికల్లో నరేంద్ర మోదీ ప్రధానమంత్రి కావటానికి 2004లో కాంగ్రెస్ వారు చేసిన ఆ తప్పిదం కూడా ఓ ప్రధాన కారణం.

2014 ఎన్నికల్లో మోదీ నేతృత్వంలో బీజేపీ కేవలం 31శాతం ఓట్లతో 52శాతం (282) సీట్లను సాధించింది. ఇంత తక్కువ శాతం మెజారిటీతో సగానికిపైగా సీట్లు రావడం మోదీకి బాగా కలిసొచ్చింది. ఈ ఫార్ములాతోనే బీజేపీ వరస ఎన్నికలలో వ్యూహాలను అమలుచేస్తూ విజయాలను సొంతం చేసుకుంది. తమకు తక్కువ ఓట్లు వచ్చినా గెలవగలిగేలా ప్రతిపక్షాలను వీలైనంత

## సమర్థులను రాజ్యసభకు నామినేట్ చేయాల్సిన పరిస్థితి ఉండదు

రాజకీయాలలో విజయం, మార్పు అవకాశాలను పునర్నిర్వచించటం కోసం, నాయకులను ఎన్నుకోవటానికి భిన్నమైన పద్ధతి అనుసరించటం కోసం దామాషా ఎన్నికల పద్ధతిని మనం పరిగణలోకి తీసుకోవాలి. ఏ ఎన్నికల వ్యవస్థా సంపూర్ణంగా లోపరహితమైంది కాదు, నిర్దిష్టమైన సందర్భంలో ఆచరణాత్మకమైన, ఆమోదయోగ్యమైన సమాధానాల కోసం అన్వేషించాలి. రాజకీయ నాయకులను ఈసడిస్తూ ప్రజాజీవనానికి దూరంగా ఉండటం కన్నా ఎన్నికల వ్యవస్థ మీద దృష్టి కేంద్రీకరించటం మంచిది. ఓట్లు కొనాల్సిన అవసరంలేని, నిజాయతీతో కూడిన రాజకీయాలు మనగలిగే, రాగద్వేషాలకన్నా విధానాలు, ఆలోచనలకు ప్రాధాన్యం ఉండే, నిజాయతీపరులు, ప్రయోజనకర పౌరులు ఎన్నిక కాగలిగే, సంకుచిత రాజకీయాలు, అవినీతి విషవలయాన్ని అంతమొందించే ఎన్నికల వ్యవస్థను చట్టబద్ధంగా రూపొందించుకోగలగాలి. ఒక పార్టీకి రాష్ట్రాలవారీగా అది సంపాదించగలిగే ఓట్లను బట్టి చట్టసభలో సీట్లు వచ్చే దామాషా వ్యవస్థను అనుసరించగలిగితే మన రాజకీయాలలో, ఫలితాలలో సమూల మార్పులు సాధ్యం అవుతాయి.

అలాంటి దామాషా పద్ధతి ఎన్నికల వ్యవస్థలో ఒక నియోజకవర్గంలో సీట్లు సంపాదించటానికి తిమ్మినిబమ్మిని చేసైనా నామమాత్రపు ఓట్లను సంపాదించాల్సిన అవసరం ఉండదు. ప్రతి రాజకీయపార్టీ ఒక్కో రాష్ట్రంలో సంపాదించగలిగే ఓట్లను బట్టి లోక్‌సభలో, శాసనసభలో ఆ దామాషా ప్రకారం సీట్లు సంపాదించగలుగుతుంది. పార్టీ ప్రతిష్ఠను పెంచుకోవటం కోసం అదనపు ఓట్లను ఒక నియోజకవర్గంలో కొనటానికి అంత ప్రాధాన్యం ఉండదు కాబట్టి ఓట్లు కొనడం వృధా అవుతుంది. ప్రజాజీవనాన్ని సుసంపన్నం చేసి ఎన్నికల ద్వారా సమకూరే ప్రయోజనాలను పెంపొందించగలిగే అర్హులైన, ఉదాత్తులైన అభ్యర్థులనే రాజకీయ పార్టీలు పోటీకి దింపగలుతుగుతాయి. ఇప్పుడైతే అలాంటివారిని రాజ్యసభకు మాత్రమే నామినేట్ చేయగలం. ఎన్నికలలో నిలదొక్కుకోవడానికి రాజకీయ పార్టీలు అపవిత్రమైన రాజీలూ కుదుర్చుకోవాల్సిన అవసరం ఉండదు. తమ సైద్ధాంతిక దృక్పథం, విధానాల ఆధారంగా పార్టీలు నిజాయతీగా ఓట్లు అడగవచ్చు. అవినీతిపరులు, నిర్వేదంలో కూరుకుపోయిన రాజకీయ నాయకుల స్థానంలో నిజాయతీపరులు, సమర్థులు అయిన నాయకులు వస్తారు. వారికి సమాజంపై విశాలమైన దృక్పథం ఉంటుంది. స్వాతంత్ర్యపోరాటంలో పాల్గొన్న నాయకులు వంటి నేతలు యువతరాలనుంచి వచ్చి నవభారతంలో విశ్వాసాన్ని పెంచగలుగుతారు. నిర్వేదనకు, నిరాశకు గురైన పౌరులు అనేకమంది పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఎన్నికలలో పాల్గొన గలుగుతారు. ప్రజాస్వామ్య పునరుజ్జీవనం సాధ్యమవుతుంది. 2004లో అస్థిర పరిస్థితుల మధ్య అధికారంలోకి వచ్చిన యూపీయే ప్రభుత్వం ఆనాడు దామాషా ఎన్నికల పద్ధతి వైపు మొగ్గుచూపిందిగానీ, వామపక్షాలు ముందుకురాకపోవటంతో అప్పట్లో లోక్‌సత్తా చేసిన ఆ ప్రయత్నం వెంట్రుకవాసిలో విఫలమైంది. ప్రధాన జాతీయపార్టీలు కూడా ఎన్నికల వ్యవస్థ బాధితులుగా మారిన ప్రస్తుత పరిస్థితుల్లో దామాషా పద్ధతి తేవటానికి ఏకాభిప్రాయంతో ప్రయత్నం ఎంతో అవసరం.




# రాష్ట్రాల్లో సుపరిపాలనకు ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక

వెస్ట్‌మినిస్టర్ పద్ధతిని అనుసరించటం వల్ల మన దేశంలో ప్రభుత్వ మనుగడ చట్టసభ సభ్యుల మెజారిటీపై ఆధారపడి ఉంటుంది. ఎఫ్.పి.టి.పి ఎన్నికల వ్యవస్థకు తోడు ఈ పద్ధతి వల్ల ముఖ్యంగా రాష్ట్రాల్లో రాజకీయం మరింత వక్రమార్గం పట్టింది.

రాష్ట్రాల్లో శాసనసభ్యులు గెలవటానికి భారీగా డబ్బు ఖర్చు చేస్తున్నారు. ఆ డబ్బును తిరిగి రాబట్టుకోవటానికి వాళ్ళు నియోజకవర్గంలో అక్రమాలకు పాల్పడుతుంటే ముఖ్యమంత్రి చూసీచూడనట్లు వ్యవహరించాల్సి వస్తోంది. చట్టసభలో మాట్లాడాల్సిన ఎమ్మెల్యేలు ఆ పని చేయకుండా, ఎటువంటి చర్చా లేకుండా ముఖ్యమంత్రి అభిప్రాయానికి అనుగుణంగా వ్యవహరించటం, నియోజకవర్గంలో ఎమ్మెల్యేని ముఖ్యమంత్రి చూసీచూడనట్లు వదిలేయటం ఆనవాయితీగా మారింది. దీంతో అవినీతి, దుష్పరిపాలన కొనసాగుతున్నాయి. రాష్ట్రాల్లో ప్రభుత్వాలు మనుగడ కోసం ఎంతో శక్తిసామర్థ్యాలను, వనరులను వెచ్చించాల్సి వస్తోంది. ఎమ్మెల్యేలు చట్టసభ ప్రతినిధులుగా కాకుండా ప్రభుత్వంలో భాగంగా వ్యవహరిస్తూ పోలీసు బదిలీలు, ప్రభుత్వ కార్యాలయాల్లో పైరవీలు వంటి పనుల్లో మునిగితేలుతున్నారు. ప్రకృతి వనరులపై ఆధిపత్యం చెలాయిస్తూ కబ్జాలకు పాల్పడుతున్నారు. స్థానిక ప్రభుత్వాలకు పాత్ర లేకుండా చేశారు. ఏదోక రకంగా ప్రజలకు పనులు చేసిపెట్టటం, అందుకయ్యే ఖర్చుతో పాటు ఎన్నికల్లో ఖర్చు పెట్టిన డబ్బుకు అనేకరెట్లు సంపాదించటం అనే రెండు లక్ష్యాలతోనే ఎక్కువమంది ఎమ్మెల్యేలు పనిచేస్తుంటారు. ముఖ్యమంత్రి మంచి పరిపాలన ఇవ్వాలనుకున్నా ఎమ్మెల్యేల లక్ష్యాలతో వైరుధ్యం వల్ల తరచూ పాలన దెబ్బతింటోంది.

అందువల్ల ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక పద్ధతిని ప్రవేశపెడితే, ఎమ్మెల్యేల అవినీతిని సహించాల్సిన అవసరం లేదు. తన కేబినెట్‌లోకి అసెంబ్లీ బయట సమాజం నుంచి కూడా నిపుణుల్ని తీసుకునే వెసులుబాటు ముఖ్యమంత్రికి లభిస్తుంది. ముఖ్యమంత్రి నిరంకుశంగా వ్యవహరించకుండా ఎమ్మెల్యేలు చట్టసభలో నియంత్రిస్తారు. చట్టాలు, బడ్జెట్‌పై ఎమ్మెల్యేలకు పట్టు ఉంటుంది. ముఖ్యమంత్రిగా రెండు పర్యాయాల కంటే ఎక్కువమార్లు ఎన్నికవకూడదు కాబట్టి ప్రజాస్వామిక వాతావరణం పెరుగుతుంది. రోజువారీ పాలనలో ఎమ్మెల్యేల జోక్యం తగ్గి స్థానిక ప్రభుత్వాలు బలోపేతమవుతాయి. ఎన్నికల్లో అక్రమ ఖర్చు తగ్గుతుంది. ఎమ్మెల్యే పదవి పట్ల మోజు తగ్గుతుంది. నియోజకవర్గ సామంతులు, రాజకీయ గుత్తాధిపత్యం ప్రాధాన్యత కోల్పోతాయి. సామర్థ్యం, రాజకీయ ఆకాంక్షలు ఉన్నవారు స్థానిక ప్రభుత్వాల్లో నాయకులై రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదగొచ్చు. చట్టసభలకు, ప్రభుత్వానికి మధ్య అధికారాల విభజన స్పష్టంగా ఏర్పడుతుంది.

రాష్ట్రాధినేతల ప్రత్యక్ష ఎన్నిక వల్ల స్థిరమైన ప్రభుత్వాలు ఏర్పడతాయి. ఢిల్లీ ఒత్తిడుల నుంచి స్వేచ్ఛ లభిస్తుంది. మెరుగైన సేవలు ప్రజలకు అందుతాయి.

చీల్చటం బీజేపీ విన్నింగ్ ఫార్ములాగా మారింది. 403 స్థానాలున్న ఉత్తర ప్రదేశ్ అసెంబ్లీకి 2017లో జరిగిన ఎన్నికల్లో.. 22.2శాతం ఓట్లు వచ్చిన బీఎస్పీకి కేవలం 19 స్థానాలు రాగా, 28శాతం ఓట్లు పొందిన ఎస్పీ–కాంగ్రెస్ కూటమికి 54 (47+7) సీట్లు వచ్చాయి. ఆర్ఎల్డీ 1.8శాతం ఓట్లతో ఒక్క స్థానం గెలుచుకుంది. ఇలా 54శాతం ఓట్లకు 74 సీట్లు రాగా, 41.4శాతం ఓట్లతోనే బీజేపీ కూటమి 325 స్థానాలను గెలుచుకుంది. కర్ణాటకలో 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 38.1% ఓట్లు రాగా, బీజేపీకి 36.4% ఓట్లు వచ్చాయి. కానీ బీజేపీకి 104 సీట్లు, కాంగ్రెస్‌కు 80 సీట్లు వచ్చాయి. ఇలా పలు ఉదాహరణలున్నాయి. 2023 ఎన్నికల్లో ఎనిమిది శాతం దాకా ఎక్కువ ఓట్లు వచ్చిన కాంగ్రెస్ గెలిచినట్లు ఇతర రాష్ట్రాల్లో పార్టీలు గెలిచిన సందర్భాల్లో కూడా ఓట్ల శాతానికి, సీట్లకు మధ్య అంతరం, ఓడిపోయిన అభ్యర్థుల ఓట్లకు ప్రాతినిధ్యం లేకపోవటం అంశాలు మన ఎన్నికల వ్యవస్థ లోపాలకు అద్దం పడుతున్నాయి. పేదరికం, అవిద్య పెద్దఎత్తున కొనసాగుతున్న భారత్‌లో ఓటర్లందరికీ ప్రాతినిధ్యం లేకుండా చేసే ఎన్నికల వ్యవస్థ లేకుంటే జాతీయ పార్టీల మనుగడ కూడా ప్రశ్నార్థకమయ్యే పరిస్థితి వస్తుందని, కలగూర గంప పార్టీల ఎన్నికల విజయాలే దేశాన్ని శాసించే పరిస్థితి భారత్‌కు మంచిదికాదని కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీకి జేపీ వివరించారు. కేవలం దేశ ప్రయోజనాలకే కాకుండా, కాంగ్రెస్ పార్టీకి కూడా ఇప్పుడున్న ఎఫ్‌పిటిపి ఎన్నికల పద్ధతి ఎలా నష్టదాయకమవుతుందో తెలియచెప్పారు. స్వతంత్రం వచ్చిన సమయంలో కాంగ్రెస్‌కు మిగతాపార్టీల కంటే భారీ ప్రజాదరణ ఉండటం వల్ల ఎఫ్‌పిటిపి వల్ల ఆ పార్టీకి నష్టం లేదని, ఇప్పుడు మాత్రం చాలా రాష్ట్రాల్లో ఓట్ల శాతాన్ని, తద్వారా సీట్ల శాతాన్నీ కోల్పోతోందని తెలిపారు. అందువల్ల ప్రస్తుత ఎన్నికల పద్ధతి స్థానంలో ప్రతి ఓటుకూ విలువనిచ్చే దామాషా ఎన్నికల పద్ధతిని భారతదేశ పరిస్థితులకనుగుణమైన రీతిలో అనుసరించాలని జేపీ సూచించారు.

జర్మనీ తరహా దామాషా పద్ధతిని అమలు చేస్తే, 2014 ఎన్నికల్లో బీజేపీకి 169 లోక్‌సభ స్థానాలు మాత్రమే వస్తాయి, కాంగ్రెస్ బలం 44 నుంచి 105కు పెరిగేది. 2004 సమయంలో మేలుకోకపోవటంతో జరిగిన నష్టం ఎంత తీవ్రమైనదో కాంగ్రెస్‌తో పాటు వామపక్షాలు, పలు ఇతర విపక్ష పార్టీలకు బోధపడటంతో దామాషా ఎన్నికల పద్ధతి కావాలంటూ ఆ తర్వాత పార్లమెంటరీ స్థాయీసంఘానికి నివేదిక ఇచ్చారు. 2014 లోక్‌సభ ఎన్నికలలో, ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికలలో ఓట్ల శాతానికి, సీట్ల సంఖ్యకు ఎంత అంతరం ఉందో వీరంతా వివరాలను గ్రాఫిక్‌గా ఆ సంఘానికి అందచేశారు. 2004 సమయంలో యూపీయే పక్షాల ముందు ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా చేసిన వాదననే ప్రధానంగా ఇందులోని చాలా పార్టీలు చేశాయి.

**పార్లమెంటరీ కమిటీకి నివేదిక**

పార్లమెంటరీ కమిటీ ఆహ్వానం మేరకు లోక్‌సత్తా కూడా 2017లో దామాషా ఎన్నికల పద్ధతి, ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నికల ఆవశ్యకతపై సమగ్ర విశ్లేషణతో నివేదికను అందచేసింది.

**మనీ పవర్‌పై హైదరాబాద్‌లో జాతీయ సదస్సులో కూడా ఏకగ్రీవ మద్దతు**

రాజకీయాల్లో డబ్బు ప్రభావంపై 2020లో ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయ సదస్సులో కూడా దామాషా ఎన్నికల పద్ధతి, రాష్ట్రాధినేతల ప్రత్యక్ష ఎన్నిక తీర్మానానికి వివిధ రంగాల నిపుణులు, రాజకీయ పార్టీల నేతలు ఏకగ్రీవంగా మద్దతు పలికారు.

**2000 కరెన్సీ నోటు ఉపసంహరణ కుట్ర అనుకోనక్కర్లేదు.. అవకాశంగా భావించాలి**

ఇటీవల రూ.2000 నోటును రిజర్వుబ్యాంకు ఉపసంహరించినప్పుడు దీని వెనక మోదీ ప్రభుత్వ రాజకీయ కుట్ర ఏమైనా ఉందా, త్వరలో జరగనున్న వివిధ రాష్ట్రాల ఎన్నికల్లో ప్రతిపక్షాలను అణగదొక్కేందుకే ఈ నిర్ణయం ప్రకటించారా? అని పలువురు సందేహాలు వ్యక్తం చేశారు. రెండు వేల నోటు లేనంత మాత్రాన మన దేశంలో ఎన్నికల్లో ఓట్ల కొనుగోలు ఆగుతుందనుకోవటం భ్రమ. ఆ పరిస్థితి దాటిపోయింది. పెద్ద నోటు లేకపోతే మరో రూపంలో డబ్బు పంపిణీ చేస్తారు. కాబట్టి కుట్ర అనుకోకుండా, ఎన్నికల్లో డబ్బు ప్రభావాన్ని కట్టడి చేయటానికి ఇదో అవకాశంగా భావించటం మేలు. జేపీ చెప్పినట్లు, ఉన్నతస్థాయిలో జరుగుతున్న లాలూచీ అవినీతి నియంత్రణకు, రియల్ ఎస్టేట్ రంగంలో నగదు అవసరం లేని పద్ధతుల్ని ప్రవేశపెట్టటానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటే ఆ క్రమంలో ఎన్నికల సంస్కరణలకు ఏకాభిప్రాయం వేగంగా సాధ్యమవుతుంది.

**సంస్కరణల కోసం ఎదురుచూడొద్దు.. కలసికట్టుగా ప్రారంభిద్దాం**

పార్టీలు, నాయకులు అలసిపోయి వారి దగ్గరున్న డబ్బంతా ఖర్చయిపోయాక ఎన్నికల్లో ప్రలోభాలు ఆగి మంచి అభ్యర్థులు ఎన్నికవుతారు లేదా ప్రజలు డబ్బు, తాత్కాలిక పథకాల్ని తిరస్కరించి మంచి ఎజెండా వైపు నిలబడే రోజులు తప్పక వస్తాయి అని ఎదురుచూస్తూ కూర్చుంటే దేశం భారీ మూల్యం చెల్లిస్తుంది. ఇప్పుడు ఎన్నికల్లో గెలుస్తున్నాం గదా అనుకునే పార్టీలు కూడా కాలక్రమంలో నష్టపోతాయి. ప్రజలు తమ ఓటు విలువను గుర్తించటానికి, ఎన్నికల్లో అక్రమాలు తగ్గటానికి పాలనాపరంగా చర్యలు తీసుకుంటూనే.. దామాషా ఎన్నికల పద్ధతి, ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నికకు వేగిరం సంస్కరణలు తేవటానికి పార్టీలు, నేతలు, ఆలోచనాపరులు, మీడియా, పౌర సమాజం ఆలస్యం లేకుండా కార్యాచరణ ప్రారంభించాలి.

# దామాషా ఎన్నికల పద్ధతి..

## మరికొన్ని వివరాలు సంక్షిప్తంగా

- దామాషా ఎన్నికల పద్ధతి మెరుగైనది, ఎక్కువ ప్రాతినిధ్య స్వభావం కలిగినది కావటంతో పాటు ఎన్నికల వ్యయాన్ని తగ్గిస్తుంది. ధనబలాన్ని, కండబలాన్ని ఉపయోగించే అవకాశాన్ని గణనీయంగా కట్టడిచేయగలుగుతుంది. ఉప ఎన్నికలను కూడా నివారించవచ్చు. దీనివల్ల సమర్థులు, నిజాయతీపరులు ఎన్నికల రాజకీయాలలో చురుకుగా పాల్గొనగలుగుతారు. అణగారిన, బలహీనవర్గాలకు కూడా రాజకీయ ప్రాతినిధ్యానికి మంచి అవకాశం ఏర్పడుతుంది.
- అత్యధిక దేశాలు దామాషా పద్ధతినే అనుసరిస్తున్నాయి.
- జర్మనీ, ఫ్రాన్స్, ఆసియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, బ్రెజిల్, రష్యా సహా పలు దేశాలు వివిధ రకాల దామాషా పద్ధతిని అనుసరిస్తుండగా, మరికొన్ని దేశాలు దామాషా, ఎఫ్‌పిటిపి పద్ధతుల్ని కలిపి అమలుచేస్తున్నాయి.
- దామాషా పద్ధతి వల్ల పార్లమెంటులో తమ బలం తగ్గుతుందని, తద్వారా తమ రాజకీయపలుకుబడి తగ్గుతుందని ప్రాంతీయ పార్టీలు భయపడుతున్నాయి. ఈ వ్యవస్థ సంక్లిష్టమైనదని, అస్థిరతకు దారితీస్తుందని జాతీయ పార్టీలు భావిస్తున్నాయి. అయితే ఈవేళ కొన్ని జాతీయపార్టీలు మనుగడ సమస్యను ఎదుర్కొంటూ, ప్రతి పార్టీ ఎన్నికల్లో పాల్గొనటాన్ని పెనుభారంగా భావిస్తున్న నేపథ్యంలో భారతదేశం దామాషా ఎన్నికల పద్ధతి గురించి ఆలోచించకతప్పని పరిస్థితి ఏర్పడింది.
- ప్రభుత్వం ఉమ్మడిగా పార్లమెంటుకు జవాబుదారీగా ఉండాలని, లోక్‌సభ అభ్యర్థులను ప్రజలు ప్రత్యక్షంగా ఎన్నుకోవాలని మాత్రమే రాజ్యాంగం నిర్దేశించింది. ఎవరు ఎక్కువ ఓట్లు సాధిస్తే వారే విజేతలు అన్న విధానాన్నే అనుసరించాలని ఎక్కడా చెప్పలేదు. కాబట్టి, ప్రజాప్రాతినిధ్య చట్టంలో అనుగుణమైన సవరణ చేస్తే చాలు, మనం దామాషా ఎన్నికల వ్యవస్థను అమల్లోకి తేవచ్చు.
- 2004, 2009లో ఎన్నికలలో యూపీయే 40శాతంకన్నా తక్కువ ఓట్లు సంపాదించింది. మరోరకంగా చెప్పాలంటే, అత్యధిక సంఖ్యాక ఓటర్లు– 60శాతం కన్నా ఎక్కువమంది యూపీయేకు అనుకూలంగా లేరు. కానీ ఎఫ్.పి.టి.పి పద్ధతి వల్ల యూపీయే మెజారిటీ సాధించగలిగింది. 2009 ఎన్నికలలో ఆంధ్రప్రదేశ్‌లో 5,78,92,259 మంది ఓటర్లకు గాను 4,20,58,446 మంది ఓటు వేశారు. అంటే రాష్ట్ర శాసనసభ వీరందరికీ ప్రాతినిధ్యం వహించేదిగా ఉండాలి. కానీ అసెంబ్లీలో గెలిచిన 294మంది అభ్యర్థులకీ వచ్చిన ఓట్లు కేవలం 1,72,43,593 మాత్రమే. వేసిన ఓట్లలో కేవలం 40శాతానికి మాత్రమే రాష్ట్ర శాసనసభ ప్రాతినిధ్యం వహిస్తున్నది. ఓటు వేసిన మిగిలిన 60శాతం ఓట్లకు, అంటే, 2,48,14,853 మంది ఓట్లకు ప్రాతినిధ్యం లభించలేదు. ఇవి ఓడిన అభ్యర్థుల ఓట్లు. నియోజకవర్గం స్థాయిలోనే అవి మురిగిపోయాయి. ఇలా పలు రాష్ట్రాల్లో గణాంకాలను చూపవచ్చు. చట్టసభలు రానురాను ప్రజల విశ్వాసాన్ని కోల్పోవటానికి, ఓటు వేసినా చట్టసభలో ఈరకంగా ప్రాతినిధ్యం లేకపోవటం కూడా ఒక కారణం. ఇదే దామాషా పద్ధతి ఎన్నికలలోనైతే పార్టీలకు వచ్చిన ఓట్ల శాతం ఆధారంగా పార్టీలకు సీట్లు దక్కేవి. వేసిన ప్రతి ఓటుకీ ప్రాతినిధ్యం లభించేది. అప్పుడు చట్టసభలో బలాబలాలు వేరుగా ఉండేవి.
- ఎన్నికల్లో ప్రజలు ఎంపిక చేసుకోవటానికి రెండే ఐచ్ఛికాలు (రెండు పార్టీలు లేదా ఇద్దరు అభ్యర్థులు) ఉంటే ఎఫ్.పి.టి.పి విధానం ప్రజాభీష్టాన్ని ప్రతిబింబించగలుగుతుంది. ఉదాహరణకు బ్రిటన్‌లోలాగా. కానీ ఎంపిక చేసుకోవటానికి బహుళ ఐచ్ఛికాలు ఉన్నప్పుడు ఫలితాలు గందరగోళంగా, అవకతవకగా ఉంటాయి. ఎన్నికైన చట్టసభకు పూర్తి ప్రాతినిధ్య స్వభావం ఉండదు.

పార్టీల విషయంలో, ఓటు వినియోగంలో, ఎన్నికల వ్యవస్థలో ఈ దిద్దుబాట్లతోపాటు స్థానిక ప్రభుత్వాలకు నిజమైన అధికారాలను, వనరుల్ని బదలాయించి పటిష్ఠమైన మూడో అంచె సమాఖ్య వ్యవస్థను రూపొందించగలిగితే మన ప్రజాస్వామ్యం పరిణతి చెందుతుంది. నిజానికి మన దేశంలో స్థానిక ప్రభుత్వాలను నిర్వీర్యం చేయటం వల్ల ఓటుకి, తమ జీవితానికి మధ్య సంబంధాన్ని ప్రజానీకం గుర్తించలేకపోయారు. ఈ లోపాన్ని ఇప్పుడు సరిదిద్దినా వెంటనే మార్పు వచ్చే అవకాశాలు తక్కువ. దామాషా ఎన్నికల పద్ధతితో పాటు స్థానిక ప్రభుత్వాలకు సాధికారతనిస్తే మార్పు మొదలై క్రమంగా సుస్థిరమవుతుంది. కొత్త ఆలోచనలు కలిగిన సృజనాత్మకమైన, సమర్థవంతమైన నాయకులు ఎక్కడికక్కడ తయారవుతారు. తమ ఓటుకి, ప్రజాశ్రేయస్సుకి మధ్య ఉన్న లంకెను ప్రజలు గుర్తించ గలుగుతారు. ఎన్నికైన ప్రతినిధి వాస్తవిక దృష్టితో, సృజనాత్మక, భిన్నమైన రీతిలో వ్యవహరించటం మొదలుపెడతాడు. పన్నులు, వనరులు ఎలా వినియోగిస్తున్నారో స్పష్టంగా కనిపిస్తూ ఉంటుంది. సేవలు మెరుగుపడుతుండటం ప్రజలు చూడగలుగుతారు. అధికారం జవాబుదారీతనంతో ముడిపడి

## ఎన్నికల సంస్కరణలు, ప్రధానంగా దామాషా పద్ధతిపై పార్లమెంటరీ కమిటీకి జేపీ ఆధ్వర్యంలో లోక్‌సత్తా బృందం ఇచ్చిన కొన్ని ప్రతిపాదనలు..

1) ప్రస్తుత ఎన్నికల వ్యవస్థ స్థానంలో భారత్‌కు దామాషా ఎన్నికల పద్ధతి మేలు: దేశంలో ఎన్నికల విరాళాలలో పారదర్శకత లోపించటానికి, నల్లడబ్బు పెరిగిపోవటానికి మూలం.. ఎన్నికలలో ఓట్ల కొనుగోలు! ఒక్క ఓటు ఎక్కువ వస్తే ఆ అభ్యర్థి మాత్రమే విజేత, మిగిలినవారంతా ఓడిపోయినట్టే అనే ప్రస్తుత ఫస్ట్-పాస్ట్-ది-పోస్ట్ (ఎఫ్‌పిటిపి) ఎన్నికల వ్యవస్థలో గెలుపునకు కీలకమైన కాసిన్ని అదనపు ఓట్ల వేట మన పేదదేశంలో ఓట్ల కొనుగోలుకు మూలంగా ఉంది. ఎంత ఖర్చు చేసినా గెలుపు గ్యారంటీ ఉండదుగానీ, డబ్బు ఖర్చు చేయకపోతే ఆ అభ్యర్థి చాలా సందర్భాల్లో కనీస పోటీ కూడా ఇవ్వలేరు. దీనికి విరుగుడు దామాషా ఎన్నికల పద్ధతి (నైష్పత్తిక ప్రాతినిధ్యం). దామాషా పద్ధతిలో ఓ పార్టీకి వచ్చిన ఓట్ల వాటాను బట్టి సీట్లను కేటాయించటం వల్ల, గెలుపు కోసం అదనపు ఓట్లు కీలకం కాబోవు.

2) చాలా దేశాలు మార్చుకున్నాయి: పలు దేశాల్లో దామాషా ఎన్నికల పద్ధతి ఉంది. బ్రిటన్ కూడా కొంతమేర దామాషా పద్ధతికి మారినా.. మనదేశం సహా బ్రిటిష్ వలసదేశాల్లో ఇంకా పూర్తిగా ఎఫ్‌పిటిపి విధానమే కొనసాగుతోంది.

3) మనదేశానికి తగిన దామాషా నమూనా: అనేక కులాలు, మతాలు, ప్రాంతాలు, వైరుధ్యాలు ఉన్న మనదేశంలో దామాషా ఎన్నికల పద్ధతి వల్ల ఓట్లు చీలి అస్థిరత్వం ఏర్పడుతుందనే అభిప్రాయం ఉంది. దామాషా పద్ధతిలో రకరకాల నమూనాలున్నాయి. రాష్ట్రాల్లో ఓ పార్టీకి కనీసం 10శాతం ఓట్లు ప్రాతిపదికగా సీట్లు కేటాయించటం, లోక్‌సభకు రాష్ట్రం యూనిట్‌గా చేయటం, ప్రజాప్రతినిధులతో ప్రజలకు సంబంధం కొనసాగడానికి బహుళ సభ్యత్వ నియోజకవర్గాలను ఏర్పాటు చేయటం భారతదేశ పరిస్థితులకు అత్యుత్తమ నమూనా. దీనివల్ల చీలికలు, పేలికల్ని నివారించవచ్చు, ప్రతి ఓటుకూ విలువను తేవచ్చు. మెజారిటీ వచ్చిన పార్టీకి 10శాతం సీట్లను బోనస్‌గా ఇస్తే స్థిరత్వం ఏర్పడుతుంది.

4) ఓ సాధారణ చట్టం చాలు: ఇటువంటి దామాషా విధానాన్ని ప్రవేశపెట్టటం సాంకేతికంగా కూడా తేలిక. బహుళ సభ్యత్వ నియోజకవర్గాలకు రాజ్యాంగం వెసులుబాటు కల్పించింది కాబట్టి ఈ ఎన్నికల ఏర్పాటుని పార్లమెంటులో ఒక సాధారణ చట్టం తెచ్చి అమలుచేసేయొచ్చు.

5) ఎన్నికల సంస్కరణలు తప్పనిసరి: సమర్థులు, నిజాయతీపరులు ఎన్నికలలో గెలిచి కొనసాగే పరిస్థితి ఉండి, విధానపరమైన పోటీతో పార్టీలు ప్రజలకు నిజమైన ప్రత్యామ్నాయం అందిస్తూ, గెలిచాక ప్రజల తీర్పుకనుగుణంగా వ్యవహరిస్తుంటే ఏ ఎన్నికల వ్యవస్థయినా ఫరవాలేదు. ఆ మౌలిక ప్రజాస్వామ్య సూత్రాలు లోపించాయి కాబట్టే.. మనదేశ పరిస్థితుల్లో దామాషా ఎన్నికల పద్ధతి, ఇతర ఎన్నికల సంస్కరణల్ని వేగంగా తేవటం అవసరం.

ఉంటుంది. పనిచేయకపోవటానికి కుంటి సాకులు చెప్పే అవకాశం ఉండదు. ప్రజల జీవితాల్ని మెరుగుపరిచే మార్పును సాధించి చూపించగలిగేవారికి మాత్రమే అధికారం దక్కుతుంది.

తన వంతు ప్రయత్నాల్ని కొనసాగిస్తున్న లోక్‌సత్తా

తక్కువ శాతం ఓట్లతో ఎక్కువ సీట్లు ఫార్ములాతో గణనీయ విజయాలు సాధిస్తున్న బీజేపీ దామాషా ఎన్నికల పద్ధతికి, ముఖ్యంగా జాతీయస్థాయిలో సుముఖత వ్యక్తం చేయకపోవచ్చు. కానీ రాష్ట్రాల్లో అమలుచేసేందుకు పెద్ద అభ్యంతరాలు వ్యక్తం చేయకపోవచ్చు. అలాగే ఎక్కువ ఓట్లు సాధించిన పార్టీకి 10 శాతం దాకా ఓట్లు అదనంగా కేటాయించటం అనే ప్రతిపాదన దామాషా పద్ధతి వైపు బీజేపీ మొగ్గు చూపేలా చేయవచ్చు.

దేశవ్యాప్తంగా అన్ని అంచెల్లో ఒకేసారి ఎన్నికల నిర్వహణ, ఎన్నికల నిధుల సేకరణలో పారదర్శకత వంటి మార్పులకు అధికార బీజేపీ సంసిద్ధత వ్యక్తం చేస్తున్నందున.. రాష్ట్రాల్లో దామాషా ఎన్నికల వ్యవస్థ, ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక సంస్కరణలను కూడా ప్రతిపక్షాలు చర్చలోకి తేవాలి.

దేశ ప్రయోజనాలరీత్యా, ముమ్ముందు అన్ని పార్టీల ప్రయోజనాలరీత్యా కూడా దామాషా పద్ధతి చాలా ఏళ్లపాటు ప్రయోజనకరంగా ఉంటుందని సమగ్ర విశ్లేషణ, సాక్ష్యాధారాలతో అధికార పార్టీని, ఇతర పార్టీలను, సంస్థలనూ ఒప్పించగలగాలి.

భారత్‌లో దామాషా ఎన్నికల పద్ధతిని తీసుకురావటానికి లోక్‌సత్తా తన వంతు ప్రయత్నాల్ని కొనసాగిస్తోంది. దేశ ప్రయోజనాల రీత్యా ఇప్పుడున్న పరిస్థితుల్లో దామాషా పద్ధతి ఎందుకు అవసరమో రాజకీయ నాయకులతోపాటు దేశంలో మార్పు కోరుకుంటున్న ప్రతి ఒక్కరిలో అవగాహన పెంచుతూ దిశగా లోక్‌సత్తా తన వంతు ప్రయత్నాలను కొనసాగిస్తోంది. వివిధ కార్యక్రమాలను, సమావేశాలను నిర్వహించటం ద్వారా, సోషల్ మీడియా ద్వారా ఈ అంశాలను ప్రచారం చేస్తోంది. అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్, వామపక్ష, ఇతర పార్టీల నేతలనూ కలుస్తూ సమన్వయం సాధించేందుకు ప్రయత్నిస్తోంది.

**"ప్రభుత్వాన్ని సమర్థంగా, నిజాయతీగా నిర్వహించగలిగేవారు ఎన్నికయ్యేలా చేయటమే పార్టీలు, ఎన్నికల వ్యవస్థల పరమార్థం"**

**-డా॥ జయప్రకాష్ నారాయణ్,**
**ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా వ్యవస్థాపకులు**

# వేగం, భద్రత, సరకు రవాణా.. రైల్వేలను సమగ్రంగా అభివృద్ధి చేయాలి





ఒడిషాలో జరిగిన ఘోర రైలు దుర్ఘటనపై నివేదిక త్వరగా రూపొందటం కంటే భవిష్యత్తులో అలాంటివి జరగకుండా చర్యలు తీసుకునేలా సమగ్రంగా అందాలని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

1947 నుంచి ఇప్పటి వరకు రైల్వేలు మన దేశ ఆర్థిక వ్యవస్థలో కీలకపాత్ర పోషిస్తూ వస్తున్నాయని, రోజూ 1 కోటీ 30 లక్షల మంది ప్రయాణిస్తున్నారని, అదే సమయంలో రైల్వేలకు సరైన మద్దతు ఇవ్వకపోవటం, పెట్టుబడులు, సమగ్ర నిర్వహణ లేకపోవటం, రాజకీయాలు శాసించటం వల్ల రైల్వేల పాత్ర ఉన్నకొద్దీ తగ్గిపోతూ వచ్చిందని జేపీ పేర్కొన్నారు. ఉదాహరణకు స్వతంత్రం వచ్చినప్పుడు 80% సరకుల రవాణా రైల్వేల ద్వారా జరిగేదని, ఇప్పుడు 25-27 శాతానికి తగ్గిపోయిందన్నారు. ఖరీదైన డీజిల్, పెట్రోలు ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుని ఓ పక్క డాలర్లు ఖర్చు పెడుతూ మరోపక్క కాలుష్యాన్ని పెంచుతూ రవాణా చెయ్యాల్సి వస్తోందన్నారు. ఇది ఏ దేశానికీ మంచిది కాదన్నారు.

అదేరీతిలో, మన రైల్వేల సగటు వేగం 50-60 కిలోమీటర్లు మాత్రమే ఉందని జేపీ అన్నారు. ప్రపంచంలో ఎన్నదగ్గ ఏ దేశంలోనైనా ఆ వేగం 150-200 కిలోమీటర్లు ఉంటుందని, మనం కనీసం 100-120 కిలోమీటర్ల సగటు వేగం అందుకోవాలన్నారు. ఇది సాధ్యం కావాలంటే మౌలిక సదుపాయాలు బాగుచేయాలన్నారు. రైల్వే ట్రాక్, సిగ్నలింగ్, ఎలక్ట్రానిక్స్, ఇతర సదుపాయాలు సమర్థంగా బాగుచేయాలన్నారు. కానీ తాత్కాలిక రాజకీయ లబ్ధి కోసం సరకు, టికెట్ ధరలు మనం పెంచటం లేదన్నారు. అందుకే ప్రపంచంలో ఎక్కడా లేనట్లుగా 100 రూపాయలు ఆదాయం వస్తే మన రైల్వేలకు అంతకంటే ఎక్కువ ఖర్చవుతోందన్నారు. ఆపరేటింగ్‌కి రూ.98.14 ఖర్చవుతుంటే, జీతభత్యాలకు కొన్ని సందర్భాల్లో రూ.114-115 ఖర్చవుతోందని కాగ్ నివేదిక తెలియచేసిందన్నారు. ఏ వ్యాపార సంస్థా అలా పనిచేయదన్నారు. 100లో కనీసం 30-35 మిగిలితే భవిష్యత్తుకి పునాది వేయవచ్చున్నారు.

1991లో ఆర్థిక సరళీకరణ తర్వాత కూడా రైల్వే మీద మనం సరిగా దృష్టి పెట్టలేదని జేపీ తెలిపారు. రైల్వేను రాజకీయంగా ఉపయోగించుకోవటం కోసమే మంత్రులు ఆలోచించారుగానీ, దేశ ఆర్థిక వ్యవస్థను పటిష్ఠం చేయటం కోసం మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా రైల్వేలను ఎలా బాగుచేయాలా అన్న ఆలోచన చేయలేదన్నారు. మన దేశంలో చాలా రంగాలు అలాగే దిగజారుతున్నాయన్నారు. ఈ రోజు రాజకీయం, ఈ పూట ఓటు, కొందరికి లంచం తప్ప రేపటి భవిష్యత్తు, రేపటి ఆర్థిక వ్యవస్థ గురించి ఆలోచన చేయలేదన్నారు. ఈ విషయాన్ని సమగ్రంగా చూడాలన్నారు. ఒడిషా ఘటన మనల్ని మేలుకొలపాలి. దేశం, రాజకీయ వ్యవస్థ మేలుకొని రైల్వేలను పటిష్ఠంగా చేయకుంటే ఇలాంటి ప్రమాదాలు ఆర్థిక వ్యవస్థకు దెబ్బ. మన దేశంలో ఒకరి మీద ఒకరికి నమ్మకం పోయింది. దర్యాప్తుపై రకరకాల ఆరోపణలు చేస్తున్నారు. తెలియనివాళ్లు కూడా తెలిసినట్లుగా నిశ్చయంగా స్టేట్‌మెంట్లు ఇవ్వటం మామూలై పోయింది. దీనివల్ల ధ్వని కాలుష్యం తప్ప ఆలోచన రాదు. రైల్వేలో సమర్థులైన సాంకేతిక నిపుణులున్నారు. ప్రతిదీ రాజకీయ, పక్షపాత కోణం నుంచి చూస్తే లాభం లేదు అన్నారు.

సమగ్రంగా, ఆచరణసాధ్యంగా రైల్వేలను అభివృద్ధి చేయాలని జేపీ పేర్కొన్నారు. పెద్ద మౌలిక వసతులు చిటికేస్తే రావన్నారు. గత కొన్నేళ్లుగా రైల్వేలో ప్రగతి కనిపిస్తోంది. 2021లో కంటే 2023 నాటికి మౌలిక వసతుల్లో 28% వృద్ధి ఉంది. ఇలా పది పదిహేనేళ్లు కృషి చేస్తే మార్పు వస్తుంది. మూడు నెలల్లో జరగాలని గందరగోళం చేస్తూ ముప్ఫై ఏళ్లలో కూడా ఏదీ మారకుండా చేస్తున్నాం. ప్రభుత్వాలు కొంత చేస్తున్నాయి గానీ, చైనాతో పోలిస్తే తక్కువే. మరింత గణనీయంగా చేయాలి. జాతీయ రహదారులు, రైల్వేలు, మౌలిక వసతులు మెరుగవటం సినిమాలో సీన్ మారినట్లు జరగదు. వేగం తక్కువ ఉంటే భద్రత ఉన్నట్లు కాదు. 2047 నాటికి మన రైళ్లు 160 కిలోమీటర్ల వేగాన్ని అందుకోవాలి, ప్రమాదాలు జీరో కావాలి, సరకు రవాణాలో వాటా పెరగాలి, అత్యాధునిక రైళ్లు సాకారం కావాలి. ఏ ఒక్కటీ తక్కువ కాకూడదు. ప్రతిక్షణం గందరగోళం కాకుండా మనం ఆచితూచి దీర్ఘకాలం ఓపిగ్గా పనిచేస్తే భారతీయ రైల్వేలు ప్రపంచ ప్రమాణాలను అందుకోగలుగుతాయని జేపీ వివరించారు.

# తెలంగాణ తలసరి ఆదాయం రూ.3.08 లక్షలు

తెలంగాణ రాష్ట్ర ప్రజల వార్షిక (2022-23) తలసరి ఆదాయం ప్రస్తుత ధరల ప్రకారం రూ.3,08,732 అని పదేళ్ల రాష్ట్ర ఆర్థికాభివృద్ధి నివేదిక వెల్లడించింది. రాష్ట్ర అర్థ, గణాంక శాఖ రూపొందించిన ఈ నివేదికను ప్రభుత్వం విడుదల చేసింది. ఇందులో దేశంలోని 16 రాష్ట్రాల వార్షిక తలసరి ఆదాయాల వివరాలను పొందుపరిచింది. ఆంధ్రప్రదేశ్ తలసరి ఆదాయం గతేడాది రూ.2.19 లక్షలని తెలిపింది. జాతీయ తలసరి ఆదాయం రూ.1.72 లక్షలేనని, దాని కన్నా 1.8 రెట్లు అధికంగా తెలంగాణలో ఉన్నట్లు స్పష్టం చేసింది. రాష్ట్రం ఏర్పడిన 2014-15లో తలసరి ఆదాయంలో తెలంగాణ దేశంలో 10వ స్థానంలో ఉండగా ఇప్పుడు ఒకటో స్థానానికి చేరింది. 2014-23 మధ్యకాలంలో తలసరి ఆదాయం సగటు వృద్ధి రేటు 12.1% నమోదు ద్వారా దక్షిణ భారత రాష్ట్రాల్లో అగ్రస్థానంలో నిలిచింది. నివేదికలోని మరికొన్ని ముఖ్యాంశాలు:



- ప్రస్తుత ధరల ప్రకారం.. రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తి (జీఎస్‌డీపీ) తెలంగాణ ఏర్పడిన ఏడాది (2014-15)లో రూ.5.05 లక్షల కోట్లు. 2022-23 నాటికి అది రూ.12.93 లక్షల కోట్లు దాటింది.
- జీఎస్‌డీపీలో వ్యవసాయ, అటవీ, మత్స్య, పశు సంపదలు ఉన్న ప్రాథమిక రంగం వాటా 21.1 శాతానికి చేరింది. 2014-23 మధ్యకాలంలో వ్యవసాయం, అనుబంధ రంగాల వార్షిక సగటు వృద్ధి రేటు ప్రస్తుత ధరల్లో 12.8%.
- జీఎస్‌డీపీలో ప్రాథమిక రంగం మొత్తం విలువ నిరుడు రూ.2.17 లక్షల కోట్లుంటే అందులో పంటల ఉత్పత్తులదే రూ.1.08 లక్షల కోట్లుగా తేలింది. ఉదాహరణకు రాష్ట్రంలో పండిన వరి ధాన్యం విలువ 2014-15తో పోలిస్తే 2021-22లో నాలుగు రెట్లు, కందుల విలువ మూడు రెట్లు అదనంగా పెరిగింది.
- ఉత్పత్తి, నిర్మాణం, విద్యుత్, నీటి సరఫరా తదితర విభాగాలున్న ద్వితీయ రంగం వాటా జీఎస్‌డీపీలో 21.2 శాతానికి చేరింది.
- వాణిజ్యం, హొటళ్లు, రియల్ ఎస్టేట్, రవాణా, వృత్తిపరమైన సేవలు తదితరాలుండే తృతీయ రంగం వాటా 62.2%. ఈ రంగం మొత్తం విలువ రూ.7.22 లక్షల కోట్లను దాటింది. ఇందులో అత్యధికంగా రియల్ ఎస్టేట్, ఆస్తుల యాజమాన్యాల విలువే రూ.2.49 లక్షల కోట్లకు పైగా ఉంది. వీటిలో వాణిజ్యం, హొటళ్లు, రెస్టారెంట్లు వంటి వాటి విలువ రూ.2.16 లక్షల కోట్లకు పైగా నమోదైంది.

**మూడు జిల్లాలదే అధిక వాటా**

- దేశ జీడీపీలో తెలంగాణ వాటా గత తొమ్మిదేళ్లలో 4 నుంచి 5 శాతానికి పెరిగింది.
- రాష్ట్ర జీఎస్‌డీపీలో 43.72% వాటా రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ జిల్లాలదే.
- 2021-22లో వరంగల్ అర్బన్, భద్రాద్రి-కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలు జీఎస్‌డీపీ వృద్ధి రేటులో వరుసగా 34.2, 24.9, 24.9 శాతంతో ముందున్నాయి. అన్ని జిల్లాల్లో వృద్ధి రేట్లు సాధారణ స్థాయిలో సానుకూలంగా ఉంది.
- 2021-22లో జాతీయ కనీస వృద్ధి రేటు 15.9 శాతంతో పోలిస్తే తెలంగాణలోని 25 జిల్లాలు ముందున్నాయి.
- రంగారెడ్డి జిల్లా ప్రజలు తలసరి ఆదాయం రూ.7.58 లక్షలతో రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచారు. జాతీయ సగటుతో పోలిస్తే ఈ జిల్లావాసులు 5.1 రెట్లు ఎక్కువ ఆదాయంతో ముందున్నారు. అత్యల్పంగా వికారాబాద్ 1.54 లక్షల కోట్లతో అట్టడుగున ఉంది.

+ స్థూల జిల్లా జాతీయోత్పత్తి (జీడీడీపీ)లోనూ రూ.2.26 లక్షల కోట్లతో రంగారెడ్డి జిల్లా అగ్రస్థానంలో ఉంది. రూ.6,240 కోట్లతో ములుగు అట్టడుగున నిలిచింది.

# పెరుగుతున్న జీవనశైలి వ్యాధుల ప్రమాదం - బలమైన ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థే ఔషధం

మన దేశంలో జీవనశైలి వ్యాధులు పెరుగుతున్న తీరుపై భారత వైద్య పరిశోధనా మండలి ఇటీవల విడుదల చేసిన 'ఇండియాస్ మెటబాలిక్ హెల్త్ రిపోర్ట్' పెద్ద హెచ్చరిక. దేశంలో 11.4 శాతం ప్రజలకు మధుమేహం, 35.5 శాతం మందికి రక్తపోటు (బీపీ) ఉన్నట్లు, 15.3 శాతం మంది ప్రీడయాబెటిక్ స్థితిలో ఉన్నట్లు నివేదిక తెలిపింది. దేశవ్యాప్తంగా 31 రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాల్లో (యూటీలు) అసాంక్రమిక వ్యాధుల భారాన్ని అంచనా వేయటానికి నిర్వహించిన ఈ అధ్యయనం బీపీ, ఊబకాయం తదతర సమస్యల తీవ్రతను గుర్తించింది. అధ్యయన ఫలితాలు ప్రఖ్యాత మెడికల్ జర్నల్ లాన్సెట్ డయాబెటిస్ అండ్ ఎండొక్రైనాలజీ జర్నల్‌లో కూడా ప్రచురితమయ్యాయి.

మధుమేహం, ఇతర అసాంక్రమిక వ్యాధుల (ఎన్‌సీడీ)పై దేశంలో అతి పెద్ద సర్వే ఇది. ఇందులో 2008 నుంచి 2020 మధ్యకాలంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో 20 ఏళ్లు, ఆ పైబడిన వయస్సువాళ్లను దాదాపు 1.13 లక్షల మందిని సర్వే చేశారు. యూనియన్ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ నిధులతో ఐసీఎంఆర్‌తో కలిసి మద్రాసు డయాబెటిస్ రీసెర్చి ఫౌండేషన్ ఈ అధ్యయనం నిర్వహించింది. ముందు అనుకున్నదాని కంటే భారత జనాభాలో మధుమేహం అధికంగా ఉందని ఈ సర్వేతో తేలిందని పరిశోధకులు చెబుతున్నారు. మధుమేహానికి సంబంధించి దక్షిణాదిలో తెలుగు రాష్ట్రాలు కొంత మెరుగైన స్థితిలో ఉన్నట్లు సర్వేలో కనిపిస్తున్నా, ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి.. నివేదికలోని ముఖ్యాంశాలివీ..


- 2017లో భారతీయుల్లో 7.5 శాతం మందికి మధుమేహం ఉండేది. 2021 నాటికి ఆ సంఖ్య 11.4 శాతానికి, అంటే 10.1 కోట్ల మందికి పెరిగింది. అలాగే 13.6 కోట్ల మంది మధుమేహం వచ్చే ముందస్తు లక్షణాలతో ఉన్నారు.
- చెడు కొవ్వు (ఎల్‌డీఎల్ కొలెస్ట్రాల్)తో 18.5 కోట్ల మంది అనారోగ్యం పాలవుతున్నారు.
- మధుమేహం అధికంగా ఉన్న రాష్ట్రాల్లో గోవా, పుదుచ్చేరి, కేరళ, ఛండీగఢ్, ఢిల్లీ తొలి అయిదు స్థానాల్లో ఉండగా.. తెలంగాణ 17, ఆంధ్రప్రదేశ్ 19వ స్థానంలో ఉన్నాయి. తెలంగాణలో 9.9%, ఆంధ్రప్రదేశ్‌లో 9.5% మందికి మధుమేహం ఉన్నట్లు నివేదిక తెలిపింది. ఈ రెండు రాష్ట్రాల కంటే కేరళ (25.5%), తమిళనాడు (14.4%), కర్ణాటక (10.6%)ల్లో మధుమేహులు అధిక సంఖ్యలో ఉన్నారు.




- తెలుగు రాష్ట్రాల్లో 10 నుంచి 14.9% మంది ప్రీడయాబెటిక్ స్థితిలో ఉన్నారు. 30% మందికిపైగా బీపీ, 25% మందికి పైగా స్థూలకాయంతో బాధపడుతున్నారు. రక్తపోటు, ఊబకాయం, ట్రైగ్లిజరైడ్స్‌లో తెలుగు రాష్ట్రాలు రెడ్ జోన్‌లో ఉన్నట్లు నివేదిక పేర్కొంది.
- మధుమేహం పట్టణ ప్రాంతాల్లో 16.4%, గ్రామీణ ప్రాంతాల్లో 8.9% ప్రబలినట్లు నివేదిక తెలిపింది.
- దేశంలో 28.6% మంది (25.4 కోట్ల మంది) ఊబకాయంతోను, 39.5% (35.1 కోట్ల మంది) ఉదర ఊబకాయంతోను, 35.5% బీపీతోను, 24% మంది హైబ్లడ్ కొలెస్ట్రాల్‌తోను బాధపడుతున్నారు.

.. ఆరోగ్యశ్రీనో, ఆయుష్మాన్ భారత్‌నో మరింత విస్తృతంగా అమలు చేస్తే ఈ పరిస్థితి మారదు. ఖరీదైన పెద్దాస్పత్రుల్లో చికిత్సకు ఇన్సూరెన్స్ పథకాల్ని ప్రవేశపెట్టినా ఆరోగ్యం అందదు. జీవనశైలి (అసాంక్రమిక) వ్యాధులతో ప్రజలకు అనారోగ్య సమస్యలు పెరగకుండా, ఖర్చులు భారం కాకుండా ఉండాలంటే, అప్పులతో వాళ్లు పేదరికంలోకి జారకుండాలంటే, వారి ఉత్పాదక శక్తి గరిష్ఠ స్థాయిలో ఉండాలి తప్ప క్షీణించకూడదంటే.. నివారణ, ప్రాథమిక ఆరోగ్యం పునాది మీద సమగ్ర ఆరోగ్య వ్యవస్థను పటిష్ఠంగా నిర్మించే విధానాన్ని అమలు చేయాలి.

మన దేశంలో ఈవేళ యువ జనాభా అత్యధికంగా




ఉంది. యువత ఎక్కువ ఉంటే, ఆరోగ్యంపై వ్యయం తగ్గి ఆర్థిక వ్యవస్థ వేగంగా పెరగాలి. కానీ మనం ఇందుకు విరుద్ధ దిశలో ప్రయాణిస్తున్నాం. వయసుతో సంబంధం లేకుండా జీవనశైలి వ్యాధులు పెరుగుతున్నాయి. దేశంలో ఆరోగ్య రంగంలో మొదటి స్థానంలో ఉన్నదని చెప్పుకొనే కేరళలో కూడా ఇదే పరిస్థితి. సమగ్ర ఆరోగ్య విధానం లేకపోవటం ఇందుకు ప్రధాన కారణమని గుర్తించాలి.

దేశానికి స్వతంత్రం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా ఇప్పటికీ మన దేశం సరైన ఆరోగ్య విధానాన్ని అవలంబించలేదు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు వంటి భవన నిర్మాణాలు గణనీయ స్థాయిలో చేశారుగానీ, అందులో వైద్యం అందే ఏర్పాట్లు ముందుచూపుతో చేయలేదు. ప్రజలందరికీ నాణ్యమైన ఆరోగ్యం జేబుఖర్చు లేకుండా అందించటం రాజ్య వ్యవస్థ మౌలిక బాధ్యతగా ప్రభుత్వాలు గుర్తించకపోవటం వల్ల ప్రజలు క్రమంగా ప్రయివేటు సేవల వైపు మొగ్గు చూపటం పెరిగింది.

**ప్రయివేటు వాటా పెరగటం ప్రాథమిక ఆరోగ్యంలో సంక్షోభానికి సంకేతం**

ప్రభుత్వ రంగంలో డాక్టర్ కన్సల్టేషన్ శాతం తక్కువగా ఉండి ప్రయివేటు రంగం వాటా పెరుగుతుండటం మన ఆరోగ్య సంరక్షణ సేవల్లో రెండు ప్రధాన లోపాలకు సంకేతం. ఒకటి, ఎంతో అవసరమైన ప్రాథమిక ఆరోగ్య సంరక్షణను ప్రజలు వాయిదా వేస్తున్నారు. రెండోది, ప్రైవేటు సదుపాయాల వైపు, అందులోనూ అనధికారికంగా వైద్య సేవలందించే వారి వైపు ఉన్నకొద్దీ ఎక్కువ మొగ్గు చూపుతున్నారు. ప్రాథమిక వైద్యంలో ఈ వైఫల్యం, జీవనశైలి వ్యాధులు పెరగటానికి, ప్రభుత్వ బోధనాస్పత్రులపై మితిమీరిన భారానికి కారణమవుతోంది. చాలామంది నేరుగా మొదటి సంప్రదింపునకే ఆస్పత్రికి వెళ్తున్నారు. లేదంటే ప్రాణాల మీదకు వచ్చేదాకా అనారోగ్యాన్ని నిశ్శబ్దంగా భరిస్తున్నారు. వైద్య సంప్రదింపు లేదా ఆస్పత్రి చికిత్స నుంచి తప్పించుకోవటం ఇక సాధ్యం కాదనే పరిస్థితి వారికి ఏర్పడుతోంది. ముఖ్యంగా మహిళలు ఎక్కువ మూల్యం చెల్లిస్తున్నారు.

ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పట్ల ప్రజల్లో విశ్వాసం లేకపోవటం వల్ల మొత్తం వైద్య సేవల్లో వాటి వినియోగం 10 శాతం లోపే ఉంది. దేశ జనాభాకి అవసరమైన అన్ని రకాల ప్రాథమిక వైద్య సేవలకూ ప్రస్తుతమున్న ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థ సామర్థ్యం పూర్తిగా సరిపోకపోయినా, ఉన్న సామర్థ్యం కూడా సక్రమంగా వినియోగం కావటం లేదు. స్థానిక పీహెచ్‌సీ స్థాయిలో సామర్థ్యానికి తగ్గ వినియోగం లేదని, ఓ ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి రోజుకు కేవలం 15 మంది పేషెంట్లు వస్తున్నారని దాస్ అండ్ హ్యామర్ అధ్యయనం గతంలో తెలిపింది. ఒక గ్రామీణ ప్రాంత వైద్యుడు ముమ్మరంగా రోగులను చూసే సమయం గంట కంటే ఎక్కువ ఉండదు. ఇదే సమయంలో, శిక్షణ, నైపుణ్యం లేకుండా గ్రామీణ భారతదేశంలో ప్రాథమిక వైద్యం అందించేవారు ఇబ్బడిముబ్బడిగా ఉన్నారు. ఒక్కో గ్రామానికి సగటున 3.2 నిష్పత్తిలో ఉన్నారు.

ప్రస్తుతమున్న ప్రాథమిక ఆరోగ్య నమూనా ప్రజల విశ్వాసాన్ని పెంచదు. ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య సదుపాయాలకు వెళ్లే కొద్దిమందికి కూడా గతి లేక వచ్చామనే పరిస్థితి కల్పిస్తున్నారు. భారత్‌లో ప్రస్తుతమున్న

**దేశంలో అసాంక్రమిక వ్యాధుల పరిస్థితి (2021లో రూపొందించిన అంచనాల ప్రకారం)**

| వ్యాధి | బాధితుల సంఖ్య (కోట్లలో) | అత్యధికంగా ఉన్న రాష్ట్రం/యూట | తక్కువ ఉన్న రాష్ట్రం |
|---|---|---|---|
| మధుమేహం | 10.13 (11.4%) | గోవా (26.4%) | ఉత్తరప్రదేశ్ (4.8%) |
| ప్రీడయాబెటిక్ | 13.60 (15.3%) | సిక్కిం (31.3%) | మిజోరం (6.8%) |
| బీపీ | 31.55 (35.5%) | పంజాబ్ (51.8%) | మేఘాలయ (24.3%) |
| సాధారణ ఊబకాయం | 25.42 (28.6%) | పుదుచ్చేరి (53.3%) | జార్ఖండ్ (11.6%) |
| ఉదర ఊబకాయం | 35.11 (39.5%) | పుదుచ్చేరి (61.2%) | జార్ఖండ్ (18.4%) |
| హైపర్‌కొలెస్ట్రోలేమియా | 21.33 (24.0%) | కేరళ (50.3%) | జార్ఖండ్ (4.6%) |

ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థ నిర్మాణంలో అన్నీ ఉన్నాయిగానీ, కుప్పకూలిపోయింది. ప్రాథమిక ఆరోగ్యంలో సవాళ్లను ఎదుర్కోవటంలో వైఫల్యం వల్ల ద్వితీయ, తృతీయ స్థాయి వైద్యంలో ఆస్పత్రి సేవల వ్యయం అనూహ్యంగా పెరుగుతోంది. ఫలితాలు మాత్రం అందుకు తగ్గట్లు రావటం లేదు. సాధారణ జ్వరం వంటి సమస్యలకు కూడా రోగులు నేరుగా ఆస్పత్రులకు రావటం వల్ల అక్కడి సేవలు దెబ్బతింటున్నాయి.

ఈ నేపథ్యంలో జీవనశైలి వ్యాధులను నివారిస్తూ, కట్టడి చేస్తూ నాణ్యమైన ఆరోగ్యానికి గ్యారంటీ ఇవ్వాలంటే పటిష్ఠమైన ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థ మన దేశానికి అనివార్యంగా అవసరం.

సమర్ధవంతమైన, జవాబుదారీతనమున్న, అందుబాటులో ఉండే, ప్రభుత్వమే నిధులను సమకూర్చే, ప్రజలందరి ప్రాథమిక అవసరాలను తీర్చే, ఆరోగ్య అవసరాలకు జేబుఖర్చు భారాన్ని భారీగా తగ్గించే లేదా తొలగించే, రోగులకు, డాక్టర్లకు మధ్య ఎంపిక చేసుకునే స్వేచ్ఛనిచ్చే, వైద్య సేవలదారుల మధ్య పోటీని, ప్రోత్సాహకాన్ని ఏర్పరిచే, ఆస్పత్రి సేవలకు తొలి రెఫరల్ స్థానంగా వ్యవహరించే, ప్రస్తుత ప్రాథమిక ఆరోగ్య మౌలిక వసతులు, వ్యవస్థతో పూర్తిగా సంధానం అయ్యే ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థను రూపొందించటానికి, నిర్మించటానికి అత్యంత ప్రాధాన్యతనివ్వాలి.

**పీహెచ్‌సీలను కూల్చివేయనక్కర్లేదు.. కానీ జీతాల పద్ధతిని మార్చాలి**

ఇందుకోసం ఉన్న వ్యవస్థను కూల్చివేయనక్కర్లేదుగానీ, కీలక దిద్దుబాట్లు, మార్పులు అవసరం.

పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలలో వైద్యుల్ని నియమించటం, వారికి జీతభత్యాలివ్వటం, వారు సక్రమంగా పనిచేసేలా హుకుం జారీ చేయటం పద్ధతికి కాలం చెల్లిందని ముందు మనం అర్థం చేసుకోవాలి. ఆ నమూనా పనిచేయదని కొన్ని దశాబ్దాలుగా నిరూపితమవుతోంది.

**డాక్టర్లకు కొరత లేదు**

అలాగే గ్రామీణ ప్రాంతాల్లో డాక్టర్లు అందుబాటులో లేకపోవటానికి, చాలాచోట్ల స్పెషలిస్టుల కొరతకు డాక్టర్లు లేకపోవటం కారణం కాదని, జిల్లాకో వైద్య కళాశాల పెట్టి కొత్తగా డాక్టర్లను తయారుచేయటం పరిష్కారం కాదని ప్రభుత్వాలు గుర్తించాలి. కొందరు ప్రతిపాదిస్తున్నట్లు డిప్లొమా కోర్సు ప్రవేశపెట్టటం వల్ల ఫలితాలు రావని ఇప్పటికే నిరూపితమైంది.

భారత్‌లో శిక్షణ పొందిన డాక్టర్లు, వైద్య సిబ్బంది విస్తృత సంఖ్యలో ఉన్నారు, వైద్యులు లేక కాదు. ఏటా 90,000 మందికి పైగా ఎంబీబీఎస్ డాక్టర్లు కొత్తగా వస్తున్నారు. చైనా తర్వాత ప్రపంచంలో ఇది అత్యధిక సంఖ్య. అయినా ప్రాథమిక వైద్య స్థాయిలో మాత్రం ప్రభుత్వ రంగంలో మానవ వనరుల కొరత విపరీతంగా ఉంది. ప్రాథమిక వైద్య స్థాయిలో పనిచేసే డాక్టర్ల నిష్పత్తి మొత్తం దేశంలోని ప్రభుత్వ డాక్టర్ల (ప్రాక్టీస్ చేస్తున్న) సంఖ్యలో సుమారు 24 శాతం. దేశంలో ప్రాక్టీస్ చేస్తున్న డాక్టర్లలో ప్రభుత్వ రంగంలో 16 శాతం మాత్రమే ఉన్నారంటే ఎలాంటి వ్యవస్థను నిర్మించామో అర్థమవుతుంది. సమస్య.. వ్యవస్థ నిర్మాణంలో ఉండగా, జిల్లాకో వైద్య కళాశాలతో డాక్టర్లను తయారుచేస్తాం, అమెరికా నమూనాలో ఆరోగ్యం అందిస్తాం అంటూ ఆర్భాటాలు, అహేతుక పద్ధతులు మాట్లాడుతున్నారు. ఓ.ఈ.సి.డి దేశాల ప్రమాణాలను అందుకునేందుకు 1,00,000 జనాభాకి ప్రాథమిక వైద్యుల నిష్పత్తిని అనేక రెట్లు పెంచటం భారతదేశ ఆదాయ స్థాయిలో ఆచరణసాధ్యం అనిపించుకోదు. మన జనాభా, మారుతున్న వ్యాధుల తీరును ఇతర దేశాలతో పోల్చి చూసుకున్నా.. ఈ తరహా పెంపు కొంతకాలం పాటు మనకు అవసరం కూడా కాదు.

**ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మొట్టమొదటి కన్సల్టేషన్ సెంటర్ కావాలి**

ఈ నేపథ్యంలో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రజలు మొట్టమొదట వైద్య సంప్రదింపుకి వెళ్లే సెంటర్‌గా మార్చాలి. డాక్టర్లకు ఆకర్షణీయ ఆదాయాలు, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు, అదే సమయంలో ప్రభుత్వానికి

**ప్రజలు తమ పనుల కోసం నిత్యం తిరిగే మార్గాల్లో కాకుండా ఎక్కడ స్థలం దొరికితే అక్కడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్ని ఏర్పాటు చేశారు. వైద్య సేవలు కూడా కొరవడటంతో క్రమంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఆదరణ కోల్పోయి ప్రజలు ప్రయివేటు సేవల వైపు మొగ్గు చూపటం పెరిగింది.**

**ప్రస్తుతం మొత్తం ప్రాథమిక ఆరోగ్య వ్యయంలో ప్రభుత్వ వాటా 31 శాతం. ప్రపంచ బ్యాంకు పేర్కొన్నట్లు, ప్రాథమిక ఆరోగ్య సంరక్షణపై ప్రభుత్వం చేస్తున్న ఖర్చు అక్కడ కొంత, ఇక్కడ కొంత అన్నట్లే ఉంది. దీనివల్ల ప్రాథమిక వైద్యం అరకొర కావటంతోపాటు ద్వితీయ స్థాయి వైద్య సేవలకు రెఫరల్ అనుసంధానాలు కూడా దెబ్బతిన్నాయి. చికిత్సలకు ప్రాధాన్యత పెరిగి, నివారణ సేవలు వెనక్కి మళ్లాయి. ప్రాథమిక వైద్య వ్యయంలో జాతీయ స్థాయి ప్రభుత్వం వాటాగా చేస్తున్న వ్యయం ప్రధానంగా టీకాలు, కుటుంబ నియంత్రణ, మాతా శిశు ఆరోగ్య సేవలకు సంబంధించే ఉన్నాయి. ప్రాథమిక ఆరోగ్యంలో ఎక్కువ ఆర్థిక వనరులను అందించే రాష్ట్రాల వాటా ప్రధానంగా జీతాలు, వసతుల నిర్వహణకే సరిపోతుంది.**

ఖర్చు తక్కువ ఉండేలా విధానాన్ని రీడిజైన్ చేయాలి.

వైద్యులకు జీతాలిచ్చే పద్ధతికి స్వస్తి చెప్పి, వైద్య సేవలకు తగ్గ ఆదాయం వచ్చే పద్ధతి ప్రవేశపెట్టాలి. ఈ ఆదాయం ఆకర్షణీయంగా ఉండేలా నూతన విధానం ఉండాలి. చిన్న పట్టణాలను ప్రాథమిక ఆరోగ్య సెంటర్లుగా ఎంపిక చేయాలి.

**చిన్న పట్టణాలు ఎందుకంటే..**

అనధికారికంగా వైద్య సేవలందించేవారు భారీ సంఖ్యలో విస్తరించి ఉండటం భారత్‌కి ఇప్పుడో సవాలుగా ఉంది. దేశంలోని పేదల్లో, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వైద్యం కోసం మొదటగా ఈ అనధికార వైద్య సేవలదారుల వద్దకే ఎక్కువమంది వెళ్తున్నారు. పట్టణ ప్రాంతాలతో పోలిస్తే సమీపంలో డాక్టర్లు అందుబాటులో లేకపోవటం వల్ల గ్రామాల్లో ఈ పరిస్థితి నెలకొంది. పైన చర్చించిన సవాళ్లు- ఒకటి, భారతదేశంలో అనధికారికంగా సేవలందించేవారు అవసరానికి మించి ఉండటం, రెండు, గ్రామీణ ప్రజానీకం మెరుగైన ఆరోగ్యం కోసం మరో గ్రామానికి వెళ్లకుండా సమీపంలోని పట్టణ లేదా సెమీ పట్టణ కేంద్రాలకు వెళ్లటం నేపథ్యంలో.. డాక్టర్లను గ్రామాలవారీగా నియమించటం పరిష్కారం కాదని, దానివల్ల ఫలితం ఉండదని స్పష్టమవుతోంది.

మౌలిక వసతులులేని గ్రామాలలో నివసించటానికి డాక్టర్లు ఎక్కువ ఆసక్తి చూపరు. మంచి ఆదాయంతో చిన్న పట్టణాల్లో వైద్య సేవలంటే వారికి అభ్యంతరం ఉండదు.

ఇదే సమయంలో, ఆ చిన్న పట్టణాలు కొన్ని గ్రామాలకు కేంద్రబిందువుగా ఉండేవి కావాలి.

**శిక్షణ పొందిన క్వాలిఫైడ్ డాక్టర్లు, పోటీ, ఎంపిక స్వేచ్ఛ**

ప్రాథమిక వైద్యాన్ని అందించే ఆ సెంటర్లలో శిక్షణ పొందిన ఎంబీబీఎస్ డాక్టర్లు ఉంటారు. ఈ డాక్టర్లకు పేషెంట్‌కి ఇంత చొప్పున ఎంతమంది రోగులు వస్తే అంత ఫీజు ప్రభుత్వం చెల్లించే ఏర్పాటు చేయాలి. దీనివల్ల వైద్యుల మధ్య పోటీ, ప్రజలకు ఎంపిక చేసుకునే స్వేచ్ఛ ఉండి మెరుగైన వైద్య సేవలు అందుతాయి. ఈ పద్ధతి అమలులో భాగంగా ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థను ఏర్పాటు చేస్తారు.

**ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థ ఏర్పాటు, రోగ నిర్ధారణ పరీక్షలు, మందులు ఉచితం**

దేశంలో ప్రాథమిక ఆరోగ్య చట్రాన్ని బలోపేతం చేయటానికి ఫ్యామిలీ ఫిజీషియన్‌ను, ప్రాథమిక ఆరోగ్యాన్ని అనుసంధానం చేసిన నమూనా అత్యంత ఆచరణాత్మకమైనది, సమర్థవంతమైనది. ప్రాథమిక, నివారణ వైద్య సేవల్లో ఫ్యామిలీ ఫిజీషియన్ పాత్ర కీలకం. ప్రాథమిక ఆరోగ్యం అట్టడుగు స్థాయి మౌలిక ఆరోగ్య అవసరాలను తీర్చటానికి పరిమితం కాదు. ఇది సమగ్రమైన, వ్యక్తి-ఆధారితమైన ఆరోగ్య వ్యవస్థకు కేంద్ర బిందువు. అటువంటి వ్యవస్థను నెలకొల్పటానికి ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌ను భారతదేశంలో తిరిగి తీసుకొచ్చి, బలోపేతం చేయాలి. ఇందులో, ఒక వ్యక్తికి అన్ని ఆరోగ్య అవసరాలకూ మొదటి సంప్రదింపు స్థానంగా ఒక ఫ్యామిలీ ఫిజీషియన్ (ఎఫ్.పి) ఉంటారు. ఆ వ్యక్తికుండే ప్రాథమిక ఆరోగ్య సమస్యలకు, సాధారణ అనారోగ్యాలకు చికిత్స ఇస్తారు. అధిక రక్తపోటు, డయాబెటిస్, గుండెజబ్బు, క్యాన్సర్ వంటి జీవనశైలి వ్యాధులను నివారించటం, అప్పటికే వ్యాధి బారినపడ్డవారికి సమర్థంగా చికిత్స అందించటం, క్రమం తప్పకుండా పరీక్షలు చేస్తూ ఆరోగ్యాన్ని పర్యవేక్షిస్తూ భవిష్యత్తులో కొత్త సమస్యలు తలెత్తకుండా చేయటం వంటి ఆరోగ్య సేవల్ని ఎఫ్.పి అందిస్తారు. ఇటువంటి వ్యవస్థ.. డాక్టర్-రోగి మధ్య విశ్వాసాన్ని నిర్మిస్తుంది. ఆస్పత్రి వ్యవస్థకు ఎఫ్.పి తొలి సంప్రదింపు స్థానంగా వ్యవహరించటం వల్ల.. ప్రాథమిక, ద్వితీయ, తృతీయ స్థాయి ఆరోగ్య సంరక్షణల మధ్య నెట్‌వర్క్‌తో బలమైన సంధానం ఏర్పడుతుంది. దీనివల్ల తృతీయ స్థాయి ఆస్పత్రులపై భారం తగ్గుతుంది.

అంటే, చిన్న పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య సెంటర్‌లో కొంతమంది ఫ్యామిలీ డాక్టర్లు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తారు. ప్రాథమిక స్థాయి రోగనిర్ధారణ పరీక్షలు, మందులు అన్నీ అక్కడే ఉంటాయి. ఉచితంగా అందిస్తారు. ఆ ఫ్యామిలీ డాక్టర్లలో ఎవరు

మెరుగ్గా సేవలందిస్తే, వారి వద్ద ప్రజలు వెళ్లవచ్చు., ఏ డాక్టర్ వద్దకు ఎంతమంది పేషెంట్లు వెళ్తే ఆ డాక్టర్‌కి అంత ఆదాయం లభిస్తుంది కాబట్టి మెరుగైన సేవలు అందించేందుకు డాక్టర్లు పోటీపడతారు. ఈ రకంగా ఫ్యామిలీ డాక్టర్ కేంద్రాలుంటే గ్రామాలకు, పట్టణాల్లోని బస్తీలకు నాణ్యమైన వైద్యం అందుతుంది. మహిళల ఆరోగ్య సంరక్షణకు భరోసా ఏర్పడుతుంది. పెరుగుతున్న జీవనశైలి వ్యాధుల్ని కట్టడి చేయగలిగేలా ఇది ప్రాథమిక ఆరోగ్యాన్ని బలోపేతం చేస్తుంది. వైద్య శాస్త్ర మౌలిక సూత్రమైన వ్యాధి నివారణను పటిష్ఠం చేస్తుంది.

## ప్రాథమిక ఆరోగ్యంపై వ్యయం పేదలకు ఎక్కువ ప్రయోజనకరం

ఆరోగ్య వ్యయాల్ని ఖర్చు చేసే పద్ధతిని బట్టే.. అందించే సేవల ప్రభావశీలత ఏర్పడుతుంది. నివారణ వైద్యం సాధారణంగా పేదలకు అనుకూలంగా ఉంటుందని, జబ్బు వచ్చాక చికిత్సా విధానం సంపన్నులకి అనుకూలంగా ఉంటుందని అనుభవాలు సూచిస్తున్నాయి. చికిత్సలపై ప్రభుత్వం చేస్తున్న వ్యయంలో నిరుపేద వర్గ జనాభాకు కేవలం 10 శాతం వనరులు దక్కుతుండగా, అత్యంత సంపన్న వర్గాలకు దాదాపు 33 శాతం లభిస్తున్నాయి. అంటే, చికిత్సలో జనాభాలోని 20 శాతం నిరుపేదలపై వెచ్చించే ప్రతి రూపాయికీ, జనాభాలో 20 శాతం సంపన్నులపై మూడు రూపాయలు ఖర్చవుతోంది. కాబట్టి, ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థను, నివారణ సేవల్ని బలోపేతం చేయటం పేదల ఆరోగ్యాన్ని మెరుగుపరచటానికి అత్యంత కీలకం. శ్రీలంకలో ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థ బలంగా ఉండటం వల్ల అక్కడి ప్రజల ఆయుర్దాయం 5 ఏళ్లు పెరిగిందని, ఇటీవలి ఆర్థిక సంక్షోభ సమయంలో తృతీయ స్థాయి వైద్యం దెబ్బతింది తప్ప ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థకు ఎటువంటి ఆటంకం ఏర్పడలేదని నిపుణులు చెబుతున్నారు.

**ఓపీ, ఆస్పత్రి సేవలకు రెఫరల్ ఎఫ్.పి వద్ద మాత్రమే**

ప్రాథమిక స్థాయి కంటే పెద్ద ఆరోగ్య సమస్యలుంటే ఫ్యామిలీ డాక్టర్ కేంద్రం మాత్రమే ఔట్‌పేషెంట్ (ఓపీ) సేవల్ని అందిస్తుంది కాబట్టి, సదరు డాక్టరే ఏ ఆస్పత్రికి వెళ్లాలి, ఏమిటి అని సూచిస్తారు. ఫ్యామిలీ డాక్టర్ సిఫార్సు లేకుండా ఏ పై ఆస్పత్రిలోనూ ఉచితంగా ఆరోగ్య సేవలు అందించరు, అత్యవసర పరిస్థితుల్లో మినహాయించి. కాబట్టి వ్యాధి నివారణ నుంచి ఏ స్థాయి వైద్యానికైనా గ్రామీణ ప్రాంతాలకు, పట్టణ ప్రాంతాల్లోని పేదలకు ఒక ఆచరణసాధ్య పరిష్కారం లభిస్తుంది. ఈ నమూనాను వివిధ దేశాల, మన దేశంలోని కొన్ని రాష్ట్రాల అనుభవాలను, నిపుణుల సూచనలను పరిగణలోకి తీసుకుని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ రూపొందించారు. విధానం అమలుకు ప్రభుత్వం కొంత అదనపు మొత్తం కేటాయించాల్సుంటుందిగానీ.. తెలుగు రాష్ట్రాల, దేశ బడ్జెట్ స్థాయిని బట్టి చూస్తే ఈ మొత్తం చాలా తక్కువ. వచ్చే ఫలితాలు మాత్రం అపారం. ప్రపంచంలో ఏ ఇతర దేశంతో పోల్చినా అతి తక్కువ ఖర్చుతో ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలనందించే బలాలు భారతదేశానికి ఉన్నాయి.

**అనధికార వైద్య సేవలు అందించేవారినీ వినియోగించుకోవచ్చు**

ఆరోగ్య సేవలెట్లా ఉన్నాయో స్థూలంగా తెలియచెప్పే సూచిక వార్షిక ఔట్‌పేషెంట్ సంప్రదింపుల రేటు. భారత్‌లో ఇది సుమారు 2.3 శాతంగా ఉంది. ఇది అభివృద్ధి చెందిన దేశాల సగటు కంటే బాగా తక్కువ. ఇందులో కూడా 25 శాతం సంప్రదింపులు మాత్రమే ప్రభుత్వ రంగంలో ఉన్నాయి. మిగిలినవన్నీ ప్రైవేటు రంగంలో ఉన్నాయి. గ్రామీణ భారతంలో అనధికారికంగా ఆరోగ్య సేవలను అందించేవారు మొత్తం ఆరోగ్య సేవల ప్రొవైడర్లలో 68 శాతం ఉంటారు. కాబట్టి, దేశవ్యాప్తంగా 75 శాతం ప్రైవేటు సంప్రదింపులు ఎటువంటి వైద్య శిక్షణా లేని అనధికార సేవలందించేవారివే అయ్యే అవకాశముంది.

ప్రస్తుతం భారత గ్రామీణ ప్రజానీకంలోని అత్యధికులు తమ ఆరోగ్య అవసరాలకు మొదటగా సంప్రదించేది అనధికార గ్రామీణ వైద్య సేవలదారులనే (ఆర్.హెచ్.పి). వారికి ప్రజలలో ఎంతో ఆదరణ ఉంటుంది. తాము సేవలందించే కమ్యూనిటీల్లో వారికి విస్తృత సంబంధాలుంటాయి. అటువంటి అనధికార వైద్య సేవలదారులకి, రోగికి మధ్య ఉండే ఈ బంధాన్ని ఫ్యామిలీ డాక్టర్ ఆధారిత ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేయటం కోసం వినియోగించవచ్చు. ఆర్‌హెచ్‌పిల నైపుణ్యాలను అంచనా వేసి తగినరీతిలో వారిని ఫ్యామిలీ డాక్టర్లు తమ క్లినిక్‌లలో ఉద్యోగాలలో నియమించుకోవచ్చు. ఫ్యామిలీ డాక్టర్ క్లినిక్‌లతో అనుసంధానమైన ఆర్.హెచ్.పిలు ఆ ఎఫ్.పిల పర్యవేక్షణలో పనిచేస్తారు. గ్రామీణ ప్రజలు ఫ్యామిలీ డాక్టర్ సేవలను ఎక్కువగా వినియోగించుకునేలా ఆర్‌హెచ్‌పిలు తమ పరిచయాల్ని వినియోగిస్తారు.

**ప్రస్తుత వ్యవస్థతో ఇలా సమన్వయం**

ఇంతకుముందే చెప్పుకున్నట్లు, ఉన్న వ్యవస్థని ధ్వంసం చేయకుండా ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థ పటిష్ఠతకు తగిన అనుసంధానంతో వినియోగించుకునేలా ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా ఆరోగ్య విధానం రూపొందించారు.

**ప్రభుత్వం నిపుణులను ఆకట్టుకుని ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలందించే బాధ్యతలో విఫలమవటంతో మన దేశంలో వైద్యం చదువుకున్నవాళ్లు విదేశాలకు వెళ్లి విలువైన సేవలందిస్తున్నారు, కొందరు తిరిగొచ్చినా ప్రయివేటు రంగంలో సేవలందిస్తున్నారు తప్ప ప్రభుత్వ రంగం పట్ల ఆసక్తి చూపటం లేదు. ఫలితంగా వీరి నైపుణ్యం, సేవలు పేద, మధ్యతరగతికి పెద్దగా ఉపయోగపడటం లేదు. మెడికల్ టూరిజం ద్వారా వీరు దేశానికి ఆదాయం సమకూరుస్తున్నా, రాబోయే మూడు నాలుగేళ్లలో ఈ పరిమాణం కేవలం ఆస్పత్రి సేవల్లోనే 13 బిలియన్ డాలర్లకు చేరే అవకాశమున్నా దేశ ప్రజలకు ఆరోగ్యం అందాలి గదా? ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ వంటి పథకాల ద్వారా కొన్ని పెద్ద ప్రయివేటు పెద్దాస్పత్రుల్లో ప్రభుత్వాలు పేదలకు సేవలందిస్తున్నా, ప్రాథమిక ఆరోగ్యం అధ్వాన్నంగా ఉండటంతో ఫలితాలు ప్రజలకు పెద్దగా ఉపయోగపడటం లేదు. ప్రాథమిక ఆరోగ్యంలో ప్రభుత్వం విఫలమవటం, ప్రయివేటు రంగానికి ప్రాథమిక ఆరోగ్యం పట్ల ఆసక్తి లేకపోవటం వల్ల దేశ ప్రజలకు ఆరోగ్యం అందటం లేదు.**

ఫ్యామిలీ డాక్టర్ క్లినిక్‌లు స్థానిక ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ కేంద్రంతో, సమీపంలోని కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రంతో సమన్వయంతో పనిచేస్తాయి. ప్రతి ఆరోగ్య కేంద్రం బాధ్యతల్నీ స్పష్టంగా విభజిస్తారు. ఫ్యామిలీ డాక్టర్ రికార్డులను నిర్వహిస్తూ ఔట్ పేషెంట్ సేవలను అందిస్తారు, ప్రజారోగ్య కార్యక్రమాలకు తోడ్పాటునందిస్తారు. టీకాలు, గర్భిణుల పరీక్షలు, పౌష్టికాహార లోపాన్ని అంచనా వేయటం, అంటువ్యాధుల చికిత్స, దీర్ఘకాల వ్యాధుల నియంత్రణ వంటి ప్రాథమిక, నివారణ వైద్యాలను ఎఫ్.పి క్లినిక్‌ల వద్ద అందిస్తారు. పి. హెచ్. సిలు.. వ్యాధి నియంత్రణ కార్యక్రమాలు, పౌష్టికాహారం, వ్యాధి నియంత్రణ కార్యక్రమాలు, పౌష్టికాహారం, పారిశుధ్యం, కార్యక్రమాలు, కుటుంబ నియంత్రణ సేవలు, క్షేత్రస్థాయి పర్యటనలు, వ్యాధులపై సర్వేలకు బాధ్యత వహిస్తాయి. పిహెచ్‌సిలలో శీతల నిల్వ కేంద్రాల గొలుసు, ఇతర మౌలిక సదుపాయాలు ఉంటాయి. వ్యాక్సిన్లను, కేంద్రీకృత పద్ధతిలో సేకరించిన ఔషధాలు, స్వల్పకాల పరిమితిలో వినియోగించాల్సిన వైద్య సరకులను ప్రాథమిక సంరక్షణ వ్యవస్థలో భాగమైన ఎఫ్.పి వ్యవస్థకు, స్థానిక క్లినికల్ ల్యాబొరేటరీలకు, ఔషధ డిస్పెన్సరీలకు సరఫరా చేస్తాయి.

జీవనశైలి వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో, వైద్య ప్రక్రియలు సంక్లిష్టమవుతున్న నేపథ్యంలో మిగిలిన దేశాల్లోలాగే భారత్‌లోనూ ఆరోగ్య ఖర్చులు వేగంగా పెరుగుతుంటాయి. ఈ నేపథ్యంలో సరైన ఆరోగ్య వ్యవస్థ లేకుండా కేవలం టెక్నాలజీ వినియోగిస్తే, ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ వంటి స్కీములతో ఇన్సూరెన్స్‌ను విస్తరిస్తే ప్రజలకు ఆరోగ్యం అందదు. వ్యక్తిగత ఆర్థిక భారం లేకుండా ప్రజలందరికీ ఆరోగ్యం అందించటం తమ మౌలిక బాధ్యతగా ప్రభుత్వాలు గుర్తించి ఇందుకోసం బలమైన ప్రాథమిక వైద్యంతో ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా ఆచరణసాధ్యంగా రూపొందించిన సమగ్ర ఆరోగ్య విధానాన్ని అమలు చేయాలి. ✦

## భారతీయ ఔషధ నియంత్రణ ప్రమాణాలు మెరుగుపరచాలి

సులభతర వాణిజ్యాన్ని ప్రోత్సహించే క్రమంలోనే భారతీయ ఔషధ నియంత్రణ ప్రమాణాలను ప్రపంచ స్థాయి ప్రమాణాలను ఏమాత్రం తీసిపోని విధంగా ఉన్నతీకరించాల్సిన అవసరం ఉందని నీతి ఆయోగ్ పేర్కొంది. ఈ విషయంలో అంతర్జాతీయ మార్గదర్శకాల మండలితో కలసి ముందుకు సాగాలని సూచించింది. ప్రస్తుతం డ్రగ్స్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా (డీసీజీఐ) పర్యవేక్షణలో కొనసాగుతున్న వైద్య పరికరాల నియంత్రణను కొత్తగా ఏర్పాటు చేసే మరో సంస్థకు అప్పగించాలని తెలిపింది. యూనియన్ ప్రభుత్వం కొత్తగా తీసుకొస్తున్న 'ఔషధాలు, వైద్య పరికరాలు, కాస్మటిక్స్ బిల్లు–2023'పై అంతర్ మంత్రిత్వ శాఖ సంప్రదింపుల ప్రక్రియ సందర్భంగా నీతి ఆయోగ్ ఈ సిఫార్సులు చేసింది. ప్రస్తుతం అమలులో ఉన్న 1940 నాటి చట్టం స్థానంలో కొత్త బిల్లును ప్రభుత్వం తీసుకురానుంది. వివిధ వర్గాల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటూ బిల్లులో కొన్ని మార్పులు చేశారు. క్లినికల్ ట్రయల్స్ విషయంలో భారతీయ నియం త్రణలపై వ్యక్తమవుతున్న సందేహాలను తొలగించటంతో పాటు అంతర్జాతీయ ప్రమాణాలను పాటించేలా, సకాలంలో నిర్ణయాలు వెలువడేలా కొత్త బిల్లును రూపొందించాలని నీతి ఆయోగ్ అభిప్రాయపడింది. తద్వారా కొత్త ఔషధాలు, చికిత్స విధానాలు సత్వరమే అందుబాటులోకి వచ్చేలా చూడాలని సూచించింది. మన దేశం నుంచి ఎగుమతైన దగ్గు మందుల నాణ్యతపై సందేహాలు తలెత్తిన నేపథ్యంలో నీతి ఆయోగ్ సిఫార్సులు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. మన దేశం నుంచి ఔషధాల ఎగుమతులు మరింతగా పెరగాలంటే అంతర్జాతీయ ప్రమాణాలను పాటించాల్సిన అవసరం ఉందని పరిశ్రమ వర్గాలు కూడా చెబుతున్నాయి.

# నిరాశకు లోనుకాకండి.. పరిష్కారంలో భాగమవ్వండి

## డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్‌తో కటారి ముఖాముఖి (ఐదవ భాగం)

**కటారి:** దేశంలో ప్రస్తుతం ఫెడరల్ స్ఫూర్తి అమలు కావడం లేదు. ప్రతిపక్ష ముక్త్ భారత్ తరహాలో ప్రస్తుత పరిస్థితి తయారైంది. అసలు దేశంలో ఫెడరల్ స్ఫూర్తిపై చర్చ జరుగుతుందా? అన్ని రాష్ట్రాల్లో ఒకే పార్టీ, ఒకే భావజాలం ఉండాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీనిపై మీ స్పందన.

**జేపీ:** ఫెడరలిజం వరకు దేశంలో చాలా బలంగా ఉంది. గత 30 ఏళ్ల నుంచి ఈ మాట చెబుతున్నాను. 30 ఏళ్ల క్రితం ఫెడరలిజం అనేది చాలా బలహీనంగా ఉంది. వివిధ కారణాల వల్ల ఈ రోజు రాష్ట్రాలు పూర్తిగా తమ భవిష్యత్తును నిర్ణయించుకునే అవకాశం ఉంది. ఇది వాస్తవం. 2022లో యూనియన్ ప్రభుత్వానికి పన్నుల రూపంలో వచ్చే ఆదాయం 25లక్షల 50 వేల కోట్లు రూపా యలు. దానిలో 16 లక్షల 11వేల కోట్ల రూపాయలు రాష్ట్రాలకు బదిలీ అవుతున్నాయి. 9 లక్షల 43 వేల కోట్ల రూపాయలు వడ్డీలు చెల్లిస్తున్నారు. రెండూ కలిపితే 25 లక్షల 54 వేల కోట్లు. యూనియన్ దోచుకుంటుందనేది ఏమాత్రం పసలేని వాదన. సమస్య పార్టీ ఫిరాయింపులు. అధికారంలోకి వస్తామనే నమ్మకం ఉంది కాబట్టి కాంగ్రెస్‌లోకి వస్తారని గతంలో పీవీ నరసింహారావు అన్నారు. ఈ రోజు బీజేపీకి అది వర్తిస్తుంది. రాజకీయాల్లోకి వెళ్లేవారిలో నూటికి 70 మంది అధికారాన్ని ఆశించేవారు. అంతేకాని సమాజా నికి సేవ చేయడానికి రాజకీయాల్ని వేదికగా పెట్టుకునే వారు తక్కువే. కారణాలు వేరే ఉన్నాయి. ఇది అన్ని పార్టీలకు వర్తిస్తుంది. ఈనేపథ్యంలో ఏం అవుతుందీ.. ఎక్కడ అధికారం కనిపిస్తుందో అక్కడికి వెళిపోతున్నారు. ఈ దేశ రాజకీయాన్ని, పరిపాలనను మార్చడానికి వస్తున్నట్టు మోదీ చెప్పారు... ప్రజలు నమ్మారు. 1971 తర్వాత ఏక పార్టీకి రెండుసార్లు భారీ మెజార్టీ కట్టబెట్టారు. 48 ఏళ్ల తర్వాత ఇంత భారీ మెజార్టీ ఇచ్చి ఆదరించింది...కాంగ్రెస్ అవలం బించిన పద్ధతులనే మీరు కొనసాగిస్తారని కాదు. ఈ వ్యవస్థలోని లోపాలను అర్థం చేసుకుని పూర్తిగా మారుస్తారని. కానీ మీరేం చేస్తున్నారు.. కాంగ్రెస్ పార్టీ ఏం చేసిందో వాటన్నిటిని తు.చ. తప్పకుండా మరింత సమర్థంగా మరింత వేగంగా, మరింత బలంగా అమలు చేసుకుని మీ పార్టీని పెంచుకుంటున్నారు. దేశ రాజకీ యాన్ని..ఈ సంక్షోభాన్ని కొనసాగిస్తున్నారు. చరిత్ర ఖచ్చితంగా దాన్ని తిరస్కరిస్తుంది. ఇది బహిరంగంగా చెబుతున్నాను. ఆ పార్టీ వాళ్లకు, ప్రజలకు చెబుతున్నాను. దీనిలో అనుమానం ఏమీ అక్కర్లేదు.

రెండో సమస్యను రెండో పక్క నుంచి చూద్దాం. కనీసం పార్టీలు పార్టీల్లాగా ఉన్నట్టయితే ఈ సమస్య ఉండేది కాదు. గూండాలను, డబ్బున్నవాళ్లని మాత్రమే ఆదరించకుండా, అన్ని వర్గాలలోని సమర్థులు..మంచివాళ్లను ఆకర్షించి వాళ్లలో నిబద్ధత, చిత్తశుద్ధి ఉండి కష్టపడితే, వారికి ప్రజల్లో కాస్త ఆదరణ ఉంటే వారిని పార్టీ




పెంచుతుంది..పెరగనిస్తుందనే భావన ఉండాలి. అంతా నేను, నా కుటుంబమే అనుకోకూడదు. ఈ రెండూ చేస్తే పార్టీలు నిలబడతాయి. కానీ చాలా పార్టీల్లో ఇవాళ ఆ పరిస్థితి ఉందా? చెప్పండి. కాబట్టి పార్టీల్లో మౌలికమైన సంస్కరణలు కావాలి. కాంగ్రెస్‌పార్టీలో ప్రారంభమైన ఈ రుగ్మత దాదాపు అన్ని పార్టీలకు వ్యాపించింది. అందరూ దానిలో కూరుకుపోయారు. చాలా పార్టీలు కుటుంబ ఆస్తులుగా, వ్యక్తుల ఆస్తులుగా మారిపోయాయి. అది మౌలికమైన సమస్య.

**కటారి:** ఉచితాల గురించి దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. విద్య, ఆరోగ్యం వంటి రంగాలపై దృష్టి పెట్టాలి తప్ప పంచడం ప్రభుత్వ పనికాదని మీరు మొదట నుంచి చెబుతున్నారు. దానికి కౌంటర్‌గా వస్తున్న విమర్శ ఏంటంటే..వేలకోట్లు బ్యాంకులకు ఎగ్గొడుతున్న వారి గురించి మాట్లాడడం లేదు..దీనికి పరిష్కారం లేదా..అంటున్నారు.

**జేపీ:** ఎవరు అంటున్నారో వారికి పరిష్కారం ఇష్టం లేదు. ఇందులో రెండు అంశాలున్నాయి. స్వేచ్ఛాయుత వాణిజ్యం ఉంటే, మార్కెట్‌లో పోటీ ఉంటే మార్కెట్‌లో పెట్టుబడి పెట్టిన ప్రతీవాడు నెగ్గుతాడా? బట్టలు లేదా చెప్పులు పదిమంది ఉత్పత్తి చేస్తున్నారు..పదిమందీ నెగ్గలేరు కదా?మన్నిక, మార్కెటింగ్, బ్రాండ్ ఇమేజ్, ఖరీదు ఇలా వివిధ కారణాల వల్ల మనం కొన్ని ఉత్పత్తులనే కొంటాము. మిగతా వాళ్లు నష్టపోతారు. కానీ పెట్టుబడి పెట్టి దానికోసం నిలబడేవాళ్లంతా దేశద్రోహులు కాదు కదా? అందుకనే మార్కెట్ ఎకానమీలో ప్రపంచం ఏం చేస్తుంది..ఇప్పుడు కాదు 300 ఏళ్ల క్రితమే ఇది జరిగింది. లిమిటెడ్ లయబిలిటీ కంపెనీ అంటారు..ప్రపంచ ఆర్థిక వ్యవస్థను మార్చడంలో అది కీలకపాత్ర వహించింది.నువ్వు చిత్తశు ద్ధితో పెట్టుబడి పెట్టి నీ పొరబాటు ఏమీ లేకుండా వ్యాపారంలో పోటీ తట్టుకోలేక నష్టపోతే నీ లయబిలిటీ ఉంటుంది. కానీ కొంతమాత్రానికే పరిమితం అవుతుంది. అంతేకానీ భార్యాబిడ్డలకు తిండీ కూడా పెట్టలేక వీధిన పడిపోతే రేపు ఎవరూ కూడా సాహసం చేయరు. కాబట్టి మార్కెట్ ఎకానమీలో కొందరు ఖచ్చితంగా దివాలా తీస్తారు. అమెరికాలో ఆ కంపెనీ పోతుంది. వాడికి శక్తి ఉన్నంత

వరకు అప్పులు వసూలు చేస్తారు. మిగతాది సమాజం అబ్‌జార్బ్ చేస్తుంది. డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కోసం చాలా మంది ఖర్చు పెట్టారు..ఆదాయం లేదు. మునిగిపోయారు. కానీ సమాజానికి మేలు జరిగింది. అందుకని ఆ నష్టాన్ని ఆర్థిక వ్యవస్థ భర్తీ చేస్తుంది. అది వ్యాపారంలో సహజం. అది వేరు..లాలూచీ పడి, లంచాలు ఇచ్చి ఎగ్గొట్టాలని అప్పులు తీసుకుని, ఎగ్గొట్టడం వేరు. ఈ రెండింటికి తేడా ఉంది.

ఇప్పుడు రెండోదానికి వద్దాం.. లాలూచీ పడి అప్పులు తీసుకుని ఎగ్గొడుతున్నారు. బ్యాంకులు ఎక్కడవి?ఆ బ్యాంకుల్ని ఎవరు నిర్వహిస్తున్నారు? ప్రభుత్వరంగ సంస్థల బ్యాంకులు. ఏ ఒత్తిడితో చేస్తున్నారు..మన ఎంపీగారో లేదా మన ఎంపీగారి బంధువో అయితే ఎంపీగారే చేయించుకుంటున్నారు. పరిష్కారం ఏంటి? ఎంపీగారికి అధికారం లేకుండా చేయండి. ఎంపీగారికి అధికారం లేకుండా చేయడం ఎప్పుడు వస్తుంది. పెత్తనం ప్రభుత్వం చేతిలోనుంచి పోయినప్పుడు. అంటే బ్యాంకులను ప్రైవేటీకరించండి. దేశంలో అన్నిటి కంటే మార్కెట్‌లో పెద్ద బ్యాంకు ఎస్‌బీఐ. కానీ మార్కెట్ క్యాపిటల్ దేనికి ఎక్కువ ..హెచ్‌డీఎఫ్‌సీకి. ఒక్క హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు భారతదేశంలో ఉన్న అన్ని జాతీయ బ్యాంకుల కంటే ఎక్కువ మార్కెట్ క్యాపిటల్ ఉంది. ఎందుకని? ఇవన్నీ ఎవరు నిర్ణయించారు. మనమే నిర్ణయించాం. ఇవన్నీ పనికిరావు ఇదొక్కటే పనికొస్తుందని అంటు న్నాం. ఎందుకని? ఇక్కడ నిర్ణయాలు హేతుబద్ధంగా, వ్యాపారం కోసం వాస్తవాల ఆధారంగా జరుగుతున్నాయి. ప్రభుత్వరంగంలో నిర్ణయాలు రాజకీయంగా, పక్షపాతంతో అధికారంలో ఉన్నవాడికి అనుకూలంగా జరుగుతున్నాయి. మనం ఏం అంటున్నాం. బ్యాంకులను ఇలానే ఉంచాలంటున్నాం. బ్యాంకులను ప్రైవేటీకరించండి. అప్పుడు ఈ గొడవ ఉండదు. ఇప్పుడు ఏం చేస్తున్నాం. ఏడాదికి 72 నుంచి 80 వేల కోట్లు ఈ బ్యాంకులకు మళ్లీ ప్రజాధనం కట్టబెడుతున్నాం. గత ఐదేళ్లలో నాలుగు లక్షల కోట్ల రూపాయలు మనం బ్యాంకులకు ఇచ్చాం. ఎందుకని ఇవన్నీ దివాళా తీస్తున్నాయని. దొంగ రుణాలు ఇస్తే బ్యాంకులు ఖాయిలా పడతాయి. దొంగ రుణాలు ఎందుకు ఇస్తాయి..మీరు అధికారంలో ఉన్నారు కాబట్టి. పెత్తనం మీరు చేస్తున్నారు..నిర్ణయం మీరు చేస్తున్నారు. బ్యాంకు యాజమాన్యం చేయడం లేదు. ప్రజల కోసం చేయడం లేదు. ప్రజల పేరు చెప్పి మీరు నిర్ణయం చేస్తున్నారు. పరిష్కారం అది. దీనికి మీరు సిద్ధమా? మళ్లీ వీళ్లందరూ ప్రైవేటీకరణకు వ్యతిరేకం అంటారు. ప్రభుత్వీకరణ వల్ల సమస్యే ఇది. రాజకీయ జోక్యం ప్రభుత్వ రంగంలో ఉంటేనే వస్తుంది. హెచ్‌డీఎఫ్‌సీ మాతపడిపోయిందనుకోండి.మీకు..నాకు నష్టం ఏంటి? పెట్టుబడి పెట్టిన వాడు పోతాడు. మనకు ఆందోళన ఎందుకు? మనం మూలాల్లోకి వెళ్లకుండా పైపై నినాదాల వల్ల ఉపయోగం లేదు. మనం మొట్టమొదటినుంచి ప్రభుత్వరంగం పవిత్రమైందనే భావనలోనే ఉన్నాం. వ్యాపారంలో జోక్యం చేసుకోవడానికి అదే మూలం, డబ్బులు ఇవ్వాలా? వద్దా? అనేది వాడు నిర్ణయం చేస్తున్నాడు..సామర్థ్యం, శక్తిని బట్టీ కాదు..ఐడియాకు ఉన్న బలాన్ని బట్టి కాదు. రాజకీయంగా ఉన్న పలుకుబడిని బట్టి. అది తప్ప అన్నీ మాట్లాడుతున్నాం. ఇది కొంచెం గడుసుతనంతో మాట్లాడటం తప్ప ఆర్థిక వ్యవస్థ గురించి అర్థం అయి మాట్లాడటం కాదు.

**కటారి:** పెద్ద పారిశ్రామికవేత్త ఎవరో ఒకరు ఉంటారు. పది రకాల కంపెనీలు పెడతారు. వాళ్లు సమాజంలో లక్షల కోట్లకు పడగలెత్తి కనిపిస్తారు. వారు పెట్టిన కంపెనీల్లో ఒకటి మూత పడుతుంది. అలాంటి వారికి కూడా వేల కోట్ల రూపాయలు ప్రభుత్వాలు మాఫీ చేస్తున్నాయనే విమర్శలున్నాయి.

**జేపీ:** అదే రాజకీయ జోక్యం. ఆ వ్యాపారి నా పార్టీలో చేరితేనో లేదా పార్టీకి విరాళం ఇస్తేనో అనుకూలంగా చేయడం. ఈ తరహా మాఫీలు బ్రిటన్‌లో జరగవు..అమెరికా, ఆస్ట్రేలియా,ఫ్రాన్స్, జర్మనీలో జరగవు..అక్కడ ప్రభుత్వ బ్యాంకులు లేవు..ప్రైవేటు బ్యాంకులే ఉన్నాయి. అవి పారదర్శకంగా చేస్తాయి..ఎవరైనా మోసం చేస్తే బ్యాంకు మూతపడిపోతుంది. నీకు..నాకు ఇబ్బంది లేదు. మనదలా కాదే..మనం నిర్ణయం చేస్తున్నాం. ప్రధానమంత్రో, ముఖ్యమంత్రో ఎంపీ లేదా మంత్రో నిర్ణయం చేస్తున్నారు. ఖచ్చితంగా దివాలాకు దారి తీస్తుంది. నేను సహకార బ్యాంకులో ఉన్నప్పుడు ఎంతోమంది ఫోన్లు చేసేవారు..ట్రాక్టర్ పేరుతో లోను ఇవ్వండి సార్ అనేవారు. అక్కడ ట్రాక్టరు లేదు ఏమీ లేదు. నిజంగా ట్రాక్టర్ కోసం అయితే ఇస్తాం..ఆ పేరుతో ఇవ్వండి సార్ ఎలక్షన్‌లో పోటీ చేస్తున్నాడు అంటారు. ఇదీ మన రాజకీయం. చిన్న స్థాయిలో సహకార బ్యాంకులో ట్రాక్టర్ లోన్ ఎలా ఇవ్వాలని చెబుతున్నామో పెద్ద స్థాయిలో వీడు మా వాడే నాకు మొన్న ఎలక్షన్‌లో రూ. 100 కోట్లు ఇచ్చాడు. వాడికో రూ. 1000 కోట్లు లోన్ కావాలంట ఇచ్చేయ్ అని చెబుతున్నారు. ఆ అధికారం వారి చేతుల్లో పెట్టాం. ఆ తర్వాత ఈ డబ్బులన్నీ మాఫీ చేశారని బాధ పడుతున్నాం. ఆ మూలంలోకి వెళ్లడం లేదు. ఎందుకని రూ.1000 కోట్లు లోన్ ఇచ్చారని మనం అడగడం లేదు. ఇతర దేశాల్లో ఇలా ఎందుకు జరగడం లేదో మనం చూడడం లేదు. వామపక్ష భావాలు కలిగిన కుటుంబాల పిల్లల్ని కూడా ఏ బ్యాంకులో అకౌంట్ కావాలని ఒకసారి అడగండి.. బ్యాంకుల్లో పనిచేస్తున్న వారు కూడా మా పిల్లలు మేం పనిచేసే బ్యాంకుల్లో అకౌంట్ వద్దంటున్నారు సార్ అని చెబుతున్నారు. ఇది వాస్తవం. ఆ పిల్లలకు తండ్రి అంటే వ్యతిరేకత ఉందా? తండ్రి జీవితాంతం పనిచేసిన బ్యాంకు అంటే వ్యతిరేకత ఉందా? ఏ బ్యాంకు తనకు సమర్థంగా సేవలు అందిస్తుందో దానిని నిర్ణయించుకుం టున్నారు. మనం అది మర్చిపోతున్నాం. మౌలికమైన సమస్య అది. దాన్ని పక్కన పెట్టేసి చూస్తున్నాం. తాయిలాలు తప్పని మనకందరికీ తెలుసు. అలాగని కష్టంలో ఉన్న ప్రజల్ని ఆదుకోవద్దని ఏ మూర్ఖుడూ చెప్పడు. ఒక సమతూకం ఉండాలి. ప్రభుత్వం చేయాల్సిన పనులు చేయకుండా చట్టబద్ధ పాలన లేకుండా, రోడ్లన్నీ అధ్వానంగా ఉండి, వర్షం వస్తే వరదలు వచ్చి, మ్యాన్‌హోల్‌లో పడి మనుషుల ప్రాణాలు పోయే పరిస్థితి వచ్చి, మురుగునీళ్లన్నీ మంచినీళ్లలో కలిసిపోయి అవి తాగి ప్రాణాలు పోయే పరిస్థితి తెచ్చి, డబ్బులు ఖర్చు పెట్టినా పిల్లలకు విద్య అందకుండా, ఆరోగ్యం అందకుండా చేసి.. ప్రభుత్వం చేయాల్సిన పనులను విస్మరించి నేను మీ ఖాతాలో డబ్బులు వేశాను. నేను గొప్పవాడ్ని.. మీ అందరికీ

డబ్బు పంచిపెట్టిన దానకర్ణుడ్ని మీరంతా బానిసలుగా ఉండి నాకు ఓటేయండి..అంటున్నారు..ఇదా పరిపాలన అంటే? ఎక్కడో ఒక చోట సమతూకం కావాలి..

**కటారి:** ఇప్పుడు ఏం జరుగుతుందంటారు..సుప్రీంకోర్టు చొరవ తీసుకుంది. గతంలో కూడా చాలా సందర్భాల్లో చర్చ జరిగినా అది ఎన్నికల సంఘం నిర్ణయిస్తుందా? ఆర్‌బీఐ నిర్ణయిస్తుందా? సుప్రీంకోర్టు నిర్ణయిస్తుందా? రాజకీయపార్టీలు నిర్ణయిస్తాయా? అనే సందిగ్ధం ఉంది.

**జేపీ:** నిర్ణయాధికారం సుప్రీంకోర్టుకు లేదు. అయితే రాజకీయ పార్టీలకు దీన్ని చర్చించే ధైర్యం లేనప్పుడు కనీసం సుప్రీంకోర్టు పెద్దమనిషిలా ఒక చర్చ మొదలుపెడితే మంచిదే దీన్ని ఆహ్వానిస్తాను. పరిష్కారం మూడు విషయాల్లో ఆలోచించాలి. ఒకటి..రాష్ట్రాల హక్కులను మనం కాలరాయకూడదు. ఆర్థిక క్రమశిక్షణకు ఏర్పాట్లు చేస్తూనే మీరు ప్రతీది ఇలా చేయాలనే మైక్రో మేనేజ్‌మెంట్ ఉండకూడదు. రెండోది..ఏం చేసినా కూడా అందరికీ నిష్పాక్షికంగా సమానంగా వర్తించేటట్టు ఉండాలి. మా పార్టీ ఒక రాష్ట్రంలో అధికారంలో ఉంటే ఒక రీతి..ఇంకో పార్టీ మరో రాష్ట్రంలో ఉంటే మరో రీతి అనే విధంగా కాకుండా మనం నమ్మకం కలిగించే వ్యవస్థ ఏర్పాటు కావాలి. మూడోది..జాతీయస్థాయిలో ప్రభుత్వానికి, రాష్ట్రాలకు సమానంగా సూత్రాలు వర్తించాలి. నా దృష్టిలో ఈ మూడు కీలకం. దీనిపై ఓ పత్రం తయారు చేస్తున్నాం. పార్టీలకు ప్రభుత్వాలకు త్వరలో ఇవ్వబోతున్నాం. అదృష్టవశాత్తు అంబేద్కర్ పుణ్యమా అని రాజ్యాంగంలో 293వ అధికరణంలో జాతీయ స్థాయిలో ఉన్న ప్రభుత్వానికి పాత్ర కల్పించారు. రాష్ట్రాలు అప్పులు చేయాలంటే విధిగా ముందు జాతీయ ప్రభుత్వం అనుమతి కావాలి. దాన్ని ఉపయోగించాలి. అలాగే అప్పులకు అనుమతి ఇస్తే షరతులు పెట్టే అవకాశం కూడా ఉంది. కాబట్టి ఒక అస్త్రం మన చేతుల్లో ఉంది. ఈ అస్త్రాన్ని ఎవరు ఉపయోగించాలి. ప్రభుత్వం ప్రత్యక్షంగా కాదు.. అధికార యంత్రాంగమూ కాదు. ఈ అస్త్రాన్ని నిజంగా మంచిగా ఉపయోగించినా కూడా ఆరోపణలు ఉంటాయి. తాటి చెట్టుకింద పాలు తాగినా కల్లు అనుకుంటాం. కాబట్టి ప్రభుత్వేతర సంస్థను పెట్టాలి. ఉదాహరణకు ఆర్థిక సంఘం ఉంది. ఒకస్థాయి, గౌరవం ఉన్న సంస్థ. దానికి రాజ్యాంగ బద్ధత ఉంది. దానికి శాశ్వత ప్రతిపత్తి కల్పించి దాని చేతుల్లో ఈ అధికారాన్ని పెట్టండి. జాతీయ, రాష్ట్రాలు ఈ రెండింటి మీదా కూడా అధికారాన్ని ఇవ్వండి. మీరు రాష్ట్రం ఏం చేయాలో చెప్పొద్దు. కానీ సమతూకం పాటించాలి. ఖచ్చితంగా రెవెన్యూ లోటు ఉండకూడదు. ఈ రోజు చాలా రాష్ట్రాలు అప్పుల్ని కేవలం సాధారణ ఖర్చులకే పెట్టేస్తున్నారు..అంతకంటే దారుణం ఉందా? ఇవాళ్టి నా ఖర్చు కోసం పిల్లల మీద అప్పుభారం పెడతానా? ఏ కుటుంబంలో అయినా పెడితే వాడ్ని తిడతాం. ప్రభుత్వాలు చేస్తే ఎందుకు ఒప్పుకుంటాం? కాబట్టి రెవెన్యూ లోటు అనేది లేకుండా చేసి ఓ సమతూకం పాటించేలా చేయాలి.అంతేకాని ఇవన్నీ ఆపేయమని చెప్పే హక్కు ఎవరికీ లేదు. మరీ అతిగా చేయబోకండి. శ్రీలంకలాగా తయారుకాబోకండి..ఆర్థిక వ్యవస్థను కుప్పకూల్చబోకండి. ఆ రకమైన యంత్రాంగం కావాలి. ఇవాళ అవకాశం ఉంది. దాన్ని సరిగా చేస్తారని ఆశపడుతున్నాను.

**కటారి :** 75 ఏళ్ల స్వాతంత్రోత్సవం, 25 ఏళ్ల లోక్‌సత్తా వార్షికోత్సవం ఈ నేపథ్యంలో కొత్త తరానికి మీరు ఏం చెబుతారు.


**జేపీ:** చాలా మంది దేశం అంతా నాశనం అయిపోయింది. ప్రపంచం అంతా మునిగిపోయిందనే భావనలో ఉంటారు. నాకైతే అలా అనిపించడం లేదు. నా కళ్లకు కారుచీకట్లో కూడా దీపపు స్తంభం కనిపిస్తోంది. మన రాజకీయం మరింత కుళ్లింది..ఆనాటి కంటే ఓట్ల కోసం ఎక్కువ ఖర్చు పెడుతున్నారు. అప్పుడు రూ.కోటి అంటే ఇప్పుడు రూ. 30 కోట్లు అయిపోయింది. కానీ అదే సమయంలో ప్రభుత్వాలతో సంబంధం లేకుండా కమ్యునికేషన్ల వల్ల కావొచ్చు, ప్రజల్లో చైతన్యం కాస్తో కూస్తో పెరగడం వల్ల కావొచ్చు. ప్రపంచానికి పూర్వం కంటే ఎక్కువగా అనుభవం రావడం కావొచ్చు. చాలా రంగాల్లో మంచి మార్పులు కూడా వస్తున్నాయి. కాబట్టి మొట్టమొదట నేను కోరేది నిరాశకు తావు లేదు. సమస్యలున్నాయి..కానీ పరిష్కారాలు కూడా పుష్కలంగా ఉన్నాయి. దానికోసం వనరులున్నాయి. ఇన్నేళ్లు కొన్ని రంగాల్లో తప్పులు చేసినా మంచి అనుభవం వచ్చింది. కాబట్టి హేతుబద్ధంగా ఆలోచిస్తే పరిష్కారాలున్నాయి. పరిష్కారంలో భాగం కండి..మీ ముందు తరాల్లో ఏనాడు లేనంత అద్భుతమైన జీవితం మీ కళ్లముందు ఉంది. ఈ దేశంలోనే కాదు ప్రపంచంలో కూడా. గొప్ప లోకంలో మీరున్నారు. అందుచేత ఆత్మవిశ్వాసం వదలకండి. మీరు చేయాల్సిందల్లా పరిష్కారంలో భాగం కండి. నైపుణ్యాన్ని పొందండి. ఊరికే నినాదాలు ఇచ్చి అరుపులు, పెడబొబ్బలు కాకుండా చిన్నదో పెద్దదో పరిష్కారంలో భాగం కావాలి. అప్పుడు ఆర్థికంగానూ మీరు పెరుగుతారు. సమాజానికి మంచి చేయగలుగుతారు. కులం, మతం, వర్గం అనేది పిచ్చి అని గుర్తించండి. అవి మీకు నష్టాన్ని కలగజేస్తాయి. మిమ్మల్ని మీరు సంకుచితంగా చేసుకుని, బందీలుగామారి నష్టపోతున్నారు. మీకు ఏది లాభమో ఆ పని చేయండి. మీ పిల్లలకు చదువు కావాలంటే మీకు ముందు మంచి టీచరు కావాలి..కులం తర్వాత చూద్దాం. మీకు మంచి ఆరోగ్యం కావాలంటే మంచి సర్జన్ కావాలి..కులం తర్వాత చూద్దాం. కాబట్టి మీకు ఏది లాభమో ఆలోచించండి. అంతకంటే నేను ఎక్కువేమీ కోరడం లేదు. కాస్తంత దీర్ఘకాలిక భవిష్యత్తు కోసం, సొంత జీవితం కోసం ధైర్యంగా చేయండి. సమాజహితంకోసం కొద్దిగా ఓపిక పట్టండి. ఇవాళ కొంచెం కష్టపడితేనే రేపు మంచి జీవితాన్ని అనుభవిస్తాం. వ్యక్తి కూడా అంతేకదా? పిల్లలు కూడా అదే పనిగా టీవీ చూస్తుంటే ఏం చేస్తాం? దానికి ఓ పరిమితి ఉంది నాన్నా.. అది దాటితే మీ జీవితం నాశనం అవుతుందని తల్లిదండ్రులుగా నచ్చచెబుతాం. వెంటనే పిల్లలకు కోపం వస్తుంది. తలుపు బడాలున కొడతారు...అయినా నచ్చచెబుతాం. పిల్లలకు ఏది వర్తిస్తుందో, కుటుంబానికి ఏది వర్తిస్తుందో సమాజానికి కూడా అంతే. రేపటి మంచి కోసం ఇవాళ కొద్దిపాటి శ్రమకు సిద్ధపడాలి. అంతేకాని అంతా సుఖమే కావాలనుకుంటే నాశనం అయిపోతాం. గొప్ప కాలంలో యువతరం ఉంది. ధైర్యంగా వెళ్లండి. మీ జీవితానికి మీరే హీరో అని మర్చిపోబోకండి.

(గత సంచిక తరువాయి)

# అందరికీ ఆరోగ్యానికి ఆచరణసాధ్య నమూనా

**సమర్థవంతం / అందుబాటు / అతి తక్కువ వ్యయం**

**జులై 2021** (తెలుగులో స్థూల అనువాదం)



**(గమనిక: ప్రజలపై ఎటువంటి ఆర్థిక భారం లేకుండా భారతదేశంలో అందరికీ నాణ్యమైన ఆరోగ్యాన్ని జీడీపీలో అతి తక్కువ వ్యయంతో అందించేందుకు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ నేతృత్వంలో ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) ఇంగ్లీషులో రూపొందించిన సమగ్ర ఆరోగ్య విధానానికి స్థూలంగా తెలుగులో చేసిన అనువాదమిది. ఇందులో పట్టికలు, గణాంక పటాలు, అనెగ్జర్ల వివరాలుండవు. ఆరోగ్య విధానంపై రూపొందించిన పుస్తకంలో పూర్తి సమాచారం ఉంటుంది)**

## సిఫార్సుల సారాంశం

## తృతీయ స్థాయి సేవలు

| | |
|---|---|
| ప్రభుత్వ రంగ తృతీయ స్థాయి సేవలు | ప్రభుత్వ బోధన, జిల్లా ఆస్పత్రుల్లో ఉచితంగా తృతీయ స్థాయి వైద్యం. |
| ఎఫ్.పి లేదా ద్వితీయ స్థాయి సేవల వైద్యుని నుండి సిఫార్సు (రెఫరల్ ) | ఎఫ్.పి నుండి లేదా ద్వితీయ స్థాయి సేవల వైద్యుని నుండి రెఫరల్‌తో మాత్రమే తృతీయ స్థాయి వైద్యం అందించటం జరుగుతుంది. ఎమర్జెన్సీ కేసుల్లో మాత్రం మినహాయింపు ఉంటుంది. |
| ప్రభుత్వాస్పత్రుల ఆధునీకరణ | మరింత పైస్థాయి తృతీయ స్థాయి సేవలకు అవసరమైన అన్ని పరికరాలు, యంత్రాలు, వనరులు, నైపుణ్యాలతో 1,40,000 దాకా పడకలతో 100 బోధనాస్పత్రులను మొదటి అంచె (టయర్ 1) ఆస్పత్రులుగా ఆధునీకరించటం.<br><br>మిగిలిన ప్రభుత్వ బోధనాస్పత్రులు, జిల్లా ఆస్పత్రులను 1,47,000 పడకలతో రెండవ అంచె (టయర్ 2) ఆస్పత్రులుగా మిగిలిన అన్ని తృతీయ స్థాయి చికిత్సలకూ ఆధునీకరించటం.<br><br>మూడేళ్ల చివరి నాటికి ఒక్కో పడక వ్యయం టయర్ 1 |

| | |
|---|---|
| | ఆస్పత్రుల్లో రూ.25 లక్షలకు, టయర్ 2 తృతీయ స్థాయి ఆస్పత్రుల్లో రూ.20 లక్షలకు చేరుతుంది. |
| ఎంపిక చేసిన చికిత్సల్లో ఎంపిక అవకాశం, పోటీ | ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే కొన్ని ఎంపిక చేసిన చికిత్సల్లో సేవకు-రుసుము పద్ధతిని ప్రవేశపెట్టవచ్చు. ఆస్పత్రులు తమకు బలాలు, పోటీపరంగా సానుకూలతలు ఉన్న విభాగాల్లో ప్రతిభను ఆకర్షించటానికి, పనితీరుకు ప్రోత్సాహకాలివ్వటానికి, ప్రత్యేకీకరించిన (స్పెషలైజ్డ్) సంరక్షణను ప్రోత్సహించటానికి ఇది దోహదం చేస్తుంది. తృతీయ స్థాయి వైద్య నిధుల్లో 20%ని ఈ ఏర్పాట్ల కోసం పక్కన పెట్టవచ్చు. |
| పి.పి.ఎ | వివిధ రోగ నిర్ధారణలు, వైద్య సేవలకు ఏకతూరి మూలధన పెట్టుబడి కోసం ప్రభుత్వాస్పత్రుల్లో ప్రయివేటు పెట్టుబడి చొరవ (పి.ఎఫ్.ఐ)ను, నిర్వహణ సేవల ఔట్‌సోర్సింగ్‌లను అమలు పరచవచ్చు. |
| సేవకు-రుసుము | ఆస్పత్రిలోని ప్రయివేటు బ్లాకుల్లో స్వతంత్రంగా పనిచేయటం, నాయకత్వ అవకాశాలు, బోధనాస్పత్రుల్లో పార్ట్-టైమ్ ప్రాక్టీస్, నమూనాలో పారితోషికం.. వంటి వెసులుబాటు పద్ధతుల్ని తృతీయ స్థాయి ఆస్పత్రుల్లో బోధన, ప్రాక్టీస్ చేసేలా పేరున్న నిపుణులకు ప్రోత్సాహకాలుగా అనుసరించవచ్చు. |
| స్వయంప్రతిపత్తి | సమర్థవంతమైన జవాబుదారీ వ్యవస్థల ఏర్పాటు, ఫలితాలను నిష్పాక్షికంగా బేరీజు వేయటం, పనితీరు పర్యవేక్షణలతో స్వయం ప్రతిపత్తి, స్థానిక నిర్ణయాధికారం, వినూత్న చొరవలకు వీలుగా ప్రస్తుత నమూనాను పునర్నిర్మించటం. |

**తృతీయ స్థాయి వైద్యానికి అయ్యే వ్యయ అంచనాలు - ఏడాదికి రూ.36,000 కోట్లు.**

**ప్రాథమిక, ద్వితీయ, తృతీయ స్థాయి వైద్యానికి ఖజానాకు అయ్యే మొత్తం అదనపు వ్యయం - రూ.93,000 కోట్లు లేదా జి.డి.పిలో 0.5%.**

**తరువాయిమాట**

ఒక ప్రజాస్వామ్య సమాజంలో రాజకీయాలే అన్నిటికీ కేంద్రబిందువు. మనిషి ఆనందాన్ని పెంపొందించటమే నిజమైన రాజకీయాల లక్ష్యం. ఆనందంలోని ఒక కీలక అంశం ఆరోగ్యం. పాలన అంటే, పరస్పర విరుద్ధమైన డిమాండ్లను సైతం సమన్వయం చేస్తూ, పరిమిత వనరులను అపరిమిత అవసరాలకు సరైన ప్రాథమ్యాల ద్వారా కేటాయించటం. అంతిమంగా, ఖర్చు చేసే డబ్బుకి అత్యుత్తమ విలువను చేకూర్చేందుకు.. వ్యవస్థల్ని సమర్థవంతంగా నిర్వహించటం, ప్రోత్సాహకాలు, జవాబుదారీతనానికి పద్ధతుల్ని నిర్మించటంలోనే పాలనా కళ ఇమిడి ఉంటుంది.

ప్రజలకు ఫలితాలను అందించే వ్యవస్థీకృత సామర్థ్యాన్ని పెంచుకోకుండా భారతదేశంలో ప్రభుత్వాలు నానా బాధ్యతల్నీ భుజాన వేసుకున్నాయి. చారిత్రకంగా ఈ తప్పిదం చేస్తూ వస్తున్నాయి. రాజ్యవ్యవస్థ మౌలిక బాధ్యతల పట్ల నిర్లక్ష్యానికి ఈ వైఫల్యం దారితీసింది. ఆధునిక నాగరిక సమాజంలో, రక్షణ, శాంతిభద్రతలు, చట్టబద్ధపాలన, న్యాయం వంటి సార్వభౌమ బాధ్యతలతోపాటు, మానవ సామర్థ్యాల్ని వికసింప చేసి, ఉన్నతస్థాయికి ఎదిగే అవకాశాలను సృష్టించేందుకు అత్యంత కీలకంగా పట్టించుకోవాల్సిన అవసరాలు ఆరోగ్యం, విద్య. అందువల్లే, ప్రభుత్వం తాను చేయనవసరంలేని పనుల నుండి వైదొలగేందుకు ఇటీవల చేస్తున్న ప్రయత్నాలు ఎప్పుడో చేయాల్సినవి, ఆహ్వానించదగినవి. రాజ్యవ్యవస్థ తన ప్రధాన పాత్ర- మౌలిక వసతులు, విద్య, ఆరోగ్యం, సామాజిక భద్రతలను క్రమంగా గుర్తిస్తోంది. మితిమీరిన ప్రేమతో పిల్లల్ని చెడగొట్టే తల్లిదండ్రుల్లా ఇప్పటిదాకా వ్యవహరించిన రాజ్యం.. వివక్ష లేకుండా ప్రతి బిడ్డా ఎదిగేందుకు సమన్వయకర్తగా తాను నిర్వహించాల్సిన అసలు పాత్రను గుర్తిస్తోందన్న వాస్తవానికి ఇది సంకేతం. మన శక్తిసామర్థ్యాల్ని, వనరుల్ని మానవ సామర్థ్యాల్ని ఆవిష్కరించే ఆ రంగాల్లో కేంద్రీకరించాలి. కొద్దిపాటి విజ్ఞత, అర్థవంతమైన విధానాలు, సరైన దిశలో ఓ మోస్తరు కేటాయింపులు, సమర్థవంతమైన అమలు వ్యవస్థలు.. అభివృద్ధిని, మానవ ఆనందాన్ని పెంపొందించే క్రమంలో ఎంతో సాధిస్తాయి.

(ఇంకా ఉంది. . . )




## ఆబాలగోపాలం తప్పక చూడాల్సిన, భద్రపరచుకోవాల్సిన 5 అద్భుత ఇంటర్వ్యూలు @

# youtube.com/JP Loksatta

స్వతంత్ర భారతం 75 - లోక్‌సత్తా 25 కలిసి వచ్చిన అపురూప సందర్భంలో భవిష్యత్ భారత కార్యాచరణపై ఆబాలగోపాలం తప్పక చూడాల్సిన, భద్రపరచుకోవాల్సిన 5 అద్భుత ఇంటర్వ్యూలు ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్‌తో..

1) **సామాజిక, రాజకీయ విశ్లేషకురాలు, యువ జర్నో స్వాతి ఇంటర్వ్యూ :**
   ఎన్నికల్లో ముక్కుమూసుకుని ఓట్లు వేయటం, ఎవర్ని గెలిపించినా ఏమున్నది గర్వకారణం అని నిట్టూర్చటం, మార్పు కోసం ఏదైనా చేయగల సత్తా ఉన్న యువత రోజువారీ జీవితంలోనే అలసిపోతుండటం.. ఏమిటి చేయటం?.. ఇంకా పలు ప్రశ్నలు.
2) **లైఫ్‌లో ఇంతవరకూ ఎవరినీ ఇంటర్వ్యూ చేయని సామాజిక, పాలనా అంశాల ఉద్యమకారులు, ఫోరమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్ కార్యదర్శి పద్మనాభరెడ్డి ఎక్స్‌క్లూజివ్ :**
   రాజకీయాల్లోకి వస్తే చెప్పుతో కొట్టండి.. అన్న వారిని అధికారంలోకి తేవటం తప్ప లోక్‌పాల్ ఉద్యమం సాధించింది ఏమిటి? దేశంలో అవినీతి ఎందుకు అంతం కావటం లేదు?.. & మోర్.
3) **సామాజిక, రాజకీయ ఉద్యమకారులు, మీడియా విశ్లేషకులు కటారి శ్రీనివాసరావు ఇంటర్వ్యూ:**
   మోదీ, కేసీఆర్, జగన్‌ల బాకాలే తప్ప ఉద్యమకారులు, పౌర సమాజం గొంతు ఈవేళ బలంగా ఎందుకు వినిపించటం లేదు? ఏవి ఉచితాలు, ఏవి అనుచితాలు.. సంక్షేమం అంటే ఏమిటి?.. ఇంకా అనేక అంశాలు (రెండు భాగాలు).
4) **విద్యావేత్త, వ్యక్తిత్వ వికాస నిపుణులు, రచయిత ఆకెళ్ల రాఘవేంద్ర ఎక్స్‌క్లూజివ్:**
   ట్యాక్స్ ఎగ్గొడితే అది నల్లడబ్బు. మరి సరిగా సేవలు అందించని ప్రభుత్వాలకు పన్ను సరిగా కట్టనక్కర్లేదనుకునే పౌరులు కూడా బ్లాక్‌మనీగాళ్లే అవుతారా? ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు ఎలా ఉండాలి?.. & మోర్ (రెండు భాగాలు).
5) **పబ్లిక్ పాలసీ యువ రీసెర్చర్ సుమేధ ఇంటర్వ్యూ (ఇందులో జేడీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు వీవీ లక్ష్మీనారాయణ కూడా పాల్గొన్నారు):**
   మోదీ ఈడీని ప్రయోగిస్తున్నాడని ఆరోపిస్తున్నారు గానీ.. ఒక్క పార్టీ కూడా చట్టబద్ధపాలనని సంస్కరించాలని ఎందుకు డిమాండ్ చేయటం లేదు? డ్రగ్స్‌ని నిషేధించినా ఎందుకు అదుపు చేయలేకపోతున్నారు?.. ఇంకా పలు ప్రశ్నలు.

RNI. Regd No. 69976/98 Postal Reg. No. HD-913/2021-2023 Published on 10th JULY, 2023 Posting Date 15 &16th of every month







# ఆరోగ్య తెలంగాణకి విజన్ డాక్యుమెంట్ రౌండ్ టేబుల్ సమావేశం

ఆరోగ్య ఖర్చులు భరించలేక ఏటా 6.5 కోట్ల మంది పేదలుగా మారటం దేశానికి సిగ్గుచేటని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు, జాతీయ హెల్త్ మిషన్ రూపశిల్పి డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. 'తెలంగాణలో అందరికీ నాణ్యమైన ఆరోగ్యాన్ని ఆర్థిక భారం లేకుండా అందించటానికి విజన్ 2030' అంశంపై ఎఫ్‌టీసీసీఐ (తెలంగాణ వాణిజ్య, పరిశ్రమల సమాఖ్య) హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఆరోగ్య సంరక్షణపై ఒక పారిశ్రామిక సమాఖ్య దార్శనిక పత్రం రూపొందించాలనుకోవడం అభినందనీయమన్నారు. దేశ ఆరోగ్య వ్యయంలో 58 శాతం ప్రజలు జేబుల్లో నుంచి పెట్టుకుంటున్నారన్నారు. దేశంలో 90 శాతం మంది అసంఘటిత రంగంలో ఉన్న మన దేశంలో ఆరోగ్య సమస్యలకు ప్రయివేటు ఇన్సూరెన్స్ పరిష్కారం కాదన్నారు. జీడీపీలో 18 శాతందాకా ఆరోగ్య రంగానికి వెచ్చిస్తున్న అమెరికాలాంటి సంపన్న దేశం కూడా ఇన్సూరెన్స్ నమూనా వల్ల ఫలితాలను సాధించటం లేదన్నారు. మన దేశంలో ఫ్యామిలీ ఆరోగ్య వ్యవస్థ అధ్వాన్నంగా తయారైందన్నారు. ఉస్మానియా ఆస్పత్రికి రోజూ 6,000 మంది పేషెంట్లు వస్తుండగా, గాంధీకి 4,000, ఢిల్లీ ఎయిమ్స్‌కి 12,000 మంది వస్తున్నారని, ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థ విఫలమై అందరూ పెద్దాస్పత్రులకు రావటం వల్ల అక్కడ ఒత్తిడి పెరిగి సేవలు కుంటుపడుతున్నాయన్నారు. ప్రపంచంలో అత్యుత్తమ ఆస్పత్రికి రోజుకు 700కి మించి ఔట్ పేషెంట్లు రారన్నారు. మనకు మెడికల్ డాక్టర్ల కొరత లేదని, తెలంగాణ నుంచే ఏడాదికి 7,000 మంది ఎంబీబీఎస్ పట్టా తీసుకుంటున్నారని, త్వరలో ఈ సంఖ్య 8,000 కానుందన్నారు. దేశంలో ఆరోగ్య రంగానికి కేటాయింపుల్ని కేవలం 1% పెంచి సరైన పద్ధతిలో ఖర్చు చేస్తే ప్రజలకు జేబుఖర్చు లేకుండా నాణ్యమైన ఆరోగ్యం అందటమే కాకుండా కనీసం కోటి ఉద్యోగాలను సృష్టించవచ్చన్నారు. కార్యక్రమంలో ఐఐపీహెచ్ డైరెక్టర్ జి.వి.ఎస్ మూర్తి, స్కూల్ ఆఫ్ మెడిసిన్ సైన్సెస్ ప్రొఫెసర్ డాక్టర్ సామన్న, పలువురు 'ఆయుష్' వైద్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సీనియర్ పాత్రికేయులు, పౌరులు పాల్గొన్నారు. ఎఫ్‌టీసీసీఐ ఆరోగ్య కమిటీ చైర్మన్ శేఖర్ అగర్వాల్ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.

*If undelivered please return to:*
*LOKSATTA UDYAMA SAMSTHA,*
*H.NO. 6-3-678,B-106,*
*PASHA COURT 71, Somajiguda,*
*Behind TRIBHUVANDAS*
*JEWELLERS (TBZ),*
*Hyderabad - 500 082*

**Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, H.NO. 6-3-678,B-106,PASHA COURT 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS (TBZ), Hyderabad- 500 082. Printed at Kala Jyothi Process Pvt Ltd, 1-1-60/5, RTC "X" Roads, Hyderabad 500 020**